www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 60 | శనివారం | 19 ఆగస్టు, 2017

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



కొత్త రూ.50 నోటు

ఇప్పుడున్నదీ చెల్లుబాటు

కొత్తది త్వరలోనే విడుదల కానున్నట్లు ఆర్‌బిఐ ప్రకటన

9లో



కూలిన కాళ్లకింది నేల

క్షణాల తేడాలో నీట కలిసిన ప్రాణాలు

బీహార్ అరారియా జిల్లాలో వరదలకు ఒకే కుటుంబంలో ముగ్గురు బలి

10లో

వామపక్షాల కీలకపాత్రతో విశాల ఐక్య వేదిక అవసరం -సురవరం సుధాకర్‌రెడ్డి 10

ఆదర్శ భూసర్వే

ఈ అనుభవం దేశమంతటికీ ఉపయోగపడుతుంది

- త్వరలోనే ఢిల్లీకి పూర్తిస్థాయి ప్రాజెక్టు రిపోర్టు : కేంద్ర బృందంతో ముఖ్యమంత్రి కెసిఆర్
- సమగ్ర భూసర్వే ఓ విప్లవం – కేంద్ర అధికారి హుకుమ్‌సింగ్



మన తెలంగాణ/ హైదరాబాద్: తెలంగాణలో పెద్ద ఎత్తున చేపట్టే భూ సర్వే కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం తరుపున సహకారం కావాలని, రాష్ట్రంలో ఈ కార్యక్రమం జరిగాక, దేశ వ్యాప్తంగా కూడా నిర్వహించడానికి ఇక్కడి అనుభవం పనికి వస్తుందని, త్వరలోనే పూర్తిస్థాయి ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసి కేంద్రానికి పంపుతామని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు అన్నారు. రాష్ట్రంలోని 10,875 రెవెన్యూ గ్రామాల పరిధిలో గ్రామం యూనిట్‌గా ఈ సర్వే జరుగుతుందని, ఒక్కో గ్రామంలో నెల రోజుల పాటు అధికారులు ఉండి, రైతుల సహకారంతో భూ రికార్డులలో మార్పు (అప్‌డేట్) చేస్తారని తెలిపారు. ప్రగతి భవన్‌లో శుక్రవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి (భూ వనరులు) హుకుమ్ సింగ్ నేతృత్వంలోని కేంద్ర బృందం సిఎం కెసిఆర్‌తో సమావేశమైంది. రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర భూ సర్వేపై చర్చించారు. రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వేపై సిఎం కెసిఆర్ కేంద్ర అధికారులకు వివరించారు. 1932–36 మధ్య నిజాం హయాంలో భూసర్వే జరిగిందని, తర్వాత మళ్లీ ఎప్పుడూ సర్వే జరగలేదని, భూ వివరాలు సరిగ్గా లేకపోవడం వల్ల అనేక అనర్థాలు, వివాదాలు జరుగుతున్నాయని సిఎం అన్నారు. ఏ భూమి ఎవరి యాజమాన్యంలో ఉందనే విషయంలో గొడవలు జరుగుతున్నాయని సిఎం కేంద్ర ప్రభుత్వ అధికారులకు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం దేశంలో మరెక్కడా లేని విధంగా ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.8 వేల చొప్పున పెట్టుబడి అందించే కార్యక్రమం తీసుకుందని, రైతులకు పెట్టుబడి పథకం సరిగ్గా అమలు కావాలంటే, ఏ భూమి ఎవరి ఆధీనంలో ఉందో తెలియాలని, కాబట్టే భూసర్వే చేస్తున్నామన్నారు. రికార్డులను ఆన్‌లైన్‌లో పెడతామని, సరిచేసిన తర్వాత కొత్త పాస్‌పుస్తకాలు అందజేస్తామన్నారు. పారదర్శకంగా ఉండేలా రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కూడా సంస్కరణలు తెస్తున్నామన్నారు. రిజిస్టర్ అయిన రోజే పేరు మార్చుతూ మ్యుటేషన్ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశామని, ఇవన్నీ పనులు సరిగ్గా జరగాలంటే ముందు భూమి వివరాలు సమగ్రంగా ఉండడం ముఖ్యమన్నారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఏ వివరాలు సరిగ్గా ఉండేవి కావని,

తరువాయి 6లో

ఇన్ఫోసిస్ కుదేలు

- సిఇఒ రాజీనామాతో కరిగిపోయిన రూ.22,500 కోట్లు
- నారాయణ మూర్తి నుంచి ఒత్తిడి వల్లనే సిక్కా వైదొలిగినట్లు ఆరోపణలు
- 2013 ఏప్రిల్ నాటికి పతనమైన షేర్


సిక్కా

న్యూఢిల్లీ: దేశంలో రెండో అతిపెద్ద ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ సిఇఒ విశాల్ సిక్కా తన పదవికి రాజీనామా చేశారు. ఆయన ఆకస్మిక నిర్ణయం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇటు ఐటి పరిశ్రమ, అటు స్టాక్‌మార్కెట్ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి నుంచి ఒత్తిడి కారణంగానే ఆయన వైదొలిగారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. సిక్కాకు అత్యధిక ప్యాకేజీ ఇవ్వడం, బోర్డు నిర్ణయాలు ఇటీవల వ్యవస్థాపకులకు నచ్చలేదు. దీంతో కంపెనీ బోర్డు, వ్యవస్థాపకుల మధ్య గత కొంత కాలంగా భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. ఈ ఒత్తిడి నేపథ్యంలో సిక్కా విసుగుచెందే

తరువాయి 6లో

ఏజెన్సీలో వరద వెల్లువ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు మండలంలో పొంగి పొర్లుతున్న బొగ్గుల వాగు

7లో

ఇక రెండాకుల కలయిక

- తమిళనాట కొలిక్కి వస్తున్న ఎఐఎడిఎంకె వర్గాల విలీన యత్నాలు
- జయ సమాధి అలంకరణ

చెన్నై : తమిళనాడులో అధికార అన్నాడిఎంకెలో సమైక్య పర్వం నెలకొననుంది. జయలలిత మరణం తరువాత ఏర్పడ్డ రెండు వర్గాలూ త్వరలోనే విలీనం కానున్నాయి. ముఖ్యమంత్రి పళనిస్వామి, పన్నీరు సెల్వం వర్గాల విలీనం ఏ క్షణంలో అయినా జరగవచ్చునని వెల్లడైంది. పన్నీరు సెల్వం విధించిన షరతులను చాలా వరకూ పళనిస్వామి ఆమోదించారు. జయలలిత

తరువాయి 6లో

సింగరేణి ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కేంద్రం సూచనల మేరకు వేతనాలు

ఇరిగేషన్‌శాఖను తప్పుపట్టిన పిఎసి

6

కుంచెపోటు



అది కూడా వ్యవసాయం లాంటిదేనా.. రైతులుగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు!

టిఆర్‌ఎస్ ప్రచారం ఆకాశంలో... పనులు పాతాళంలో...



మన తెలంగాణ/హైదరాబాద్ : టిఆర్‌ఎస్ అభివృద్ధి ప్రచారం ఆకాశమంలో, పనులు పాతాళంలో ఉన్నాయని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరిగితే రాష్ట్రంలో ఇన్ని ఇబ్బందులు ఎందుకున్నాయని ప్రశ్నించారు. ఎన్‌టిఆర్ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో సంపద పెరిగితే ఆ సంపద ఎక్కడికి పోతుందని, అప్పులు ఎందుకు తీసుకోస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు రూ.1.36 లక్షల కోట్లు అప్పులు తెచ్చారన్నారు. రైతు ఆత్మహత్యలు ఎందుకు పెరుగుతున్నాయన్నారు. కనీసం పంటలను గిట్టుబాటు ధరకు కూడా కల్పించడం లేదని మండిపడ్డారు. నిత్యావసర ధరలు కూడా పెరిగాయని, టమాట, ఉల్లి ధరలు సామాన్యుని జేబుకు చిల్లు వేస్తుంటే జిఎస్‌డిపిలో రెట్టింపు వృద్ధి సాధించిన ప్రభుత్వం ఏం చేస్తుందన్నారు. **ఆర్‌టిసి సంగతి సిఎంకే తెలియదు :** ఆర్‌టిసిలో 3900 ఉద్యోగాలు భర్తీ చేసామని సిఎం కెసిఆర్ స్వాతం త్ర్య దినోత్సవం సందర్భంగా ప్రకటించారని రావుల గుర్తు చేశారు. అయితే ఆర్‌టిసి యాజమాన్యానికే ఆ ఉద్యోగాల భర్తీ గురించి తెలియదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు.

ఆరు నెలల పాటు సమ్మె నిషేధం

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ (టిఎస్ జెన్‌కో)లో ప్రభుత్వం ఆరు నెలల పాటు సమ్మె నిషేధించింది. అత్యవసర సర్వీసుల నిర్వహణ చట్టం ప్రకారం సమ్మెను నిషేధిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా ఉత్తర్వులు జారీచేశారు. జూలై 27వ తేదీ నుంచి నిషేధం అమలులోకి వస్తుంది.

ప్రభుత్వంపై న్యాయపోరాటం



మన తెలంగాణ/వికారాబాద్ జిల్లా : రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిఆర్‌ఎస్ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తుందని జెఎసి రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సమావేశాలు నిర్వహించడానికి పోలీసుల అనుమతి తీసుకున్నా కూడా ప్రభుత్వం అడ్డుకుంటుందని చెప్పారు. శాంతిభద్రతలు తలెత్తుతాయని జెఎసి నాయకులను పోలీసులు అడ్డుకుంటున్నారు, తప్పా టిఆర్‌ఎస్ కార్యకర్తలను ఏమీ అనకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రభుత్వ తీరుపై సోమయాజీగూడలోని ప్రెస్ క్లబ్ ఈ నెల 19వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు సెమినార్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వంపై న్యాయపోరాటం చేస్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి జిల్లా గౌరవ అధ్యక్షుడు చిగుర్లపల్లి రమేష్‌కుమార్, జెఎసి నాయకులు రాంచందర్‌రావు, రంగరాజు, శివప్రసాద్, సోమన్న పాల్గొన్నారు.

అన్నింటికీ అధిష్టానమే సుప్రీం

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ రామచంద్ర కుంతియా పిసిసి పదవులపై చేసిన ప్రకటనలు ఏ కోణంలో అన్నారో పార్టీలో చర్చిస్తామని కాంగ్రెస్ ఎంఎల్‌సి పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏ పిసిసి పదవుల్లో కొనసాగాలన్నా సంస్థాగత ఎన్నికల ప్రకియ ద్వారా తిరిగి ఎన్నిక కావాల్సిందేనని, అన్నింటికీ అధిష్టానమే సుప్రీం అన్నారు. పార్టీలో విభేధాలుంటే అంతర్గత వేదికలపై చర్చించకుంటామన్నారు.

ఆ కులాలను బిసిల్లో చేర్చండి

మన తెలంగాణ/హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో దశాబ్ధాలుగా స్థిరనివాసం ఉంటూనే సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన పలు కులాలను తక్షణమే వెనుకబడిన తరగతులు(బిసి)గా గుర్తించాలని ఎంఐఎం అధ్యక్షులు, హైదరాబాద్ లోకసభ సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీ బిసి కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నాడు ఖైరతాబాద్‌లోని బిసి కమిషన్ కార్యాలయంలో చైర్మన్ బిఎస్ రాములు, సభ్యులు డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, జూలూరు గౌరీశంకర్‌లను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రెండు శతాబ్దాలకు పైగా నగరంలో స్థిరపడిన అహీర్ యాదవ్, గవిలి, సారోల్లు తదితర కులాలను బిసిల జాబితాలో చేర్చాలని కోరారు. మాతృభాష హిందీ అయినంత మాత్రాన ఆ నెపంతో ఆయా కులాలను వెనుక బడిన తరగతులుగా గుర్తించక పోవ డంపై ఆయన విచారం వ్యక్తం చేశా రు. చాలా కులాలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాల్లో పూర్తిగా వెనుకబడి ఉన్నారని, వారిని వెంటనే గుర్తించడం అవసరమని ఆయన కమిషన్‌ను కోరారు.

సిఎంవి మోసపూరిత వాగ్దానాలు



మన తెలంగాణ/హైదరాబాద్: మోసపూరిత వాగ్దానాలు చేస్తూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నామని కాంగ్రెస్ మాజీ ఎంఎల్‌ఎ సుధీర్ రెడ్డి ఆరోపించారు. మాజీ ఎంఎల్‌ఎలు డి.సుధీర్‌రెడ్డి, ఎం.కోదండరెడ్డి, ఎం.బిక్షపతి యాదవ్, కూన శ్రీశైలం గౌడ్, పలువురు కాంగ్రెస్ నేతలు శుక్రవారం బిసి సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్నను కలిసారు. ఆ తరువాత సచివాలయంలో సిఎం బ్లాక్ ముందు చెవిలో పువ్వు పెట్టుకొని తమ నిరసన వ్యక్తం చేశారు. బిసి విద్యార్థులకు విదేశీ విద్య అవకాశం ఇప్పటి వరకు ఒకరిద్దరికి కూడా కల్పించ లేదని మంత్రి దృష్టికి తీసుకుపోయారు. పరిశీలించి న్యాయం చేస్తానని మంత్రి హామీనిచ్చారని అనంతరం సుధీర్‌రెడ్డి అన్నారు. గొర్రెలు, చేపపిల్లలు సరిగ్గా ఎవరికీ అందజేయలేదని ఆరోపించారు. ప్రచార ఆర్భాటం ఎక్కువగా ఉందని, పరిపాలన తక్కువగా ఉందని విమర్శించారు.

వెబ్‌సైట్‌లో డిప్యూటీ సర్వేయర్ హాల్‌టికెట్లు

మనతెలంగాణ/హైదరాబాద్ : సర్వే, సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో డిప్యూటీ సర్వేయర్ పోస్టుల భర్తీకి ఈ నెల 20న జరుగనున్న రాత పరీక్ష హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు టిఎస్‌పి ఎస్‌సి కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.



హరితహారం మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు

మన తెలంగాణ/హైదరాబాద్: వర్షాల్లో అసమానతలు, డ్రైస్పెల్ కొనసాగుతున్న ప్రాంతాల్లో హరితహారం మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లాల అటవీ అధికారులకు ఉన్నతాధికారులు సూచించారు. ప్రస్తుతం నెలకొన్న వాతావరణం నేపథ్యంలో ఇప్పటికే నాటిన మొక్కల పరిస్థితిపై డివిజన్ల వారీగా శుక్రవారం సచివాలయం నుంచి సమీక్షించారు. బ్లాక్ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్ లపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మొక్కలు చనిపోతే.. వెంటనే మార్చి కొత్తవి నాటాలని ఆదేశించారు. వచ్చే యేడాది హరితహారం కోసం కూడా ఇప్పటి నుంచే నర్సరీల్లో మొక్కల పెంపకం మొదలు పెట్టాలన్నారు. రహదారుల వెంట ఇరు వైపులా చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్ కు అన్ని వర్గాల నుంచి మంచి ఫీడ్ బ్యాక్ వస్తోందని, క్రమంగా ఈ రకమైన ప్లాంటేషన్ పెంచాలని సూచించారు. అర్బన్ ఫారెస్ట్ పార్కులను వీలున్నన్ని పట్టణ ప్రాంతాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని, పట్టణ ప్రాంతాల ప్రజలు నిత్యం వాడేందుకు వీలుగా వీటిని రూపొందించాలని నిర్ణయించారు. అలాగే ఈ సమీక్షలో అటవీ సంపద రక్షణ, వేట నియంత్రణ చర్యలపై చర్చ, ఇప్పటికే పెట్టిన కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలనిఅధికారులను ఆదేశించారు.

మారనున్న వర్సిటీ పరిధులు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో 31 కొత్త జిల్లాలు ఏర్పాటైన నేపథ్యంలో ఆయా జిల్లాల్లోని యూనివర్సిటీ పరిధులలో మార్పులకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు తెలిసింది. ప్రస్తుతం జిల్లాల భౌగోళిక పరిస్థితులు, స్థానికుల డిమాండ్ల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోకి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలు రానున్నాయి. అలాగే కాకతీయ వర్సిటీ పరిధిలోకి వరంగల్ రూరల్, అర్బన్ జిల్లాలతో పాటు జయశంకర్ భూపాలపల్లి, జనగాం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలు రానున్నాయి. అలాగే తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోకి నిజామాబాద్, కామారెడ్డి, అదిలాబాద్, నిర్మల్ జిల్లాలు, శాతవాహన వర్సిటీ పరిధిలోకి కరీంనగర్, పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కొమురంభీం అసిఫాబాద్ జిల్లాలు రానున్నాయి. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరిధిలోకి నల్లొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలు, పాలమూరు వర్సిటీలోకి మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల్ జోగులాంబ జిల్లాలు రానున్నాయి. జిల్లాల పరిధి, హద్దులు మారిన నేపథ్యంలో వర్సిటీల పరిధులు మార్చాలని స్థానికుల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త జిల్లాలకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. త్వరలో వర్సిటీ పరిధుల మార్పులకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడనున్నాయి.

వెంకట రాజేష్‌కు పదోన్నతి

మన తెలంగాణ/హైదరాబాద్ : రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ విభాగంలో జాయింట్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న ఎం.వెంకట రాజేష్‌కు అడిషనల్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బిఆర్.మీనా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రెడ్డి హాస్టల్ శంకుస్థాపన, సభను జయప్రదం చేయండి

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఈ నెల 22న రాజ బహదూర్ వెంకట్రామిరెడ్డి జయంతి సందర్భంగా బుద్వేల్‌లో రెడ్డి హాస్టల్ భవన సముదాయ శంకుస్థాపన కార్యక్రమాన్ని, ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభను విజయవంతం చేయాలని శాసనమండలిలో ప్రభుత్వ ఛీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి రెడ్డి కులస్తులకు విజ్ఞప్తి చేశారు. రెడ్డి హాస్టల్‌లో శుక్రవారం జరిగిన బుద్వేల్ సభ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రెడ్డి కులస్తుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తీసుకుంటున్న చర్యలు చారిత్రాత్మకమైనవని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సిఎంలుగా పనిచేసిన వారెవ్వరూ కెసిఆర్ తరహాలో రెడ్డి కులస్తుల బాగోగులను పట్టించుకోలేదని పేర్కొన్నారు. తమ సంక్షేమం కోసం బుద్వేల్‌లో రూ.10 కోట్ల విలువైన భూమితో పాటు రూ.10 కోట్లు కేటాయించిన సిఎం కెసిఆర్‌ను సముచితంగా సత్కరించుకోవాల్సిన బాధ్యత రెడ్డి సమాజంపై ఉందని ఆయన అన్నారు.

సింగరేణి ఉద్యోగినుల మెటర్నిటీ సెలవు 26 వారాలకు పెంపు

మన తెలంగాణ/హైదరాబాద్: సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తున్న మహిళా (ఎన్‌సిడబ్ల్యుఎ) ఉద్యోగినులకు మెటర్నిటీ సెలవును 26 వారాలకు పెంచారు. ఇప్పటి వరకు 12 వారాల మెటర్నిటీ సెలవు ఇచ్చేవారు. మహిళా ఉద్యోగి ప్రసవ సమయానికి ముందు 8 వారాలకు మించకుండా ఈ మొత్తం సెలవును వినియోగించుకోవాలి. ఈ మేరకు మెటర్నిటీ బెనిఫిట్ చట్టం 1961లో మార్పులు చేసి, భారత ప్రభుత్వ అధికారిక గెజిట్‌లో ప్రచురించిన నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం ఈ మెటర్నిటీ సెలవులు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. కాగా ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది పిల్లలు (సంతానం) ఉన్న మహిళా ఉద్యోగుల విషయంలో ఇంతకు ముందు ఉన్నట్లుగానే 12 వారాల సెలవును కొనసాగిస్తారు.

అల్పపీడనంగా ఉపరితల ఆవర్తనం

మన తెలంగాణ/హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడ్డ ఉపరితల ఆవర్తనం బలపడి అల్పపీడనంగా మారింది. అల్పపీడనం వాయవ్య బంగాళాఖాతం నుంచి ఒడిషా తీరప్రాంతం వరకు ఆవరించింవుంది. దీనికి అనుబంధంగా మరో ఉపరితల ఆవర్తనం బంగాళాఖాతానికి నైరుతి దిశగా సముద్రమట్టానికి 9.5 కిలోమీటర్ల ఎగువన ఏర్పడింది. దక్షిణ తమిళనాడు వరకు కోస్తాంధ్ర, రాయలసీమల మీదుగా ఆవర్తన ద్రోణి ఆవరించివుంది. ఫలితంగా శుక్రవారం నాడు రాష్ట్రంలోని పలు చోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇదిలా ఉండగా గత 24 గంటల్లో రాష్ట్రంలో వరంగల్ జిల్లా ఖానాపూర్‌లో 4 సెంటీమీటర్ల గరిష్ఠ వర్షపాతం నమోదైంది. చింతకం, మహబూబాబాద్, గూడూరు, కొత్తగూడెం, బయ్యారం, నర్సంపేటలో 3, దుమ్ముగూడెం, గార్ల, ఎంకూరు, మధిర, పేరూరు, తల్లాడ, డోర్నకల్, ములుగు, నల్లబెల్లి, బొనకల్, పాల్వంచ, జగిత్యాలలో 2 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఇల్లందు, కొణిజెర్ల, ములకలపల్లి, పరకాల, జులపల్లి, అశ్వాపురం, వనపర్తి, చెన్నారావుపేట, అచ్చంపేట, పాలెం, అశ్వారావుపేట, మణుగూరు, రామన్నపేట, శాయంపేట, కూసుమంచి, ఏటూరునాగారం, జూలూరుపాడు, సుల్తానాబాద్, పినపాక, సత్తుపల్లి, బూర్గంపాడు, ఆత్మకూరు, నాగర్‌కర్నూలు, గోవిందరావుపేట తదితర ప్రాంతాల్లో 1 సెంటీమీటర్ వర్షం కురిసింది.

వ్యాయామంతో ఒత్తిడి దూరం



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీ బ్యూరో: రోజూ వ్యాయామంతోనే ఆరోగ్యం సాధ్యమవుతుందని ప్రముఖ సినీనటులు అక్కినేని నాగార్జున అన్నారు. మాదాపూర్‌లోని ఫొనిక్స్ ఐటీ సెజ్ గ్రూపు భాగస్వామ్యంతో కాల్ హెల్త్ సర్వీసెస్ సంస్థ ఏర్పాటు చేసిన హెల్త్‌కేర్‌లాంజ్ ను ఏర్పాటు చేసింది. ఈ హెల్త్‌కేర్ లాంజ్‌ను నాగార్జున తన సతీమణి అమలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ మనిషి తన దిన చర్యలో భాగంగా ప్రతి రోజూ వ్యాయామానికి అరగంట కేటాయిస్తే ఎలాంటి పని ఒత్తిడి లేకుండా ఉంటుందని సూచించారు. ఫోనిక్స్ గ్రూపు ఛైర్మన్ చుక్కపల్లి సురేశ్ మాట్లాడుతూ విపరీతమైన ఒత్తిడి, నిశ్చలమైన జీవనశైలితో పాటు ఆఫీసులో అధిక సమయం గడపే కారణంగా మానసిక, శారీరక సమస్యలు పెరుగుతున్నాయన్నారు. సెజ్ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణకు అవసరాల మేర కు సౌకర్యవంతంగా కాల్ హెల్త్ లాంజ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. కాల్‌హెల్త్ సిఇఓ థలపల్లి శ్రీహరి మాట్లాడుతూ మాట్లాడుతూ పని చేసే ప్రదేశంలో ఉద్యోగులకు ఆరోగ్యం అనేది తప్పని సరిగా అందించే ప్రయోజనం అని, ఇందులో భాగంగా హెల్త్ లాంజ్ ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సేవలు దాదాపు 20 వేల మంది ఐటి ఉద్యోగులకు ఉపయోగపడనున్నాయని వెల్లడించారు.

నీరుగారుతున్న ఉద్యాన మిషన్

- గత ఏడాది కేంద్రం కేటాయించిన నిధులను ఖర్చు చేయని రాష్ట్రం
- ఇలాగైతే ఈ ఏడాది నిధులు విడుదల చేయబోమన్న కేంద్రం



మన తెలంగాణ/హైదరాబాద్: కేంద్ర ప్రభు త్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఉద్యానవన రంగం సమగ్ర అభివృద్ధి కోసం ఉద్దేశించిన మిషన్ (ఎంఐడిహెచ్) లక్ష్యం నీరుగారుతోంది. కేంద్రం నుంచి నిధులు విడుదలైనా రాష్ట్ర ప్రభుత్వం వాటిని సరిగ్గా వినియోగించుకోవడం లేదు. ఫలితంగా ఈ ఏడాది మొదటి త్రైమాసిక నిధులు తెలంగాణకు ఇవ్వబోమని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు ఇటీవల రాష్ట్రానికి లేఖ కూడా రాసింది. ఇందులో తెలంగాణ ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరం నిధులు రూ. 21.82 కోట్లు ఖర్చు చేయలేదని, ఈ పథకం అమలులో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని లేఖలో పేర్కొంది. కేంద్రం ఎంఐడిహెచ్‌కు ఇచ్చే నిధులకు రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటా కలిపి విడుదల చేయాల్సి ఉంటుంది. అయితేమొదటి నుంచి మన రాష్ట్రం నిధుల విడుదలపై తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి 2015–16లో రూ. 67.50 కోట్లు కేటాయిచంగా, 2016–17లో రూ 54.84 కోట్లుగా ఉంది. 2017–18లో రూ. 60 కోట్లు ప్రభుత్వాలు కేటాయించాయి. అయితే ఈ నిధులకు సంబంధించి రాష్ట్రం తన వాటాను సరిగ్గా విడుదల చేయడం లేదు. దేశవ్యాప్తంగా ఉద్యానవన ఉద్యమం సృష్టించాలనే ఉద్దేశ్యంతో 2013లో కేంద్ర ప్రభుత్వం ఉద్యానరంగ సమగ్ర అభివృద్ధి మిషన్‌ను ప్రవేశపెట్టింది. ఈ మిషన్ లక్ష్యం ప్రతి రాష్ట్రం సంపూర్ణ ఉద్యాన రంగంగా ఎదిగేందుకని కేంద్రం ప్రభుత్వం నిర్దేశించింది. ప్రాంతాల వారీగా పరిశోధనలు చేస్తూ సాంకేతికంగా పంట నిర్వహణ, మార్కెటింగ్‌తో ఉద్యాన పంటల విస్తరణ పెంచడం, అగ్రిగేషన్ ప్రోత్సాహించడడానికి రైతులను సమూహాలుగా ఏర్పరచడం, ఉద్యాన పంటల దిగుబడి, రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు పోషక భద్రత బలోపేతం చేయడం, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించడం, కొత్త ఉద్యాన పంటలు సాగు చేయించడం ఈ మిషన్ ముఖ్య ఉద్దేశ్యాలు. వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి ఛైర్మన్‌గా రాష్ట్రస్థాయిలో కార్యవర్గ కమిటీ ప్రణాళిక ప్రకారం ఎమ్ఐడిహెచ్ లక్ష్యాలను పూర్తి చేస్తారు. ఇందులో రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీలు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్(ఐసిఎఆర్)లు కూడా భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వ పథకాల కోసం సమీక్షలు జరపడమే తప్పితే ఇప్పటి వరకు ఎమ్ఐడిహెచ్ కోసం ప్రత్యేకంగా భేటీ అయిన సందర్భాలు ఒకటో రెండు మాత్రమే. ఈ పథకం లక్ష్యాలను కూడా కాగితాలకే పరిమితం చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కేంద్రం ఇచ్చిన నిధులనే సరిగ్గా వాడుకోలేని రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ప్రత్యేకంగా నిధులు కేటాయించి, ఏమి ఖర్చు చేస్తుందనే విమర్శలు వస్తున్నాయి.

స్వాతంత్ర్య సమరయోధులుగా మరో 6 వేల మంది

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్సరాజ్ అహిర్

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ విమోచనోద్యోమంలో పాల్గొన్న ఆరు వేల మందిని గుర్తించాల్సి ఉందని, వారికి రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్‌లు ఇవ్వాలని, త్వరలోనే ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్సరాజ్ గంగారాం అహిర్ వెల్లడించారు. మందికి పెన్షన్‌లు ఇవ్వాల్సి ఉందని, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి వివరాలను గ్రామ స్థాయిలో సేకరించి వారికి తగిన గౌరవం కల్పించాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఒక్క రోజు పర్యటన నిమిత్తం గురువారం హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర మంత్రి బిజెపి రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం, నారాయణఖేడ్ ప్రాంతాలకు చెందిన సిపిఐ (ఎం) న్యూడెమోక్రసీ, టిఆర్‌ఎస్, టిడిపి కార్యకర్తలు హైదరాబాద్ గురుద్వారా కమిటీ సభ్యులు పలువురు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆహిర్ మాట్లాడుతూ తాను పూర్వపు తెలంగాణ వాసినని, నిజాం పాలనలో తన పూర్వికులు ఎలా హింసకు గురయ్యారో చరిత్ర చెబుతోందన్నారు. సెప్టెంబర్ 17 ను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా విమోచనా దినోత్సవాన్ని నిర్వహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మేం దేశభక్తులం అని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ త్యాగాలు చేసిన వారిని విస్మరించిందని, నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడిన రోజును నిర్వహించలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆ కోవకే చెందినదిగా గుర్తింపు తెచ్చుకోవద్దని హితవు పలికారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఎంతో గుర్తింపునకు నోచుకోవడం లేదని, దీన్ని దృష్టిలో పెట్టుకునే కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 9 క్విట్ ఇండియా ఉద్యమ తేదీ నుంచి ఆగస్టు 30 వరకు గ్రామాలలో యాత్రలు నిర్వహించి గుర్తించాలని సూచించినట్లు తెలిపారు.

టచ్‌లో ఉన్న ఎంపి, ఎంఎల్‌ఏలు

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేంత వరకు నిరంతరం చేరికలుంటాయని, పార్టీలో చేరే వారిలో మాజీ ఎంపీలు, ఎంఎల్‌ఏలతో పాటు ప్రస్తుత ఎంపీలు, ఎంఎల్‌ఏలు కూడా ఉండవచ్చని కేంద్ర మంత్రి గంగారామ్ ఆహిర్ అన్నారు. చాలా మంది పార్టీలో చేరేందుకు సుముఖంగా ఉన్నారని ఆయన వెల్లడించారు. నిజాం నిరంకుశ పాలన నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉందని, అయితే అధికార టిఆర్‌ఎస్ పార్టీ ఎంఐఎంకు దాసోహమై మరుగున పడేసేందుకు కుట్ర పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఎన్. ఇంద్రసేనారెడ్డి, కుంజా సత్యవతి, చింతా సాంబమూర్తి, ప్రభాకర్‌రెడ్డి, జి. ప్రేమేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ తుది విడత సీట్లలో గందరగోళం

- 11న జరిగిన కేటాయింపుల్లో మార్పులు
- ఇప్పటికే కళాశాలల్లో రిపోర్ట్ చేసి, ఫీజులు చెల్లించిన విద్యార్థులు



మన తెలంగాణ/హైదరాబాద్: డిగ్రీ తుది విడత సీట్ల కేటాయింపులో గందరగోళ పరిస్థితి నెలకొంది. సీట్ల కేటాయింపులో సుమారు 2,900 మంది విద్యార్థులకు ఈ నెల 11న జరిగిన సీట్ల కేటాయింపు రద్దయ్యాయి. అందులో కొంత మందికి ఇతర కళాశాలల్లో సీట్లు కేటాయింపుస్తున్నట్లు ఎస్ఎంఎస్‌లు రాగా, 91 మంది విద్యార్థులకు శుక్రవారం రాత్రి వరకూ ఎలాంటి సీట్ల కేటాయింపు జరగలేదు. దాంతో విద్యార్థులకు ఆందోళనకు గురవుతున్నారు. విద్యార్థులు 11న డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్,తెలంగాణ(దోస్త్) ద్వారా సీటు పొందిన కళాశాలలో రిపోర్ట్ చేయడంతో పాటు ఆయా కళాశాలల్లో ఫీజులు కూడా చెల్లించారు. మళ్లీ 17న దూర ప్రాంతాల కళాశాలల్లో సీటు కేటాయించినట్లు విద్యార్థులు మొరపెట్టుకుంటున్నారు. అసలు సీటు విద్యార్థులు మాత్రం ఎక్కడి వెళ్లాలో తెలియక గందరగోళానికి గురవుతున్నారు.

సాంకేతిక లోపం...విద్యార్థులకు శాపం

రాష్ట్రంలో గత ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో డిగ్రీ ప్రవేశాలు చేపడుతున్నారు. మొదటి సంవత్సరం కూడా డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలలో సాంకేతిక సమస్యలు తలెత్తి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నామని దోస్త్ కన్వీనర్, ఇతర అధికారులు చెప్పినా సీట్ల కేటాయింపులో జరిగిన పొరపాటులో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆన్‌లైన్ ప్రవేశాల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సహాయం అందించేందుకు ప్రభుత్వం సిజిజి(సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్)కు అప్పగించింది. అయితే సిజిజిలో సాంకేతిక నిపుణుల కొరత కారణంగా మొదటి నుంచీ ఇబ్బందులు తలెత్తుతూ వస్తున్నాయి. మొదటి, రెండవ విడత సీట్ల కేటాయింపులు బాగానే జరిగినా,తుది విడత కేటాయింపులో తలెత్తిన సాంకేతిక కారణాలతో విద్యార్థులు గందరగోళంలో పడిపోయారు. మూడవ విడతలో ఈ నెల 11న మొత్తం 70,808 సీట్లు కేటాయించారు. అందులో సుమారు 2,900 మంది విద్యార్థులకు కేటాయించిన సీట్లలో మార్పులు జరగగా, 91 మందికి మాత్రం అసలు కేటాయింపులే జరగలేదు. సాంకేతిక సమస్యలతోపాటు అధికారుల మధ్యన సమన్వయం లోపించడం, సిజిజికి అధికారుల మధ్యన సరైన సమన్వయం లేకపోవడంతో ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. సీట్ల కేటాయింపులో జరిగిన పొరపాట్లపై దోస్త్ వర్గాలు విద్యార్థులకుగానీ, కళాశాలలకుగానీ ఎలాంటి సమాచారం అందించలేదు. దాంతో ఏం చేయాలో అర్థం కాక విద్యార్థులు ఉన్నత విద్యామండలి కార్యాలయానికి బారులు తీరుతున్నారు.

విద్యార్థులు ఆందోళన చెందవద్దు : టి.పాపిరెడి

మూడవ విడత సీట్ల కేటాయింపులో జరిగిన పొరపాట్లను సరిదిద్ది విద్యార్థులకు ఎలాంటి నష్టం జరుగకుండా చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందవద్దు. విద్యార్థుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం.

నేడు నిర్ణయం

సాంకేతిక కారణాలతో సీట్ల కేటాయింపులో జరిగిన పొరపాట్లపై శనివారం ఉన్నత విద్యా మండలి కార్యాలయం సిజిజి అధికారులతో దోస్త్ కమిటీ సమావేశం కానుంది. 17న జరిగిన సీట్ల కేటాయింపే తుది కేటాయింపు అని విద్యార్థులను, కళాశాలలను చెప్పాలని దోస్త్ కన్వీనర్, ఇతర అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే విద్యార్థులు చెల్లించిన ఫీజును తిరిగి ఇప్పించేలా తామే చొరవ తీసుకోవాలని అనుకుంటున్నట్లు సమాచారం. ఈ సీట్ల కేటాయింపుపై శనివారం జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.

వీఆర్‌ఎ, వీఆర్‌ఓ విలీన ప్రతిపాదన లేదు



మన తెలంగాణ/హైదరాబాద్: వ్యవసాయశాఖలో గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఎ), గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్‌ఓ)ను విలీనం చేసే ప్రతిపాదన లేదని ఉప ముఖ్యమంత్రి మహ్మద్ మహమూద్ అలీ ఖండించారు. విలీనం చేస్తున్నారంటూ వస్తున్న వార్తలను నమ్మవద్దని ఆయన కోరారు. అందరికీ ప్రయోజనకరంగా ఉండే విధంగా సమగ్ర భూసర్వే నిర్వహించాలని సిఎం కెసిఆర్ నిర్ణయించారన్నారు. తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల జెఏసి తరపున డిప్యూటీ కలెక్టర్ వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం శుక్రవారం డిప్యూటీ సిఎం మహమూద్ అలీని కలిసి వినతి పత్రం అందచేశారు. వ్యవసాయ శాఖలో విలీనం చేస్తున్నారంటూ వస్తున్న వార్తలతో యావత్ రెవెన్యూ యంత్రాంగం ఆందోళనలో ఉన్నదని ఆయనకు తెలిపారు. గతంలో కూడా ఈ వ్యవస్థపై అనేక ప్రయోగాలు చేశారని, ఫలితంగా అనేక నష్టాలు జరిగాయన్నారు. ఇప్పుడిప్పుడే వ్యవస్థ బాగుపడుతున్న తరుణంలో మరోమారు విలీన ప్రయోగం చేయవద్దని ఆయనను కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం మొండిగా నిర్ణయం తీసుకుంటే తీవ్రంగా వ్యతిరేకిస్తామని, పెద్ద ఎత్తున ఆందోళన చేపడ్తామని జెఏసి ప్రతినిధులు డిప్యూటీ సిఎం మహమూద్ అలీకి స్పష్టం చేశారు.

జడ్జిపైకి చెప్పులు

న్యూఢిల్లీ: హత్య కేసులో ఇద్దరు నిందితులను నిర్దోషులుగా ప్రకటించారనే ఆగ్రహంతో ఓ వ్యక్తి జడ్జిపైకి బూట్లు విసిరారు. ఢిల్లీలోని సాకేత్ కోర్టు కాంప్లెక్స్‌లో ఘటన చోటు చేసుకుంది. శుక్రవారం అడిషనల్ సెషన్ జడ్జి లోకేశ్ శర్మపైకి బాధితుడి బంధువు బూట్లు విసిరినట్లు కోర్టు అధికారులు తెలిపారు. జడ్జి మరో కేసును విచారిస్తుండగాఘటన చోటు చేసుకుంది. జడ్జిపైకి విసిరిన బూట్లు ఆయనకు తాకకుండా పక్కకు పడిపోవడంతో ఎటువంటి గాయం కాలేదన్నారు.

రహదారి పనులను పూర్తి చేయాలి

మన తెలంగాణ/హైదరాబాద్: రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఎఐ) అధికారులను రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కోరారు. జూబ్లిహిల్స్‌లోని తన నివాసంలో శుక్రవారం ఆయన అశ్వరావుపేట, ఖమ్మం, సూర్యాపేట జాతీయ రహదారి ఎలైన్‌మెంట్‌పై సమీక్షించారు. రహదారి వెంట పట్టణాల గుండా బైపాస్‌ల ఏర్పాటుకు ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు విముఖత చూపారు. భూసేకరణ, నిర్మాణం వ్యయ పరిమితులకు మించకుండా నిర్మాణం చేపట్టాలన్న కేంద్రం ఆదేశాలను ఈ సందర్భంగా అధికారులు ఉటంకించారు. అయితే మంత్రి తుమ్మల మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బంది లేకుండా వీలైనన్ని పట్టణాల గుండా బైపాస్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. అవసరమైతే తాను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో కలిసి వ్యక్తిగతంగా అభ్యర్థిస్తానని అధికారులతో తెలిపారు.



సింగరేణిలో కార్మికులను మోసం చేసిన టిఆర్‌ఎస్

పిసిసి అధ్యక్షులు ఉత్తంమ్‌కుమార్‌రెడ్డి



మన తెలంగాణ/ హైదరాబాద్ : సాధారణ ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి సింగరేణి కార్మికుల ఓట్ల పొందిన టిఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక వారిని మోసం చేసిందని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. సింగరేణిలో త్వరలో జరగనున్న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో టిఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ నెల 21వ తేదీన సింగరేణి కాలరీస్ గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యుల్ వెలువడనున్న నేపథ్యంలో శుక్రవారం గాంధీభవన్‌లో టిపిసిసి సింగరేణి సబ్ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ ఛైర్మన్ గండ్ర వెంకటరమణ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉత్తంకుమార్ రెడ్డితోపాటు కమిటీ కన్వీనర్ జనక్ ప్రసాద్, మాజీ కేంద్ర మంత్రి బలరామ్ నాయక్, మాజీ ఎంఎల్‌సి ప్రేమ్‌సాగర్, టిపిసిసి ఉపాధ్యక్షులు నాగయ్య, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, రేగ కాంతారావు, అధికార ప్రతినిధి గోసుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు వారసత్వ ఉద్యోగాల ఖచ్చితంగా ఇస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన టిఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు దాటినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. గుర్తింపు ఎన్నికలు జరుగుతుండడంతో ఆదరాబాదరాగా వారసత్వ ఉద్యోగాల జి.ఓ ఇచ్చారని, తిరిగి తెలంగాణ జాగృతి వాళ్ళ చేత కోర్టులో కేసు వేయించి అది కొట్టేసేలా కుట్ర చేశారని ఆయన ఆరోపించారు. సింగరేణి కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ చేస్తామని, కార్మికులకు ఇళ్ళు కట్టిస్తామని ప్రతి ఒక్క విషయంలో మోసం చేశారని, ఫలితంగా 55 వేల మంది కార్మికులు టిఆర్‌ఎస్‌పై తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారన్నారు.


సింగ్‌రేణిలో ఉత్తమ్‌యాత్ర

సింగరేణిలో గుర్తింపు ఎన్నికల సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి సింగరేణి యాత్ర చేస్తారని గండ్ర వెంకటరమణరెడ్డి సమావేశం అనంతరం మీడియాకు చెప్పారు. టిఆర్ ఎస్ అనుబంధ బొగ్గు గని కార్మిక సంఘం ఓడిపోవడం ఖాయమన్నారు. ఈ యాత్రలో ఎంఎల్‌ఏ టి.జీవన్‌రెడ్డి మాజీ మంత్రి డి.శ్రీధర్‌బాబు, వనమా వెంకటేవ్వర్లు, కూడా పాల్గొంటారని వివరించారు.

అద్భుతమైన ప్రాజెక్ట్‌గా అంబేద్కర్ విగ్రహ స్థాపన

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ స్థాపన యావత్ భారతదేశానికే తలమానికంగా ఉండేలా తీర్చిదిద్దాలని రాష్ట్ర విద్యుత్, ఎస్.సి అభివృద్ధి శాఖ మంత్రి జి.జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన అంబేద్కర్ విగ్రహ స్థాపన తెలంగాణ రాష్ట్రానికి ఓ రోల్ మోడల్ కావాలని ఆయన ఆకాంక్షించారు. శుక్రవారం సమావేశమైన మంత్రి జి.జగదీష్ రెడ్డి అధ్యక్షతన అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు డిజెయిన్ స్టూడియో రూపొందించిన నమూనాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పరిశీలించారు. నమూనాలను పరిశీలించిన తర్వాత కొన్ని మార్పులు చేర్పులు చేయడంతో పాటు అంతిమంగా ఎలా ఉండాలి, ఎంత స్థలంలో నిర్మించాలి వంటి అంశాలపై తదుపరి సమావేశం నాటికి కొలిక్కి వచ్చేలా చూడాలని డిజెయిన్ అసోసియేట్స్ సభ్యులను, అధికారులను మంత్రి ఆదేశించారు.





"పాలకులు ఎలాంటివారో తెలుసుకోవాలంటే విమర్శను ఎవరు అనుమతించడంలేదో కనుగొంటే చాలు.
-వోల్టేర్, ఫ్రెంచ్ తత్వవేత్త, చరిత్రకారుడు"

ప్రతిపక్ష కేంద్రంగా శరద్‌యాదవ్

సంపాదకీయం

జనతాదళ్(యు) తిరుగుబాటు నాయకుడు శరద్ యాదవ్ ప్రతిపక్ష ఐక్యతకు కేంద్రంగా ఆవిర్భవించటం శుభపరిణామం. ''మన మిశ్రమ సంస్కృతిని కాపాడుకుందాం'' నినాదంతో ఆయన గురువారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన సభకు కాంగ్రెస్ నుంచి – వామపక్షాలవరకు 17 రాజకీయ పార్టీలు సహా రైతు సంఘాలు, దళిత గ్రూపుల నాయకులు హాజరు కావటం విశేషం. ఈ పార్టీలు కాంగ్రెస్ పార్టీ చొరవతో ఇంతకుముందు సమావేశం కాకపోలేదు. అయితే అవి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఉమ్మడి వ్యూహాల కొరకు జరిగిన సమావేశాలు. బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ ప్రమాదకర విధానాలను వ్యతిరేకించే వ్యూహం గూర్చి చర్చించేందుకు వారం రోజుల క్రితం జరిగిన సమావేశం, ప్రతిపక్ష ఐక్యకార్యాచరణకు మార్గదర్శకాలు రూపొందించే నిమిత్తం ఒక ఉపసంఘం ఏర్పాటు చేసే అధికారాన్ని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీకిచ్చింది. అయితే కాంగ్రెస్ నాయకత్వంలో పనిచేయటానికి సంకోచాలున్న పార్టీలకేగాక, కాంగ్రెస్‌కు సైతం శరద్‌యాదవ్ ఇప్పుడు కేంద్రబిందువైనారు. ప్రతిపక్ష ఐక్యతపై మార్గదర్శక పత్రం రూపొందించాల్సిందిగా శరద్ యాదవ్‌ను, సోనియాగాంధీ రాజకీయ సలహాదారు అహ్మద్‌పటేల్ ఈ సమావేశంలో కోరటం ఈ సందర్భంగా గమనార్హం. ఇది మన్మోహన్‌సింగ్, రాహుల్‌గాంధి, గులాం నబీ ఆజాద్ సమక్షంలోనే జరిగింది.

జనతా పరివారం అగ్రనాయకుల్లో ఒకరైన శరద్ యాదవ్ జనతాదళ్(యు) వ్యవస్థాపక అధ్యక్షుడు. వాజ్‌పేయి నాయకత్వంలో తొలి ఎన్‌డిఎ ప్రభుత్వంనుంచి చాలాకాలం ఎన్‌డిఎ కన్వీనర్‌గా పనిచేశారు. జార్జి ఫెర్నాండెజ్ నాయకత్వంలోని సమతాపార్టీ (బీహార్‌కే పరిమితం)ని ఆయన మరణానంతరం బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ జెడి(యు)లో విలీనం చేశారు. ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్రమోడీ పేరు ప్రకటించటాన్ని వ్యతిరేకిస్తూ బిజెపితో అలయెన్స్‌ను తెగతెంపులు చేసుకున్న కుమార్, ఆ తదుపరి బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్‌జెడి, కాంగ్రెస్‌లతో కలిసి మహాకూటమి ఏర్పాటు చేసి అధికారంలోకి రావటం, ఇప్పుడేమో 2019లో కూడా మోడీకి తిరుగులేదంటూ పచ్చి అవకాశవాదంతో కూటమిని చీల్చి బిజెపితో చేతులు కలిపి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయటం తెలిసిందే. అధికారమే పరమావధిగా నితీష్ పిల్లిమొగ్గలతో శరద్‌యాదవ్ విభేదించాడు. మోడీ ప్రభుత్వంలో మంత్రిపదవి అవకాశాన్ని త్రోసిపుచ్చి, బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ ప్రమాదంపై ప్రజలను చైతన్యపరుస్తూ సూత్రబద్ధ రాజకీయాలు అనుసరించాలని నిర్ణయించుకున్నాడు. 'మిశ్రమ సంస్కృతిని కాపాడుకుందాం' అని ఆయన ఎంచుకున్న అంశమే ఆయన విశాల దృష్టిని తెలియచేస్తున్నది. ఆయన వెంట ఇద్దరు జెడి(యు)ఎంపిలే ఉన్నప్పటికీ 17 రాష్ట్ర యూనిట్లు శరద్ నాయకత్వాన్ని బలపరుస్తున్నాయి. బీహార్ నితీష్ గ్రూపును మినహాయిస్తే జెడి(యు)అనేక రాష్ట్రాల్లో చిన్న పార్టీయే కావచ్చు. కాని ప్రతిపక్ష ఐక్యతను నిర్మించటంలో అది ప్రభావశాలి కాగలుగుతుంది.

ఒక భావం ప్రజల మనస్సుకెక్కితే అది శక్తిగా మారుతుందంటారు. 2022లో తామే అధికారంలో ఉంటామన్న ధీమాతో దేశ స్వాతంత్ర్య 75వ వార్షికోత్సవం నాటికి లక్ష్యాలు ప్రకటిస్తున్న నరేంద్రమోడీ మితవాద, మతవాద విధానాలు దేశ ఐక్యత, సమగ్రతలకు ముప్పు తెస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలన్న భావన శరద్ యాదవ్ ఎంచుకున్న నినాదంలో ఉంది. ఇదే ప్రతిపక్ష ఐక్యతకు ప్రాతిపదిక. 'మోడీకి ఎదురు లేదు' అన్న భావన సృష్టించటానికి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు, కార్పొరేట్ మీడియా అదే పనిగా చేస్తున్న ప్రచారాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనగలిగితే, మోడీ పాలనలో వివక్షకు, దాడులకు గురవుతున్న దళితులు, మైనారిటీలు, ఇతర బలహీనవర్గాలను, లౌకిక, ప్రజాస్వామ్య భావాలు గలిగిన ప్రజలను సమీకరించటం సాధ్యం. దేశప్రజల్లో అత్యధికులు లౌకికవాదులు, ప్రజాస్వామ్యవాదులు. గత ఎన్నికల్లో బిజెపికి లభించిన ఓట్లు 31 శాతమే అని మరిచిపోరాదు. అందువల్ల, ప్రతిపక్షపార్టీలు కాలయాపన చేయకుండా మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ప్రచారాందోళన చేపట్టటం అవసరం. ఇది కేవలం ఎన్నికల ప్రచార సందర్భాలకు పరిమితం కారాదు.

ఇటు 'క్రాంతి' అటు కుమ్మక్కు

Economic&PoliticalWEEKLY ఆగస్టు 12 సంపాదకీయం

చూపు

ప్రస్తుతం అధికారంలో ఉన్న హిందుత్వవాద జాతీయవాదులు భారత ప్రజలందరి తరపున మాట్లాడుతున్నారు. ప్రజలు ఏం భావించాలో, ఏం ఆలోచించాలో కూడా చెప్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ జాతీయవాదులు కూడా చాలా కాలం ఇదే పని చేశారు. మహాత్మాగాంధీ భారీ ఎత్తున ప్రజలను సమీకరించి బ్రిటిష్ వారిని పారదోలారని పాఠ్య పుస్తకాలలో రాశారు. కాని ఈ జాతీయోద్యమమే బ్రిటిష్ వారిని పారదోలిందా? 1942లో బ్రిటిష్ వారిని పారదోలడానికి ఒక ప్రయత్నం జరిగింది. కాని ఆ సంఘటన జరిగి 75 ఏళ్లు గడిచిన తర్వాత దేశంలో కెల్లా అతి పెద్ద ఇంగ్లీషు పత్రిక టైమ్స్ ఆఫ్ ఇండియా 2017 ఆగస్టు 9వ తేదీ సంచికలో హిందుత్వవాద సిద్ధాంతకర్త అయిన రాకేశ్ సిన్హా ఒక వ్యాసం రాశారు. 'ఆర్.ఎస్.ఎస్. గాంధేయ ఉద్యమంలో పాల్గొన్నంత మాత్రాన బ్రిటిష్ ప్రభుత్వాన్ని సాయుధ పోరాటం ద్వారా పారదోలాలన్న తన స్వభావాన్ని వదులుకోలేదు' అని రాశారు. అదే సమయంలో ఆయన స్వాతంత్రోద్యమ కాలంలో కమ్యూనిస్టుల 'ద్రోహపూరిత పాత్రను' గుర్తు చేయడం మరిచిపోలేదు.

ఆ సమయంలో రెండవ ప్రపంచ యుద్ధం సాగుతోంది. కొన్ని ప్రాంతాలను ఫాసిస్టులు ఆక్రమించుకున్నారు. జపాన్ భారత్‌ను ఆక్రమించుకుంటుందన్న భయాందోళనలు ఉన్నాయి. ఊహించినట్టుగానే బ్రిటిష్ పాలకులు 1942 ఆగస్టు 9వ తేదీన కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి జైళ్లల్లో పెట్టారు. అప్పుడు పోరాట పటిమ గ్రామీణ ప్రాంతాలకు పాకింది. రైల్వే లైన్లను, టెలిగ్రాఫ్ తీగలను పెరికి వేశారు. పోలీసు ఠాణాల మీద దాడులు జరిగాయి. ప్రభుత్వ భవనాలను దగ్ధం చేశారు. ఈ పని ప్రధానంగా అప్పటి యునైటెడ్ ప్రావిన్స్‌లో, బీహార్‌లో ఎక్కువగా జరిగింది. ప్రభుత్వం సైన్యాన్ని నియోగించింది. కొన్ని చోట్ల, ఉదాహరణకు బెంగాల్‌లోని మిద్నాపూర్‌లో, బొంబాయి ప్రావిన్స్‌లో, ఒరిస్సాలోని తాల్చేరులో తిరుగుబాటుదార్లు పోటీ ప్రభుత్వాలు ఏర్పాటు చేశారు.


1942లో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజాగ్రహం తారస్థాయిలో ఉంది. అందువల్ల మొదటి నుంచి క్విట్ ఇండియా ఉద్యమం హింసాత్మకంగా ఉండడంలో ఆశ్చర్యం లేదు. 'కరేంగే యా మరేంగే' అన్న నినాదం మిన్నంటింది. కాంగ్రెస్ నాయకులను ముందే అరెస్టు చేసినందువల్ల ఆగ్రహావేశులైన ప్రజలకు అడ్డులేకుండా పోయింది. నిజానికి 1921–22 మధ్య జరిగిన సహాయ నిరాకరణ ఉద్యమంలోనూ, 1930–34 మధ్య జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలోనూ ఈ ఉద్యమాల్లో పాల్గొంటున్న సామాన్య జనంపై కులీన నాయకత్వ ఆధిపత్యం ఉండేది. ఈ రెండు ఉద్యమాలే కాంగ్రెస్ ప్రారంభించిన ప్రధానమైన ప్రజోద్యమాలు. చౌరీచౌరాలో హింస చెలరేగినప్పుడు సహాయ నిరాకరణోద్యమాన్ని విరమించిన విషయం అందరికీ తెలుసు. అదే సమయంలో సుభాష్ చంద్రబోస్ పోరాట పటిమగల ఉద్యమానికి పిలుపు ఇచ్చారు. ఆయన ఆజాద్ హింద్ ఫౌజ్ ఏర్పాటు చేశారు.(ఆజాద్ హింద్ ఫౌజ్ నాజీ జర్మనీ నుంచి, సామ్రాజ్య వాద జపాన్ నుంచి సహాయం తీసుకుంది). రెండో ప్రపంచయుద్ధం తర్వాత నగరాల్లో భారీ సమ్మెలు జరిగాయి. సైనికులు బ్రిటిష్ సైన్యాన్ని, పోలీసులు తమ ఉద్యోగాలను వదిలేయడం పెరిగింది. రాయల్ ఇండియన్ నేవీలో తిరుగుబాటు జరిగింది. కమ్యూనిస్టు పార్టీ(సి.పి.ఐ.)అధ్వర్యంలో తేబాగా, తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటాలు జరిగాయి.

ప్రస్తుతం అధికారంలో ఉన్న హిందుత్వవాద శక్తుల వాదనలో నిజానిజాలేమిటి? జనసంఘ్ వ్యవస్థాపకుడు (1950లో) శ్యామా ప్రసాద్ ముఖర్జీ అంటే బిజెపికి వల్లమాలిన గౌరవం. శ్యామా ప్రసాద్ ముఖర్జీ క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో బెంగాల్ ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా ఉండేవారు. అప్పుడు బెంగాల్ గవర్నరుగా ఉన్న జాన్ హెర్బర్ట్ క్విట్ ఇండియా ఉద్యమంపై విరుచుకుపడండి లేదా రాజీనామా చేయండి అని ప్రావిన్షియల్ ప్రభుత్వాలను ఆదేశించారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ రాజీనామా చేయకుండా బెంగాల్‌లో ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని ఎలా 'ఎదుర్కుంటుందో' గమనిస్తూ ఉండిపోయారు. మిద్నపూర్‌లో కిరాతకమైన అణచివేత కొనసాగినప్పుడు కూడా ఆయన బెంగాల్‌లో మంత్రిగానే ఉన్నారు. ఇక వినాయక్ దామోదర్ సావర్కర్ (ఆయనను 'వీర' సావర్కర్ అని పిలుస్తారు) విషయానికి వస్తే ఆయన తన విడుదల కోసం ఎలాంటి పరితాపం లేకుండా అవమానకరమైన షరతులు అంగీకరించారు. తర్వాత ఆయన హిందూ మహాసభ అధ్యక్షుడై పోయారు. ఇతర మిలిటెంట్లు అందరూ పోరాట పటిమ ప్రదర్శిస్తున్న సమయంలో 1942 సెప్టెంబర్‌లో మునిసిపాలిటీలు, చట్టసభలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న హిందూ మహాసభ కార్యకర్తలకు సావర్కర్ ఒక ఆదేశం జారీ చేశారు. అదేమిటంటే 'అందరూ తమ విధులు యథావిధిగా నిర్వర్తించాలి' అని. బొంబాయి ప్రావిన్స్ హోం శాఖ 'సంఘ్ చట్టానికి పూర్తిగా కట్టుబడి ఉంది. ప్రధానంగా 1942లో చెలరేగిన అల్లర్లకు దూరంగా ఉంది' అని కితాబు ఇచ్చింది.

మరి సి.పి.ఐ. ద్రోహపూరిత పాత్ర సంగతి ఏమిటి? క్విట్ ఇండియా ఉద్యమాన్ని సి.పి.ఐ. వ్యతిరేకించడం పెద్ద పొరపాటు కావచ్చు. కాని ఆ వ్యతిరేకత ఫాసిస్టు వ్యతిరేకతలో అంతర్జాతీయతత్వానికి సంబంధించింది. ఆ సమయంలో ఫాసిస్టులు విజయం సాధిస్తారన్న భయం ఉండేది. నాజీల 'అంతిమ పరిష్కారం' భయం కూడా ఉండేది. క్విట్ ఇండియా ఉద్యమానికి ఎంచుకున్న సమయాన్ని సి.పి.ఐ. ఆమోదించలేదు. ఇలా భావించడం కూడా నిష్కారణమైంది కాదు. అయినప్పటికీ అంతర్జాతీయ సూత్రాలకు కట్టుబడి ఉంటూనే ఫాసిస్టు వ్యతిరేక పోరాటం కొనసాగించి ఉండాల్సింది. అందరూ ద్వేషించే బ్రిటిష్ ప్రభుత్వాన్ని సి.పి.ఐ. సమర్థించడం, బ్రిటిష్ ప్రభుత్వం సోవియట్ యూనియన్‌తో కలిసినప్పటికీ మహా విపత్తును ఎదుర్కోవడానికి అంతకన్నా చిన్న శత్రువుతో చేతులు కలపడం వివాదాస్పదమైంది. ఈ విషయంలో సి.పి.ఐ.లో అంతర్వైరుధ్యాలు ఉన్న మాట వాస్తవం కాని ద్రోహానికి పాల్పడిందన్న ఆరోపణ మాత్రం నిరాధారం. బ్రిటిష్ హయాంలో మరే రాజకీయ పార్టీ మీద విధించని నిషేధం సి.పి.ఐ. మీదే విధించారు.

నిజం చెప్పాలంటే బ్రిటిష్ వలస పాలన సుదీర్ఘకాలం సాగడానికి కారణం భారత కులీన వర్గాలు బ్రిటిష్ వారితో కుమ్మక్కు కావడం. కొన్ని కులీన వర్గాలు అయితే బ్రిటిష్ ప్రభుత్వంతో కుమ్మక్కైనాయి. భారత బడా వ్యాపారులు, భూస్వాములు, భారత ప్రభుత్వ ఉన్నతోద్యోగులు, బ్రిటిష్ సైన్యంలోని భారతీయులు, పోలీసులు, రాజకుమారులు బ్రిటిష్ వారితో కుమ్మక్కయ్యారు. జాతీయవాద చరిత్రలు బ్రిటిష్ వారి అణచివేత గురించి మాట్లాడతాయే తప్ప కులీన వర్గాలు బ్రిటిష్ వారితో కుమ్మక్కైన వాస్తవాన్ని ప్రస్తావించవు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2014 జూన్ 11న పార్లమెంటులో తొలి ప్రసంగంలో 1200 సంవత్సరాల కాలం హిందుస్థానీ వాసులు మానసిక బానిసత్వంలో మగ్గారు అన్నారు. వలసవాదుల చరిత్రకారులలాగే ముస్లిం నాగరికత కాలాన్ని నిరంకుశ పాలనగా మోదీ అభివర్ణించారు. ముస్లింల పాలన అంతకు ముందటి హిందూ నాగరికతకు భిన్నమైంది అని అన్నారు. 2000సం॥లపాటు స్వర్ణయుగం కొనసాగిందని పేర్కొన్నారు. అయినా పార్లమెంటులో నిరసన కాని, వ్యతిరేక వాదన కాని వినిపించలేదు. తెరమరుగైపోతున్న కాంగ్రెస్ మార్కు సెక్యులర్ జాతీయ వాదానికి, పెంపొందుతున్న హిందుత్వవాద జాతీయతావాదానికి ఘర్షణ జరుగుతోంది. ఇందులో హిందుత్వవాద జాతీయతావాదం విజయం సాధిస్తున్నట్టు కనిపిస్తోంది.

(ఇ.పి.డబ్ల్యు. సౌజన్యంతో)



మోడీకి ప్రతిసవాలు ప్రజలనుంచేనా?



టంకశాల అశోక్
9848191767

బిజెపి విసురుతున్న రాజకీయ సవాలుకు ప్రతిసవాలు ఎవరినుంచి రానున్నది? ప్రతిపక్షాల నుంచా, ప్రజలనుంచా? ఈ నెల పదకొండవ తేదీన పదహారు ప్రతిపక్షాలు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా అధ్యక్షతన సమావేశమై బిజెపిని ఎదుర్కొనేందుకు ఉమ్మడి వ్యూహం గురించి చర్చించాయి. కాని వారు సమావేశం చివరన అటువంటి వ్యూహమేదీ ప్రకటించలేదు. వ్యూహాన్ని ''రూపొందించుకోవలసి ఉంది'' అని మాత్రం అన్నారు. చేపట్టవలసిన అంశాలను మాత్రం పేర్కొన్నారు. వాటిలో ''వ్యవసాయ సంక్షోభం, కార్మిక సంక్షోభం, ప్రజల దైనందిన సమస్యల'' వంటివి ఉన్నాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగిసినందున ఇక నవంబర్‌లో రానున్న శీతాకాల సమావేశాలలోగా వాటిపై ప్రజలలోకి అందరూ కలసి వెళ్లే విషయం ఆలోచిస్తామన్నారు. కనుక సెప్టెంబర్, అక్టోబర్ మాసాలలో వారి కార్యక్రమాలు ఏ విధంగా ఉండగలవో చూడవలసి ఉంది. కాని, ప్రధానమంత్రి మోడీ నాయకత్వాన బిజెపి నుంచి గల సవాలును వారు నిజంగా ఎదుర్కొనగలరా అనే సందేహాలు కలుగుతున్నాయి.

> ప్రతిపక్షాల ఊహకు అందకుండా, వాటి పాత్ర ఏమీ లేకుండా, వాటి నాయకత్వాన్ని ఆమోదించకుండా వివిధ వర్గాల బాధితులు తమంతట తాము కదిలి మోడీ పాలనకు ఎదురు సవాళ్లు విసరవచ్చునా? ప్రతిపక్షాల వైఫల్యాలు, బలహీనతల వల్ల ఏర్పడిన శూన్యాన్ని వారే పూరించవచ్చునా? ఇటువంటి ధోరణులు బాధిత సమాజాలలో అసహజమైనవి కావు. ఇవి అంతిమంగా ఏ స్థాయికి చేరి, ఎటువంటి రూపం తీసుకుని, ఏ విధంగా ముగుస్తాయన్నది పరిస్థితులను బట్టి ఎక్కడికక్కడ భిన్నంగా ఉంటుంది కాని అటువంటి ధోరణి ఉందన్నది గుర్తించవలసిన విషయం. ఇప్పటికే తగినంత నిరసన, మంద్రస్థాయిలో సంఘటిత కార్యక్రమాలు కొన్ని ఆ విధంగా కన్పిస్తున్నాయి. ఇవి క్రమంగా పెరిగి మోడీకి ఎదురు సవాళ్లు కాగలవా?

అందుకు కొన్ని కారణాలున్నాయి. ఈ సవాలు 2014 ఎన్నికల ఫలితాలతో మొదలు కాగా తర్వాత సుమారు నలభై నెలలు గడిచాయి. ఈ కాలంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి నాయకత్వానగల ఎన్‌డిఏ విజయాలు ఎక్కువగా ఉన్నాయి. ఎన్నికలతో నిమిత్తం లేకుండా కూడా ఇతర రాష్ట్రాలు కొన్నింటిని తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. ఈ రోజున మొత్తం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ముప్పయి ఒకటిలో బిజెపి–ఎన్‌డిఏ కలిసి పద్దెనిమిదింట అధికారంలో ఉన్నాయి. తక్కిన పదమూడులో కాంగ్రెస్‌వి ఆరు కాగా, ఇతర పార్టీలవి ఏడు. కాంగ్రెస్ ఆరింటిలో ముఖ్యమైనవి కర్ణాటక, పంజాబ్ మాత్రమే. ఇదంతా చెప్పుకోవటం ఎందుకంటే, సవాలు అన్నది 2014లో మొదలు కాగా తర్వాత నలభై మాసాలు కాలంలో ప్రతిపక్షాలు ఎటువంటి వ్యూహాన్ని రూపొందించుకోలేకపోయాయి. 2019లో తిరిగి ఎన్నికలకు మిగిలింది అందులో సగకాలం ఇరవై నెలలు మాత్రమే. ఈ లోగా 2018లో మరిన్ని అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. వాటిలో బెంగాల్, ఒడిశాలను చేజిక్కించుకునేందుకు, తమిళనాడును ఇతరత్రా ప్రయత్నాలతో తన ప్రభావంలోకి తెచ్చేందుకు బిజెపి ముమ్మరంగా ఎత్తుగడలు వేస్తున్నది. కాని ప్రతిపక్షాలకు అందుకు దీటైన వ్యూహాలేమీ ఉన్నట్లు కన్పించటం లేదు.

ఇదంతా చెప్పుకోవటం ప్రతిపక్షాలను నిరుత్సాహ పరిచేందుకు కాదు. కాని చేదు నిజాలను కప్పిపుచ్చుటం సమస్యకు పరిష్కారం అనలేము. ఇటువంటివే మరికొన్ని సమస్యలున్నాయి. ఈ నెల 16వ తేదీ నాటి సమావేశానికి హాజరైన పార్టీలను గమనిస్తే, వాటిలో కాంగ్రెస్‌తో పాటు నాలుగు వామపక్షాలను మినహాయించి తక్కిన వారంతా అనుమానించ దగ్గవారే. వాటిలో కొన్ని అతి చిన్న పార్టీలు కాగా, తక్కినవి లోగడ ఎపుడో ఒకపుడు బిజెపితో చెలిమి చేసినటువంటివే. 2019 ఎన్నికల సమయానికి పరిస్థితులను బట్టి, ఒక్క తృణమూల్ మినహా ఇతర పార్టీలు ఎటైనా మొగ్గవచ్చు. సమావేశానికి ఎన్‌సిపిని ఆహ్వానించినా రాకపోవటం గమనించదగ్గది. ఎన్‌డిఎలోలేని ఇతర పార్టీలలో టిఆర్‌ఎస్, ఆప్, బిజెపి పార్టీలు మోడీ శిబిరంలో చేరే అవకాశం లేదు గాని, వారు కాంగ్రెస్‌తోనూ వెళ్లరు. మరి ప్రతిపక్షాలు బిజెడిని ఎదుర్కొనేది ఏ విధంగా?

అట్లా ఎదుర్కొనేందుకు ఎంచుకునే అంశాల ఆధారంగా అనేది జవాబు కావచ్చు. కాని ఇక్కడ కూడా సందేహాలు ఏర్పడుతున్నాయి. 2014లో మోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నుంచి ప్రజల జీవితాలకు సంబంధించి పరిష్కారమైన సమస్యలంటూ ఏమీ లేవు. ఏ అంశాలను ముందుకు తెచ్చి ఆయనకు అప్పుడు అంత ప్రచారం కల్పించారో, అవన్నీ వట్టి మాటలని ఈ సరికి తేలిపోయాయి. అంతకు ముందటి యుపిఎ ప్రభుత్వం వరుస కుంభకోణాలతో అప్రతిష్ట పాలైనందున, అవినీతిలేని ప్రభుత్వాన్నివ్వగలదనే నినాదం ఓటర్లను బాగా ఆకర్షించింది. తర్వాత నలభై మాసాల్లో మంత్రి వర్గ స్థాయిలో కుంభకోణాలు వెలుగులోకి రాని మాట నిజమే అయినా, ప్రజల దైనందిన జీవితాలకు సంబంధించిన అవినీతి యథాతథంగా కొనసాగుతున్నది. కుంభకోణాలు లేవు గదా అని ప్రజలు నిత్యజీవితపు అవినీతి బాధలను భరిస్తారనలేము. దానినట్లుంచి, కుంభకోణాలంటూ లేకపోయినా విధానపరంగా ధనిక వర్గాలకు రకరకాల యుక్తుల ద్వారా అధిక ఆదాయ మార్గాలు చూపటం ఏమీ ఆగలేదు. అవే వర్గాలకు వేలకు వేల కోట్ల రుణ మాఫీలు జరుగుతున్నాయి. భారీగా పన్ను రాయితీలిస్తున్నారు. విదేశాలనుంచి నల్లధనాన్ని రప్పించి పంచటమనే మరొక నరేంద్రమోడీ హామీని ఇపుడు వారసలు అటువంటి హామీయే లేదంటున్నారు. పరిపాలనా సామర్థ్యత అనే మూడవ హామీ అమలును కొలవటం కష్టం. మామూలు దృష్టికైతే మార్పేమీ కనిపించటం లేదు. నిరుద్యోగ సమస్య పరిష్కారం జరగకపోగా ఉన్న ఉపాధి పోతుండటాన్ని అధికార వర్గాలే అంగీకరిస్తున్నాయి. వ్యవసాయం, కార్మికుల సమస్యలు యథాతథంగా ఉన్నాయి. విద్య, వైద్యం వంటివి ఊబిలోనే కొనసాగుతుండగా సంక్షేమ రంగాన్ని బలహీన పరచటం స్పష్టంగా కనిపిస్తున్నది. ఇవి చాలవన్నట్లు పెద్దనోట్ల రద్దు సామాన్యునికి కొత్త సమస్యలు సృష్టించింది. మతతత్త్వం, దళితులపైన, అల్పసంఖ్యాక వర్గాలపైన దాడులు, ఫెడరల్ వ్యవస్థను కేంద్రీకృతంగా మార్చే చర్యలు, సాంస్కృతిక కేంద్రీకరణ ఆందోళనకరంగా మారుతున్నాయి.

ఈ విధంగా వైఫల్యాలకు, ప్రజలకు ఆందోళన కలిగించే అంశాలకు ఈ నలభై మాసాలలో కొరత అయితే లేదు. ఈ రూపంలో అందివచ్చిన అవకాశా లను ఉపయోగించుకుని ఈ నలభై మాసాలలో ప్రతి పక్షాలు చేసిందేమిటన్నది ప్రశ్న. పార్లమెంటులో, బయటా ఆయా అంశాలను లేవనెత్తటం, అరకొర ఆందోళనలు చేయటం వంటివి సరే. కాని అవి ఏ దశలోనూ ప్రభావశీలంగా కన్పించలేదు. ప్రజలకు ప్రతిపక్షాల పట్ల విశ్వాసం కలిగించినట్లు తోచలేదు. కనీసం ఈ పక్షాల మధ్య కొత్త ఐక్యతలు లేవు సరికదా, ఉన్నవారు ఒకరొకరుగా జారిపోతున్నారు. మిగిలిన వారిలో కొందరు క్రమంగా బలహీనపడుతున్నారు. మోడీ పరిపాలన వైఫల్యాలను ఇంత కాలం ఉపయోగించుకోగలిగితే ఇటువంటి పరిస్థితి ఉండేదా? వారిపట్ల ప్రజలకు ఇంతకాలంలో విశ్వాసం ఏర్పడి ఉండేది కాదా? ఉమ్మడి వ్యూహం అన్నది ఇంతకాలం లో రూపొందించుకోలేక, అటువంటిది రూపొందించు కుంటామంటూ ఈ చివరిదశలలో మాట్లాడవలసిన పరిస్థితి వచ్చేదా?

కాంగ్రెస్‌కు తన క్షీణదశ ముప్పయి ఏళ్ల క్రితం మొదలైన తర్వాత ఒక దృష్టి అలవాటైంది. అది, ఎదుటివారి ప్రభుత్వపు తప్పులతో నెగెటివ్ ఓటు ఏర్పడి దానితో తాము ఆటోమేటిక్‌గా గెలవగలమని, కనుక తమవైపునుంచి మొక్కుబడిగా ఏదో చేయటం మినహా, స్వయంగా తమ విధానాలలోని లోపాలను తొలగించుకోవటం, అధికారంలో ఉన్నప్పటి పరిపాలనా వైఫల్యాలను సమీక్షించుకోవటం వంటివి అవసరం లేనట్లు ప్రవర్తించటం వారి పద్ధతి అయింది. ఇటువంటి వైఖరులను చిరకాలం గమనించినందు వల్లనే ప్రజలకు కాంగ్రెస్ పట్ల, కొన్ని ఇతర ప్రతిపక్షాల పట్ల పోసాగిన విశ్వాసం, ఈ రోజుకు కూడా తిరిగి కుదరటం లేదు. వర్తమాన దశలో వారికి బహుశా ఇదే అన్నింటికి మించిన సమస్య కావచ్చు. అటువంటప్పుడు 2019 నాటికి వారు చేయగలదేమిటి?

ఇటువంటి పరిస్థితులమధ్య, తమకు ఎదురవుతున్న సమస్యలపై సాధారణ ప్రజలు ప్రతిపక్షాలతో నిమిత్తం లేకుండా, స్వచ్ఛంద కార్యాచరణలకు పూనుకునే స్థితి నెమ్మదిగా రావచ్చునా? ప్రతిపక్షాల ఊహకు అందకుండా, వాటి పాత్ర ఏమీ లేకుండా, వాటి నాయకత్వాన్ని ఆమోదించకుండా వివిధ వర్గాల బాధితులు తమంతట తాము కదిలి మోడీ పాలనకు ఎదురు సవాళ్లు విసరవచ్చునా? ప్రతిపక్షాల వైఫల్యాలు, బలహీనతల వల్ల ఏర్పడిన శూన్యాన్ని వారే పూరించవచ్చునా? ఇటువంటి ధోరణులు బాధిత సమాజాలలో అసహజమైనవి కావు. ఇవి అంతిమంగా ఏ స్థాయికి చేరి, ఎటువంటి రూపం తీసుకుని, ఏ విధంగా ముగుస్తాయన్నది పరిస్థితులను బట్టి ఎక్కడి కక్కడ భిన్నంగా ఉంటుంది కాని అటువంటి ధోరణి ఉందన్నది గుర్తించవలసిన విషయం. ఇప్పటికే తగినంత నిరసన, మంద్రస్థాయిలో సంఘటిత కార్యక్రమాలు కొన్ని ఆ విధంగా కన్పిస్తున్నాయి. ఇవి క్రమంగా పెరిగి మోడీకి ఎదురు సవాళ్లు కాగలవా?

పార్టీలోనూ శశి కళావిహీనం

అవినీతి కేసులో జైలులో ఉన్న శశికళ, ఎఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శి దామోదరన్‌లకు వ్యతిరేకంగా తమిళనాడు ముఖ్యమంత్రి పళని స్వామి తీర్మానాలను ఆమోదించడంతో ఇప్పుడు అందరి కళ్లూ పన్నీర్ సెల్వం శిబిరంపై ఉన్నాయి. తమిళనాడు అధికార పార్టీ వర్గాలు రెండూ విలీనం కానున్నాయన్న ఆశలు పుంజు కొన్నాయి. మాజీ ముఖ్యమంత్రి జయలలిత అంత్యక్రియలు మెరీనా బీచ్‌లో ముగిసిన కొద్ది రోజులకే మొదలైన ఈ రాజకీయ క్రీడ ఇప్పుడు ఓ కొలిక్కి వస్తోంది. జయ 2016 మే లో రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత కొద్ది నెలలకే డిసెంబర్ 5న 75 రోజులకు ఆసుపత్రిలో కన్నుమూశారు.

నాలుగు రోజుల తరువాత చెన్నై నగర మధ్యలోని టి నగర్‌లో ఆదాయం పన్నుశాఖ వారు దాడులు జరిపారు. బడా ఇసుక వ్యాపారి శేఖరరెడ్డి ఆస్తులపై సాగిన ఈ దాడులలో రూ.96.89 కోట్ల నగదు దొరికింది. అందులో రూ.9కోట్లు కొత్త నోట్ల రూపంలో ఉండగా తక్కినది పాత కరెన్సీ. రూ.36 కోట్లు విలువచేసే 127 కిలోల నగలు కూడా దొరికాయి. ఆ మరునాడు అతని అడ్డాలో మరి రూ.24 కోట్లు ఆదాయ పన్ను శాఖ కనుగొంది. ఆ డబ్బు కొత్త కరెన్సీ (రూ.2000నోట్లు) రూపంలో ఉంది. అతడిపై ఎన్‌ఫోర్సు మెంట్ డైరెక్ట రేట్, సిబిఐ విరుచుకు పడ్డాయి. డిసెంబర్ 20 నాటికి రెడ్డి, అతని ఇద్దరు సహచరులు 'మనీ లాండరింగ్' కేసులో జైలులో ఉన్నారు. తరువాత మేలో రెడ్డి బెయిల్ సంపాదించారు.

అవినీతి రాజకీయం

అయితే ఇక్కడ అసలు ప్రశ్న ఏమిటంటే తమిళ రాజకీయాలలో రెడ్డి ఎలా కీలక వ్యక్తి అయ్యారు? ఎలాగంటే ఆయన చాలామంది జయ మంత్రుల అవినీతి బాగోతాలు ఎరిగినవారు. వారిని కేసులలో ఇరికించే సత్తా ఉన్న వ్యక్తి ఆయన. తన జెఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా, ఎస్ ఆర్‌ఎస్ మైనింగ్ సంస్థల ద్వారా ఆయన జయలలిత, వికె శశికళ సహా అనేకమంది రాజకీయ బడా వ్యక్తుల అక్రమ కార్యకలాపాలకు సూత్రధారిగా మారారని ప్రభుత్వంలోని వారే చెప్పారు. అందుకు ప్రతిఫలంగా అనేక ప్రభుత్వ హైవే ప్రాజెక్టుల కాంట్రాక్టులు ఆయనకు దక్కాయి.. వాటిలో తూర్పు కోస్తా రోడ్డు విస్తరణ వంటివి కూడా ఉన్నాయి.

వెల్లూరులో, ఇసుక త్రవ్వకం పథకాలు ఆయన గుప్పిట్లోనే ఉండేవి. జయలలిత మంత్రివర్గంలో ప్రస్తుత ముఖ్యమంత్రి పళని స్వామి రోడ్లు, హైవేల మంత్రిగా ఉన్నప్పుడే ఆ హైవే కాంట్రాక్టులు రెడ్డి కి విరివిగా కట్టబెట్టడం జరిగింది. ఆ సమయంలో జయ మంత్రివర్గంలో ప్రజా పనుల శాఖ మంత్రిగా ఉన్న పన్నీర్ సెల్వం హయాంలోనే రెడ్డికి ఇసుక త్రవ్వకం కాంట్రాక్టులు విరివిగా దక్కాయి. ఆయన తమిళనాడుకు అంతకు ముందు ముఖ్యమంత్రిగా ఉన్నారు కూడా. రెడ్డితో తమకు ఎలాంటి సంబంధాలూ లేవని ఇటీవల పళని, పన్నీర్ ఇరువురూ పదేపదే ప్రకటించారు.

గత ఫిబ్రవరిలో ఎఐఎడిఎంకెలో మొదటగా తిరుగుబాటు జెండా ఎగురవేసింది పన్నీర్ సెల్వం. ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన తరువాత జయ మిత్రురాలు శశికళ పార్టీ ప్రధాన కార్యదర్శి పదవిలోకి వచ్చారు. తనను రాజీనామా చేయాల్సిందిగా శశికళ బలవంతపెట్టారని, తాను ఆమె సారథ్యాన్ని అంగీకరించబోనని ఎన్నో నాటకీయ పరిణామాల మధ్య జయ స్మారక ప్రదేశం వద్ద పన్నీర్ పదినిమిషాలపాటు ప్రార్థన జరిపి ప్రకటించారు. ఆ తరువాత ప్రధాని మోడీతో సాన్నిహిత్యాన్ని పన్నీర్ పెంచుకొన్నారు. తరచూ ఆయనను ఎంఎల్‌ఏ హోదాలోనే కలుసుకొనేవారు.

శశికళ ముఖ్యమంత్రి అవ్వాలనుకొని తాత్కాలిక గవర్నర్‌కు తెలిపితే ఆయన ఆ ప్రక్రియను వాయిదా పడేలా చేశారు. లెక్క చూపని ఆస్తుల కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువడేదాకా వేచి వుండాలని బిజెపి నియమించిన ఇన్‌చార్జ్ గవర్నర్ సి.విద్యాసాగర్ రావు సూచించారు. చివరకు ఆ కేసులో శశికళ ఆమె బంధువులు ఇల్లా వరసి, విఎన్ సుధాకరన్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష పడింది. ఒక్కొక్కరిపై రూ.5కోట్ల జరిమానా కూడా విధించారు. వారు ప్రస్తుతం బెంగళూరులోని పరప్పన అగ్రహార జైలులో ఉన్నారు. అలా ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు చేజారిపోవడంతో శశికళ తన విధేయుడైన పళనిస్వామిని ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టి, మరో బంధువు టిటివి దినకరన్‌ను పార్టీ ఉప ప్రధాన కార్యదర్శిని చేశారు. ఆ విధంగా ఆమె అధికార పగ్గాలను తన చేతిలో ఉంచుకున్నారు.

జయలలిత మరణంవల్ల ఖాళీ అయిన ఆర్‌కెనగర్ సీటుకు ఉప ఎన్నిక జరగాల్సి ఉండగా అది అనేక వివాదాల మధ్య నిలిచిపోయింది. అయితే ఆ ఉప ఎన్నికకు దినకరన్‌ను ఎఐఎడిఎంకె(అమ్మ) అభ్యర్థిగా ప్రకటించారు. దీనితో పార్టీ 'రెండాకులు' గుర్తును తమ వర్గానికే కేటాయించాలని పన్నీర్ సెల్వం ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు.

ఆర్‌కెనగర్ సీటుపై దినకరన్ ఆశలు పెంచుకున్నారు. ఓటర్లకు పెద్దఎత్తున డబ్బులు పంచారన్న కారణంపై ఆ ఉప ఎన్నిక చివరకు నిరవధికంగా రద్దు అయింది. అనంతరం అనేక పరిణామాల తర్వాత ఎఐఎడిఎంకెలోని రెండువర్గాలు ఏకమయ్యే అవకాశాలు మెరుగుపడ్డాయి. శశికళ నుంచి, శశికళ వర్గీయుల నుంచి దూరం పాటిస్తూ పార్టీలో దినకరన్ తీర్మానాలు చేయడం దీనికి కారణం. అయితే శశికళను, ఆమె వర్గం మొత్తాన్ని పార్టీ నుంచి బహిష్కరించాలని ఇరుపక్షాలు చేస్తున్న డిమాండ్ నెరవేరితేనే అందుకు మార్గం సులభం అవుతుంది.

✻ ఎస్.ఎస్.




రుతువు యేదైనా...





కుప్పిలి పద్మ
kuppilipadma@gmail.com

వర్షం కురుస్తుంటే అందంగా వుంటుంది. అలానే యీ వానాకాలం తీసుకొచ్చే యిబ్బందులూ యెక్కువే. యీ యిబ్బందుల్లో చాల వరకు పట్టింపు లేని ముందు చూపు లేకపోవటం వల్ల వచ్చేవే యెక్కువ. వానొస్తే చెరువులు, కాలవలు, సరస్సులు, నదులు పొంగి పొర్లుతుంటాయి. కురిసిన నీరు వెళ్ళడానికి వీలులేని నగరాల్లో వాన కురిస్తే యెదుర్కొనే చికాకులు అన్నీ యిన్నీ కావ్. మురికి నీరు నిలవున్న చోట దోమలు తట్టలుతట్టలుగా పేరుకుంటాయి. వుదయం వేళా సాయంత్రాల్లో వాటి ప్రతాపం చూపిస్తుంటాయి. వీటితో యీ కాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలూ యెక్కువే.



అసలు యీ దోమల బారిన పడకుండా వుండటం కోసం యెన్నెన్ని జాగ్రత్తలు తీసుకుంటారో ప్రజలు. దోమల మెష్ వున్నా సరే యే చిన్ని రంధ్రం నుంచో వచ్చేస్తాయనే భయం మనలని వెంటాడుతుంటుంది. అంతే... యిళ్ళల్లో సాయంకాలం అవ్వబోతుంటే యింటికి వున్న తలుపులన్నింటినీ హడావుడిగా మూసేస్తుంటారు. ఆల్ అవుట్స్ లాంటివి నెలసరి సరుకులు తీసుకొచ్చే బడ్జెట్‌లో చేరిపోయి చాలా యేళ్ళు అయింది. దోమల బాట్ లేని యిళ్ళు లేవిప్పుడు.

పబ్లిక్ ప్లేసెస్‌ల్లో దోమలు పోవాలని పొగని వదులుతారు. వదిలే ముందు వదులుతొన్నట్టు వొక్క హెచ్చరికా వుండదు చాల సార్లు. దోమలు యేమవుతాయో యేమో కానీ రోడ్ మీద వున్నవారికి దగ్గుతో వుక్కిరిబిక్కిరి అవ్వటం, కళ్ళు మంటలు, వళ్లంతా ఆ పొగ వాసన. ఆ పొగ యెలర్జీ వల్ల వచ్చే సమస్యలు. రోడ్ మీద వివిధ పనుల వల్ల వున్న మనుష్యులని పట్టించుకోకుండా, చిన్న హెచ్చరికా లేకుండా అలా యెలా ప్రవర్తిస్తారో ఆయా డిపార్ట్‌మెంట్స్ వాళ్ళు.

యీ కాలం రకరకాల అనారోగ్యాలతో దాదాపు అన్ని ప్రాంతాలు గందరగోళంగా వుంటాయి. పబ్లిక్ హెల్త్ బాగుంటేనే యే ప్రాంతమైనా అభివృద్ధి వైపు చొచ్చుకుపోతుంది. బాధలు, కష్టాలు, ఆరోగ్య సమస్యలూ వున్నపుడు యే పని మీద యెవ్వరూ ధ్యాస పెట్టలేరు. శారీరక మానసికారోగ్యాలు సంపూర్ణంగా వుండే సమాజాలు కళకళలాడుతుంటాయి.

నగరాలు యెప్పుడూ అభివృద్ధి వైపు చూస్తూ వుంటేనే పెరుగుదల సాధ్యం. వివిధ వ్యాపారాలకి హబ్స్ గానే వుంటాయి నగరాలెప్పుడూ. హాస్పిటాలిటీ, యెంటర్‌టైన్మెంట్, యెడ్యుకేషన్ యిలా అనేక రంగాలు యెదగడానికి నగరం నిలయమవుతుంది. అనేక సౌకర్యాలు వుండటంతో యెక్కడెక్కడి వాళ్ళో స్టార్ట్ అప్‌లకి వుత్సాహం చూపిస్తారు. ఆదర్శవంతమైన అభివృద్ధి యెప్పుడూ ప్రజల మేలునే ఆకాంక్షిస్తుంది. ప్రజల మేలు కోరే చక్కని ఆలోచనలు, ఆశయాలు వున్న ఆఫీసర్స్ యెందరో.

యీ కాలంలో నగరంలో హాస్పటల్స్ కిక్కిరిసిపోతాయి పేషెంట్స్‌తో. యింతమందీ నగరంలో వుంటున్న వాళ్ళేనా చుట్టు పక్కల నుంచి పెద్ద పెద్ద అనారోగ్యం వచ్చే వాళ్ళు వుంటారు. యెందుకంటే tertiary హెల్త్ కేర్ సెంటర్స్ సిటీస్‌లోనే వుంటాయి. యింత మందీ ఆ పెద్ద పెద్ద వాటి కోసమే వస్తున్నారా. సీజనల్‌గా వచ్చే ఆరోగ్య సమస్యలతో వస్తున్నారా. వొక వేళ చుట్టు పక్కల గ్రామాల నుంచి యిలాంటి వాటి కోసం వస్తే మరి అక్కడ వుండే ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్స్, సెకండరీ హెల్త్ సెంటర్స్ పని తీరు యెలా వుంది. వొకవేళ అవి బాగున్నా యిక్కడికి వస్తున్నారా. వస్తే యెందుకొస్తున్నారో చూడాలి.

ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్స్‌లో ఆపగలిగే ఆరోగ్య సమస్యలు ఆపగలిగితే నగరాల్లో హాస్పిటల్స్ యింతలా కిక్కిరిసి పోనక్కరలేదేమో. ముందు జాగ్రత్త చర్యలు తీసుకొంటే చిన్న చిన్న అనారోగ్యాలని యెక్కడక్కడా బాగు చేసుకోవచ్చు. పేషెంట్ కి వారితో వచ్చే వారికి శ్రమ తప్పుతుంది. వొకప్పుడు గ్రామాల్లో డాక్టర్స్ గా పనిచెయ్యటం ఆ గ్రామ ప్రజల ఆరోగ్యం బాగోగులు చూసుకొంటూ ఆదర్శ గ్రామాలుగా తీర్చి దిద్దటంలో తమ వంతు పాత్ర నిర్వర్తించాలనే పాత్రలు హీరోలుగా సాహిత్యం, సినిమాలు వచ్చేవి. వొకప్పుడంత కాకపోయినా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని కోరుతూ యిప్పుడూ ఆదర్శంగా తీసుకోతగిన యిప్పుడూ అప్పుడప్పుడు వస్తున్నాయి.

ప్రైమరీ పబ్లిక్ హెల్త్ సెంటర్స్ కో, సెకెండరీ హెల్త్ సెంటర్స్ కో యువ ఆఫీసర్స్ తమ కుటుంబ సభ్యులని ప్రభుత్వాసుపత్రులకి తీసుకువెళ్ళటం యీ మధ్య వార్తల్లో చూస్తున్నాం. అభినందించాలి వారిని. వారు యిలా వెళ్ళటం వలన అక్కడ మెరుగైన వైద్యం అందుతుందనే నమ్మకం ప్రజలకి కలుగుతుంది. వొక వేళ హెల్త్ సెంటర్స్ లో యెక్కడైనా యే మూలో వైద్యం చెయ్యడానికి కావలసిన పరికరాలు, మందులు లేకపోయినా, శుభ్రతలో, సౌకర్యాల్లో లోపం వుంటే వాటిని మెరుగు చెయ్యడానికి అవకాశం వుంటుంది. అంతా మరింత శ్రద్ధగా అన్ని వైపులా చూపు సారిస్తారు.

వీటిల్లో అవసరమైన చోట సౌకర్యాలు మెరుగుపర్చాల్సినవి యేమైనా వుంటే బాగు చేసుకోవచ్చు. చక్కని వైద్యం ప్రజలకి అందించే ప్రయత్నాలు మరింత వేగవంతం అవుతాయి. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలన్నింటికి సిటీకే వెళ్ళక్కర లేదని ప్రజలకి ఆయా సెంటర్స్ పై నమ్మకం కలిగించటం చాల అవసరం. వీటి దగ్గరకి వైద్యం కోసం వెళ్ళ వచ్చనే నమ్మకం కలిగించటం యెంత ముఖ్యమో తమపై భరోసాతో వచ్చిన పేషెంట్ కి కావలసిన వైద్యం అందించటం అంతే ముఖ్యం.

యీ మధ్య అధికారులు తమ కుటుంబ సభ్యలకి ప్రభుత్వాస్ప త్రుల్లోనే డెలివరీకి తీసుకు వెళ్ళారనే వార్తలని చూస్తున్నాం. ప్రభుత్వాసుపత్రుల పట్ల వొక నమ్మకాన్ని ప్రజలకి యివ్వటం, అలానే ఆసుపత్రులని అప్ డేట్ గా వుంచాలనే ఆలోచనలని పెంచుతాయి.

నవ నగరాలు నిర్మించాలనుకున్నప్పుడు అన్ని రంగాల అభివృద్ధికి పెద్ద పీట వెయ్యటమే మార్గం. అయితే యీ ఆ నగరాలని ఆకృతి దిద్దాలనుకొనే కాలంలో ప్రజల దైనందిన జీవితం యిబ్బందుల బారిన పడకుండా చూడటం ప్రథమ కర్తవ్యంగా చూడాల్సిందే. అందుకు కావలసిన ప్రణాళికలు రచించాల్సిందే. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నిరంతరం యెన్నో కొత్త మార్గాలని అన్వేషిస్తుంటారు. అన్వేషిం చాలి కూడా. అభివృద్ధి అయింది అనేది యేం వుండదు. నిరంతరం పని చెయ్యటంలోనే వొక వుత్సాహం సౌందర్యం వున్నాయి.

అప్పుడు కాలం యేదైనా ప్రజలు బోలెడు యిబ్బంది పడకుండా ఆయా రుతువుల అందాన్ని ఆస్వాదించగలరు. వర్షం కురుస్తుంటే మరింత వుత్సాహంగా భవిష్యత్తుని తీర్చిదిద్దు కోవాలనుకొంటారు. అందంగా వుంటుంది.

రోజుకొక డ్రైఫ్రూట్‌తో రోగనిరోధకశక్తి



డ్రైఫ్రూట్స్‌లో పోషక విలువలు అధికం. శరీరంలో వ్యాధినిరోధక శక్తిని కలుగజేయడంలో వీటి పాత్ర అమోఘం. వీటిలో ఖనిజ లవణాలు, విటమిన్లు ఎక్కువ. కొన్నిసార్లు పని ఒత్తిడి వల్ల భోజనం చేయడం కుదరదు చాలామందికి. అలాంటప్పుడు కడుపు మాడ్చుకోకుండా భోజనానికి ప్రత్యామ్నాయంగా కొన్ని డ్రైఫ్రూట్స్ తింటే సరిపోతుంది. ఒంట్లో శక్తి లేనప్పుడు 5,6 డ్రైఫ్రూట్స్‌ను తింటే తక్షణ శక్తి లభిస్తుంది. రోజులో ఎప్పుడైనా సరే తినాలి. వీటివల్ల రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుంది. వీటిల్లో ఉండే ఎక్కువ శాతం ఫైబర్‌వల్ల మలబద్ధకం వంటి సమస్యలు దూరమౌతాయి.అజీర్తిని నివారించే మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. డ్రై ఫ్రూట్స్‌లో ఫ్యాట్స్, ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉండటం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్‌ను కంట్రోల్ చేస్తాయి. జుట్టు ఊడిపోవడం, పలచబడటంలాంటి సమస్యల్ని కూడా పోగొట్టే గొప్ప శక్తి వీటికి ఉంది. వీటిల్లోని ఫ్లేవనాయిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని క్యాన్సర్ కణాల అభివృద్ధిని అడ్డుకుంటుంది. కెరోటినాయిడ్స్, విటమిన్ ఎ అధికంగా ఉండే డ్రైఫ్రూట్స్ తినడం వల్ల కంటిచూపు మెరుగుపడుతుంది. అంతేకాకుండా ఎముకలకు బలాన్నిస్తాయి. చిగుళ్ల వ్యాధులను, దంత క్షయాన్ని అడ్డుకుంటాయి. రక్తపోటు అదుపులో ఉంటుంది. వృద్ధాప్యాన్ని దరిచేరనీయదు. చర్మాన్ని తాజాగా ఉంచడంలో వీటి పాత్ర ఎక్కువ.

భావోద్వేగాలను నియంత్రించుకోండి

ఇంట్లో, ఆఫీసుల్లో ఎప్పుడూ ఒకలాగే ఉండటం ఎవరివల్లా కాదు. కొన్నిసార్లు కొన్ని సంఘటనలు, కొందరు వ్యక్తుల వల్ల మనసు కష్టంగా, చికాగ్గా మారుతుంటుంది. అటువంటప్పుడు ప్రతికూలతలను పెంచే పనులకు దూరంగా ఉండటం మంచిది. లేకుంటే సమస్య మరింత తీవ్రంగా అయ్యే ప్రమాదం ఉంది. అలా కాకుండా చాలామంది బాధ కలగ్గానే వెంటనే ఫేస్‌బుక్, వాట్స్‌యాప్, ట్విట్టర్ లాంటి సోషల్ మాధ్యమాల్ని ఆశ్రయిస్తుంటారు. మనసులో కలిగిన భావాలకు అనుబంధంగా ఉండే రకరకాల సందేశాలు, చిత్రాలను పోస్ట్ చేస్తుంటారు. అయితే భావోద్వేగాల నిడివి, అవి మనపై చూపే ప్రభావం చాలా తక్కువ సమయమే. ఎప్పటికీ శాశ్వతంగా ఉండవు. ఈలోగా తొందరపడి చేసే పనుల వల్ల నష్టాలు తప్పవు. కొన్ని రోజుల తర్వాత మన పోస్టులు మనకే ఎబ్బెట్టుగా కనిపిస్తాయి. అందుకే మనసు బాలేనపుడు సోషల్ మీడియాకు దూరంగా ఉండటం ఉత్తమం. అంతగా కాకుంటే మన బాధ, సమస్యను నోట్ పుస్తకంలో రాసుకుని, తర్వాత చించేస్తే సరిపోతుంది. మనసు బాలేనపుడు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోకూడదు. అలాంటి సమయాల్లో తీసుకున్న నిర్ణయాలు మెరుగైన ఫలితాల నివ్వవు. అందుకే ఒత్తిళ్లు, ఆవేశం ఉన్నప్పుడు కీలక నిర్ణయాల జోలికి వెళ్లకూడదు. ఇవన్నీ జీవితంలో ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. ఎవరైనా నిందించినా, విమర్శించినా ఒకటికి పదిసార్లు ఆలోచించాలి తప్ప మనసుకు తీసుకోకూడదు. ఇలాంటివి విన్నప్పుడు అవి ఎదుటివారి వ్యక్తిత్వ లోపం అనుకోవాలి తప్ప పట్టించుకోకూడదు. విసుగ్గా అనిపించినపుడు స్నేహితులతో, కుటుంబ సభ్యులతో వాదనలు పెట్టుకోకూడదు. అవి కొన్నేళ్లుగా సాగిస్తున్న అనుబంధాల్ని దూరం చేస్తాయి. ఒత్తిడిగా ఉన్నప్పుడు నోరు అదుపు తప్పే ప్రమాదం ఉంది. ఆఫీసులో చికాకులు తలెత్తినప్పుడు సహోద్యోగులతో కలిసి క్యాంటీన్‌కు వెళ్లాలి. స్నాక్స్ తింటూ కాసేపు కబుర్లు చెప్పుకుంటే మనసుకు రిలాక్స్‌గా ఉంటుంది. అలాకాకుండా పట్టలేని ఆవేశంతో పై అధికారికి మెయిల్ పెట్టడం, ఫిర్యాదు చేయడంలాంటివి మంచిది కాదు. మనపై వారికున్న సదభిప్రాయం పోతుంది. కొంతమంది మనసు బాలేనపుడు తమ బాధను వెంటనే ఇతరులతో పంచుకుంటారు. నిజానికి ఇది మంచి పద్ధతి కాదు. ఎదుటి వారు దాన్ని మనసులో పెట్టుకోకుండా ఇతరులకు చెప్పేస్తే మనకే నష్టం. వాహనాలు నడపటం, నిద్రపోవడం, అదేపనిగా తినడం ఇలాంటి సమయాల్లో మంచిది కాదు. ఏకాగ్రత లేనప్పుడు వాహనాలకు దూరంగా ఉండాలి. లేదంటే ప్రమాదాల బారిన పడటం ఖాయం. ఆకలి ఉంటేనే తినడం, నిద్ర వస్తేనే పడుకోవాలి. లేదంటే ఊబకాయం బారినపడతాం. మనసు చికాగ్గా ఉన్నప్పుడు కాసేపు ధ్యానం చేయాలి. లేదంటే మౌనాన్ని ఆశ్రయించాలి. మంచి సంగీతాన్ని వినడం సమస్యకు సమాధానమే.



అదిరేటి లుక్కు...





పార్టీలు, ఫంక్షన్లకు వెళ్లేటపుడు అందరిలో ప్రత్యేకంగా కనబడాలని ఎవరికుండదు. కట్టూ బొట్టూ స్పెషల్‌గా ఉండేలా తయారవుతుంటారు. ఇలాంటప్పుడు హ్యాండ్‌బ్యాగులు వేసుకుంటే అస్సలు బాగోదు. సెంటరాఫ్ ఎట్రాక్షన్ కావాలంటే చేతిలో క్లచ్ ఉండాల్సిందే. లేటెస్ట్‌గా దొరికే క్లచ్‌లు స్టైయిలిష్ లుక్‌ని ఇస్తాయి.. ఆన్‌లైన్‌లో ఎన్నో మోడల్స్ దొరుకుతున్నాయి.. ఒక్క క్లిక్‌తో మీ కోసం రెడీగా ఉన్నాయి...







నల్లధనాన్ని విదేశాలకు తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు

మన తెలంగాణ / హైదరాబాద్ : వివిధ రూపాల్లో రూ.65 లక్షల కోట్ల నల్లధనం విదేశాల్లో ఉన్నట్లు అనేక సంస్థలు ప్రకటించాయని, నల్లధనాన్ని విదేశాలకు తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశం నుండి బయటకు వెళ్ళిన లక్షల కోట్ల రూపాయల నల్లధనాన్ని వెలికితీసి ప్రజలందరికీ పంపిణీ చేస్తానని ప్రకటనలు చేసిన ప్రధానిA మోడీకి అత్యంత మిత్రుడు ఆదాని గ్రూపునకు చెందిన కంపెనీలు విద్యుత్ ప్లాంట్ పరికరాల కొనుగోలులో విదేశాల దిగుమతులపై అసలు విలువకు మించి అదనపు విలువను చెల్లించి, ఆ విధంగా చెల్లించిన అదనపు డబ్బులు నల్ల ధనంగా మార్చినట్లు ఎకనామిక్ పొలిటికల్ వీక్లీ (ఇపిడబ్ల్యు) పత్రిక పరిశోధన నివేదిక వెల్లడించిందన్నారు. సాక్ష్యాధారాలతో నివేదికలు ప్రకటించినప్పటికీ ప్రభుత్వం చర్య తీసుకోకపోవడంలోని అంతరార్యమేమిటని, ఎందుకు విచారణ జరిపించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఇంత కన్నా పెద్ద కుంభకోణం మరొకటి లేదని, ఇది ప్రధాని కనుసన్నలలోనే జరిగినట్లు భావించాల్సి వస్తున్నదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



పాత పద్ధతిలోనే ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

మనతెలంగాణ/హైదరాబాద్ : ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక ఈ ఏడాది కూడా పాత పద్ధతిలోనే జరుగనుంది. ఈ పురస్కారాల కోసం టీచర్లు స్వయంగా ప్రతిపాదనలు పంపించుకోవడం కాకుండా ఉత్తమ సేవలు అందించిన టీచర్లను ప్రభుత్వమే గుర్తించి ఉత్తమ గురువులను ఎంపిక చేయాలAని గతంలో మంత్రి కడియం శ్రీహరి ప్రతిపాదించారు. దీనిపై పాఠశాల విద్యాశాఖ ఓ కమిటీని నియమించింది. ప్రస్తుతం ఎంఇఒలు, ఇతర పర్యవేక్షణాధికారులు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఉత్తమ ఉపాధ్యాయుల గుర్తించడం కష్టమని ఆ కమిటీ తేల్చినట్లు సమాచారం. అందుకే ఈ సారి మాత్రం పాత పద్ధతిలోనే ఉత్తమ గురువులను గుర్తించి వచ్చే ఏడాది నుంచి కొత్త విధానంలో ఎంపిక చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ డిఇఒలకు ఆదేశాలు జారీ చేశారు.

గులాబీ పురుగుతో గుబులు

పత్తి రైతుల ఆందోళనపై అధ్యాయనానికి అధికారుల బృందం

మన తెలంగాణ/హైదరాబాద్ : పత్తి రైతుకు గుబులు పుట్టిస్తోన్న కాయ తొలుచు గులాబీ పురుగు (పింక్ బోల్‌వార్మ్)పై వ్యవసాయ శాఖ జిల్లాలకు అధికారుల బృందాలను పంపింది. గులాబీ పురుగు ఏ స్థాయిలో ఉందో అధ్యయనం చేయనున్నారు. అలాగే పురుగు నివారణకు రైతులు తగిన చర్యలు తీసుకునే విషయమై అవగాహన కల్పించనున్నారు. ఈ పురుగు దాడి అధికంగా ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలోనే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఏడాది పత్తి సాగు అంచనాలను మించి సాగైంది. ఏకంగా 44.72 లక్షల ఎకరాలలో రైతులు పత్తి సాగు చేశారు. అయితే ఈసారి మొగ్గదశలోనే కాయతొలుచు పురుగు దాడిచేస్తోంది. దీంతో చిరు కాయలు, పూత రాలిపోతోంది. కాయతొలుచు గులాబీ రంగు పురుగుతో పంటకు తీవ్ర నష్టం కలిగి దిగుబడిపై ప్రభావం చూపనుంది. పిల్ల పురుగులు పూత మొగ్గలను తొలుచుకుని లోనికి ప్రవేశించి కాయ పదార్థాన్ని తినేస్తాయి. దీంతో పత్తి కాయ పనికిరాకుండా పోతుంది. ఫలితంగా దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీని ఉధృతి ఎక్కువగా కాకుండా నివారించడానికి ముందుగానే యుద్ధప్రాతిపదికన సమగ్ర నివారణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచనల మేరకు అధికార బృందాలు జిల్లాలకు వెళ్లాయి.

పురుగును నివారించడానికి ముఖ్యంగా చేయాల్సినవి

* పంట 45 రోజుల వయస్సు లేదా పూత దశలో ఉన్నపడు ఎకరానికి 8 లింగాకర్షక బుట్టలను అమర్చి పరుగు ఉధృతిని గమనించాలి
* లింగాకర్షక బుట్టలలోని ఎరను ప్రతి 21 రోజులకోకసారి విధిగా మార్చాలి
* ఫిరమోన్ కెమికల్స్ రూపొందించిన లింగాకర్షక బుట్టలు, ఎరలను వాడాలి
* పురుగు ఆశించిన కాయలకు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
* గులాబి రంగు పరుగు ఆశించిన గ్రుడ్డిపూలను ఏరి నాశనం చేయాలి
* ప్రతి రెండు నుంచి మూడు పిచికారీల తరువాత పురుగు మందుతో పాటు 5 మి.లీ వేపనూనెను పిచికారీ చేయాలి
* పురుగు మందులను ఉదయం 10 గంటలలోపు లేదా సాయంత్రం 46 గంటల లోపు పిచికారీ చేస్తే నివారణ వేగంగా జరుగుతుంది


లోక్‌సభ ఎన్నికలకు అమిత్ షా బ్లూప్రింట్

న్యూఢిల్లీ : ఇటీవల 95 రోజుల పాటు దేశవ్యాప్తంగా పర్యటించిన బిజెపి అధ్యక్షుడు అమిత్ షా 2019 లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెల్చుకోవడమే లక్ష్యంగా కేబినెట్ మంత్రులు, పార్టీ సీనియర్లు ఇతర ముఖ్య నాయకలకు దిశానిర్దేశం చేశారు. 350 పైచిలుకు స్థానాలను గెల్చుకుని తీరాలని...ఆ దిశగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో తమ పార్టీ పట్టు తగ్గి చేజార్చుకున్న ప్రధానంగా పశ్చిమబెంగాల్, అసోం, ఒడిశా, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, కేరళ లాంటి రాష్ట్రాల్లో 150 స్థానాలను ఈ సారి హస్తగతం చేసుకునే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వారికి సూచించారు. షా అధ్యక్షతన జరిగిన కీలక సమావేశంలో కేంద్ర మంత్రులు జెపి నడ్డా, రవి శంకర్ ప్రసాద్, ప్రకాశ్ జవదేకర్, అనంత్ కుమార్, ధర్మేంద్ర ప్రధాన్, పీయూష్ గోయల్, నిర్మలా సీతారామన్, మనోజ్ సిన్హాతో పాటు యుపి మంత్రి స్వతంత్ర దేవ్ సింగ్, బిజెపి జాతీయ కార్యదర్శి మహేంద్ర సింగ్ (అసోం ఇన్‌చార్జ్), ముంబై బిజెపి చీఫ్ ఆశిష్ షెలార్ తదితరులు పాల్గొన్నట్లు బిజెపి వర్గాలు తెలిపాయి. ఒక్కో మంత్రికి ఐదు లోక్‌సభ స్థానాల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే దిశగా పార్టీ తరచూ సర్వేలు నిర్వహిస్తుందని ఆయన పార్టీ నాయకులకు ఈ సందర్భంగా చెప్పినట్లు తెలిసింది. అమిత్ షా దిశానిర్దేశం ప్రకారం, వచ్చే లోక్‌సభ ఎన్నికల ను దృష్టిలో పెట్టుకుని మంత్రులు, నాయకులు తమకు అప్ప గించిన స్థానాల్లో పార్టీ స్థానిక విభాగాలతో కలిసి తరచూ పర్యటించవచ్చని తెలుస్తోంది. 2019 ఎన్నికల వరకు ప్రతి లోక్‌సభ స్థానం పర్యవేక్షణ కోసం దేశవ్యాప్తంగా 600 మంది పూర్తిస్థాయి కార్యకర్తలను కూడా గుర్తిం చారు. కేరళలోని లోక్‌సభ స్థానాలను ధర్మేంద్ర ప్రధాన్‌కు, తమిళనాడు స్థానాలను పీయూష్ గోయల్‌కు, కర్నాటక స్థానాల పర్యవేక్షణ బాధ్యత లను నిర్మలా సీతారామన్‌కు అప్పగించారని ఒక బిజెపి నేత చెప్పారు.

కాళేశ్వరంపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా వేయాలి : మర్రి

మన తెలంగాణ/ న్యూఢిల్లీ: పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాలకు ముందు చేపట్టవలసిన కనీస పాలనా పద్ధతులను, విధి విధానాలను పాటించనందుకు కాళేశ్వరం ప్రాజెక్టు మీద పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలని తెలంగాణకి చెందిన మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి కేంద్ర పర్యావరణ శాఖ కార్యదర్శి అజయ్ నారాయన్‌ఝాని శుక్రవారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలసి కోరారు. అనంతరం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించి భేటీ వివరాలను వెల్లడించారు. ప్రస్తుత ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును పునః డిజైన్ చేసి కాళేశ్వరం ఎత్తిపోతల పథకంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. ఈ ప్రాజెక్టు అనుమతుల ప్రక్రియలో భాగంగా నిర్వహించాల్సిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాలు 15 ప్రదేశాలలో ఈనెల 22 నుంచి 26 వరకు జరపాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందని, అయితే ఆ బహిరంగ ప్రజా విచారణ సమావేశాలకు ముందు పాటించాల్సిన విధి విధానాలు పూర్తి స్థాయిలో చేయనందుకు ఈ వాయిదా వేయాలని కేంద్రాన్ని కోరవలసి వచ్చిందన్నారు. మొత్తం ప్రాజెక్టు ఖర్చు రూ. 80,000 కోట్లపైన ఉన్నందున, దీని వలన రాష్ట్ర ఆర్థిక, పర్యావరణ మరియు సామాజిక అభివృద్ధి మీద విపరీత ప్రభావం ఉంటుంది కనుక, బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కూడా నిర్వహించాలని మర్రి శశిధర్ రెడ్డి అన్నారు. పర్యావరణ ప్రభావ మదింపు ముసాయిదా నివేదిక కూడా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వెబ్‌సైట్‌లో పెట్టారు. కానీ స్పష్టంగా ఎక్కడ చూడాలో తెలియకుండా పెట్టారని ఆరోపించారు. తుది నివేదిక ఇప్పటి వరకు పెట్టలేదు. 15 ప్రాంతాలలో, ఆయా కార్యాలయాలలో కూడా ఇది అందుబాటులో లేదని శశిధర్ రెడ్డి వెల్లడించారు. పూర్తి పర్యావరణ ప్రభావ మదింపు ముసాయిదా నివేదిక కూడా తెలుగులో లేదని, కేవలం సారాంశం మాత్రమే తెలుగులో ఉందని, అది కూడా వెబ్‌సైట్‌లో ఉండడంవల్ల చాలా మంది దాన్ని చదవలేకపోయారని కేంద్రానికి ఫిర్యాదు చేశారు.

కాంట్రాక్టర్లకు మేలు చేసే విధానమిది!



ఇరిగేషన్ శాఖను తప్పుపట్టిన పిఏసి

మన తెలంగాణ/హైదరాబాద్: శ్రీపాదసాగర్ రెండో దశ, ఆదిలాబాద్ జిల్లా లింగాలవాగు, వరంగల్ జిల్లా ధర్మాసాగర్ చెరువు పనుల విషయంలో నీటిపారుదల శాఖ పనితీరును పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీ (పిఏసి) తప్పుపట్టింది. ఈ మూడు ప్రాజెక్టుల్లో అధికారులు కాంట్రాక్టర్లకు మేలు చేసిన విధానాన్ని శుక్రవారం పిఏసి చైర్‌పర్సన్ గీతారెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన పిఏసి సమావేశం సమీక్షించింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి తప్పు జరిగినట్లుగా కమిటీ ముందు హాజరైన అధికారుల అంగీకరించినట్లు సమాచారం. 2005లో జరిగిన శ్రీపాదసాగర్ రెండో దశ పనుల్లో కాంట్రాక్టర్ సమర్పించాల్సిన పనితీరు గ్యారంటీ శాతాన్ని అధికారులు ఉద్దేశపూర్వకంగా 10 శాతం నుంచిA 7.5 శాతానికి తగ్గించి, కాంట్రాక్టర్‌కు మేలు చేశారని కమిటీ తేల్చింది. అధికారుల చర్యతో ప్రభుత్వ ఖజానాకు దాదాపుగా రూ.150 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అంచనా వేసింది. అదేవిధంగా 2005లోనే జరిగిన ఆదిలాబాద్ జిల్లాలోని లింగాలవాగు పనుల్లో 33 శాతం తక్కువకు కాంట్రాక్టర్‌కు రూ.8.5 కోట్ల పనులు అప్పగించారని, ఆ కాంట్రాక్టర్ పనులు చేయకున్నా మళ్లీ అతనికే అదే పనిని అంచనాలు రూ.11 కోట్లకు పెంచి అప్పగించారని కమిటీ సభ్యులు ఆక్షేపించారు. అంచనాలు పెంచి అప్పగించినా సదరు కాంట్రాక్టర్ రూ.54 లక్షల పనులే చేశారని, బిల్లులు మాత్రం తీసుకున్నాడని కమిటీ అక్రమాలను నిగ్గు తేల్చింది. ఈ విషయంలో బాధ్యులైన చీఫ్ ఇంజనీర్, సూపరింటెండెంట్ ఇంజనీర్లపై చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలని ప్రభుత్వానికి కమిటీ సిఫార్సు చేసింది. మరో వైపు వరంగల్ జిల్లాలోని ధర్మాసాగర్ రిజర్వాయర్ పనుల విషయంలో 2015..16లో తప్పుడు లెక్కలు చూపిన అధికారులు కాంట్రాక్టర్‌కు రూ.4 కోట్లపై చిలుకు మొత్తాన్ని అధనంగా చెల్లించారని చేసిన తప్పును ఎత్తిచూపారు. ఈ మొత్తాన్ని సదరు కాంట్రాక్టర్ నుంచి 2017 ఏప్రిల్‌లో రికవరీ చేశారని, అయినప్పటికీ దాదాపు ఏడాది పాటు వడ్డీని కూడా రాబట్టాలని కమిటీ ఆదేశించింది.పిఏసి సమావేశంలో కమిటీ సభ్యులు కాంగ్రెస్ ఎంఎల్‌ఎ జీవన్‌రెడ్డి, బిజెపి ఎంఎల్‌ఎ లక్ష్మణ్, టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు జీవన్‌రెడ్డి, హనుమంత్‌షిండే, ఎంఎల్‌సి భానుప్రసాద్‌తో పాటు నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, ఇఎన్‌సి మురళీధర్‌రావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సంచార కులాలకు రిజర్వేషన్లు ఇవ్వండి

మన తెలంగాణ/హైదరాబాద్: సంచార కులాలను ప్రత్యేకంగా డీ నోటిఫైడ్ ట్రైబ్స్ (డిఎన్‌టి) గ్రూపుగా గుర్తించి, రిజర్వేషన్లు కల్పించాలని సంచార కులాల ప్రతినిధులు బిసి కమిషన్‌ను కోరారు. ఇన్నాళ్లుగా గుర్తింపు లేకుండా ఉన్న తమను బిసిలుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బిసి కమిషన్ రాష్ట్ర కార్యాలయానికి సంచార కులాలు, గుర్తింపు లేని కులాల ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కమిషన్ చైర్మన్ బిఎస్ రాములు, సభ్యులు డాక్టర్ వకుళా భరణం కృష్ణమోహన్‌రావు, జూలూరు గౌరీశంకర్‌లను కలిసి వినతి పత్రాలు సమర్పించి, తమ వాదనలు వినిపించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ తమ కులాలను డీ నోటిఫైడ్ ట్రైబ్స్ (డిఎన్‌టి) గుర్తించారని, తమిళనాడు, మహారాష్ట్ర, బీహార్ తదితర రాష్ట్రాల్లో డిఎన్‌టిలుగా గుర్తించి, ప్రత్యేక రిజర్వేషన్లు కల్పిస్తున్నా రన్నారు. బాలకృష్ణ రెనకె కమిషన్, ప్రస్తుత ఇడాటె కమిషన్ తమను డిఎన్‌టిలుగా గుర్తించిందని వారు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలో తాము సంచార కులాలుగా స్థిర నివాసం లేకుండా బిక్షాటన ద్వారా బతుకులీడుస్తున్నప్పటికీ, తమను గుర్తించకపోవడం పట్ల, ఏ కులాల జాబితాలో కూడా చోటు కల్పించ లేద ని ఆవేదన వ్యక్తం చేశారు. బాగోతుల, బొప్పల, శ్రీక్షత్రియ రామజోగి, ఓడ్, గౌలి, బైలుకమ్మర (ఘిసాడి), కాకిపడగల, సాధనాశూరులు, తెరచీరల కులాల వారు తమను నిర్లక్ష్యం చేయడాన్ని ఆయా కులాల ప్రతినిధులు కమిషన్ ముందు ఆవే దన వెలిబుచ్చారు. తమను వెంటనే బిసిలుగా గుర్తించి, బిసి ఎ గ్రూపులో చోటు కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సంచార కులాల సంఘం వ్యవస్థా పక అధ్యక్షులు ఓ. నరేందర్ వంశరాజ్, వై. వెంకట నారాయణ దొమ్మర, డాక్టర్ కర్ణ ఉ పేందర్, మందుల గోపాల్, కె. వీరాస్వామి, జొన్నబోయిన వెంకన్న, మల్లేష్ వంశ రాజ్, ఎం.చెన్నయ్య గంగిరెద్దుల నరసింహల నాయకత్వంలో సంచార, వెనుకబడిన కులాల ప్రతినిధులు కమిషన్‌ను కలిసారు.

ఆకాశంలోకి 16 బెలూన్లు


మన తెలంగాణ/హైదరాబాద్: శాస్త్ర, సాంకేతిక పరిశోధనల నిమిత్తం ఆగస్టు మాసంలో 10 బెలూన్లను ఆకాశంలోకి వదులుతున్నామని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టిఐఎఫ్‌ఆర్) శాస్త్రవేత్త బి.సునీల్ కుమార్ ప్రకటించారు. అణుశక్తి శాఖ ఆధ్వర్యంలో ఇసిఐఎల్ నుంచి ఆకాశంలోకి వదులుతున్న ఈ బెలూన్లలో హైడ్రోజన్ గ్యాస్ నింపుతామని, దీంతో పాటు కొన్ని సాంకేతిక పరికరాలు కూడా ఉంటాయని వివరించారు. హైదరాబాద్‌కు 200 నుంచి 350 కిలోమీటర్ల దూరంలో పారాచూట్లతో కూడిన పరికరాలు భూమిపై పడే అవకాశం ఉందని, వాటిని చూసి భయపడకుండా దగ్గర్లోని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించాలని, పరికరాలు తెరిచే ప్రయత్నం చేయవద్దని సునీల్ కుమార్ సూచించారు. పారాచూట్లతో కూడిన పరికరాలు పడ్డ ప్రదేశం గురించిన సమాచారం తెలిపిన వారికి బహుమతి ఇస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నీటి కోసం పాదయాత్ర : మేడిపల్లి సత్యం

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటితో చొప్పదండి నియోజకవర్గంలోని కొడిమ్యాల, మల్యాల చెరువులను నింపాలని డిమాండ్ చేస్తూ టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మేడిపల్లి సత్యం ఈ నెల 20,21వ తేదీలలో పాదయాత్ర చేయనున్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని ప్రజలు సాగు, తాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. పోతారం చెరువు నుంచి, జగిత్యాల కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మేడిపల్లి సత్యం వెల్లడించారు.

కొనడం...అమ్ముడుపోవడం

ఇదేనా రాజకీయాధికారం ● ఇంటర్నెట్ పిఆర్‌పై హెచ్చరిక ..సర్కారుతీరుపై ఇసి విసుర్లు



న్యూఢిల్లీ : ఏదో విధంగా గెలవడం, అధికారం నిలబెట్టుకోవడమే నేటి రాజకీయాల రీతి రివాజుగా మారిందని ఎన్నికల కమిషనర్ ఒపి రావత్ వ్యాఖ్యానించారు. ఎన్నికలలో గెలిచేందుకు గరిష్ట మొత్తం పెట్టే తంతుకు ఇప్పుడు సరికొత్త రూపం ఏర్పడిందని, లెజిస్లేచర్లకు గాలం వేయడం ఈ కొత్త ప్రక్రియలో కీలకం అని తెలిపారు. రాజకీయ నీతిలో ఇది అత్యంత సర్వసాధారణ ఘట్టం అనుకునే స్థాయికి ఇది చేరిందని రావత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల , రాజకీయాల సంస్కరణలపై సంప్రదింపులు, సమాలోచనల పేరిట ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో ఎన్నికల కమిషనర్ మాట్లాడారు. నైతిక కట్టుబాట్లను దరిదాపుల్లోకి రాకుండా చూసుకుంటున్నారని విమర్శించారు. ఇంతవరకూ ఫిరాయింపులు ఉండేవి, అవి సక్రమంగా పద్ధతుల మేరకు జరిగేవి. అయితే ఇప్పుడు అవి గతి తప్పి ఏకంగా ప్రజా ప్రతినిధులకు గాలం దశకు చేరింది. ఈ మచ్చిక చేసుకోవడం, శిబిరాల నిర్వహణ అంతా కూడా ఓ తెలివైన రాజకీయ చాతుర్యం,ఓ ఈవెంట్ మేనేజ్‌మెంట్ అనే రీతిలో విపరీత స్థాయిలో కొనియాడబడుతోంది.అధికార రాజకీయాలకు ఇది నూతన వ్యాఖ్యానంగా మారింది, ఎన్నికలలో గెలవడం ఓ తంతు అయితే గెలిచిన వారిని ప్రలోభపర్చుకోవడం, డబ్బులు అత్యంత మెళకువగా ఆశచూపడం, ఇక పరాకాష్టగా అధికార యంత్రాంగాన్ని కరకు రీతిలో రంగంలోకి దింపడం, బెదిరింపులు వెలువడేలా చేయడం వంటివి వారివారి వనరులను బట్టి సాగుతున్నాయని ఎన్నికల కమిషనర్ స్పందించారు. సరికొత్త రాజకీయ కథనంలో ఇప్పుడు విజేతకు భాష్యం మారింది. గెలిచిన వాడెవ్వడూ ఏ పాపం చేయనివాడనే తంతును సంతరించుకున్నాడు. ఇక అధికార శిబిరంలోకి చేరేవాడు అన్ని నేరాల నుంచి విముక్తం పొందుతాడు, చివరికి కేసుల నుంచి కూడా పరిహారం దక్కించుకుంటాడు. రాజకీయ నైతికతలో ఇప్పుడు ఇదో సర్వసాధారణ ప్రక్రియ అయిపోయిందని వెల్లడించారు. ఈ పెడసరపు ధోరణిని ఛేదించే లక్ష్యం ఖరారు చేసుకోవల్సి ఉందని పిలుపు నిచ్చారు. రాజకీయ పార్టీలు, నేతలు, సభ్య సమాజంలోని సంస్థలు, రాజ్యాంగ ప్రముఖులు, మీడియా అంతా కూడా ఈ బెడద నివారణకు పాటుపడి అందరికీ ఆదర్శంగా నిలవాల్సి ఉందన్నారు. ఉత్తమమైన ఎన్నికలు, సముచితమైన భవిష్యత్తు కోసం ప్రజాస్వామిక వాదులంతా స్పందించాల్సి ఉందన్నారు.

గెలిచిన వాడి చేతిలో పాలసీ బందీ

ఎన్నికలలో ధనం ప్రధానం అయింది. దీనిని సంతరించుకునేందుకు అభ్యర్థులు వారి స్థాయిలను బట్టి రాజకీయ చందాదార్లను, విరాళాల వనరులను వెతుక్కుంటున్నారు. దీనితో గెలిచిన వారు తమకు నిధులు కట్టబెట్టిన వారికి అనుకూలంగా విధానాలను మలుచుకుంటూ పోతున్నారు. ఈ విధంగా పాలసీలు కూడా హైజాక్ అయిపోతున్నాయని ఎన్నికల కమిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల మనుగడకు డబ్బు అవసరమే అయితే అయితే ఇది పొందిన వారు గెలిచిన తరువాత దాతలకు రుణపడి చేసే పనులే ప్రమాదకరంగా మారుతాయని వ్యాఖ్యానించారు. ప్రజా ప్రయోజన లక్ష్యాలు వీడి, రాజకీయ చందాదారుల భవిష్యత్తు కోసం తీసుకునే నిర్ణయాలు చేటు కల్గిస్తాయని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలక్టోరల్ బాండ్స్‌కు ఎన్నికల సంఘం వ్యతిరేకంగానే ఉంటుందని, ఈ బాండ్లతో ఎన్నికల రాజకీయ లబ్ధికి నల్లధనం వినియోగం జరుగుతుందని తెలిపారు.

ఆన్‌లైన్ శత్రువు

ఇక ఆన్‌లైన్ ద్వారా పార్టీలకు అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేందుకు ఏకంగా ప్రజాసంబంధాల సంస్థలు ఏర్పాటు అయ్యాయని, వీటిపై ఎన్నికల సంఘం దృష్టి సారించిందని , దీనిపై స్పందించేందుకు సోషల్ మీడియా విధానం రూపొందించుకుంటుందని తెలిపారు. ప్రజలను బలవంతంగా ఓ పార్టీ వైపు లేదా ఓ భావజాలం వైపు మళ్లించేందుకు ప్రత్యేకంగా ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మాయాజాలం సృష్టించేందుకు యత్నాలు సాగడం ప్రమాదకరం అని హెచ్చరించారు. జనాభిప్రాయాన్ని ప్రభావితం చేయడం వరకూ ఓ ఎత్తయితే దానిని కలుషితం చేసి, గందరగోళానికి గురిచేసి, స్వతంత్ర ఓటుకు వీలు లేకుండా చేయడం డేంజర్ అని, ఇంటర్నెట్ ద్వారా జరిగే ఈ చట్టబద్ధ విధానాన్ని అడ్డుకునేందుకు ఎన్నికల సంఘం సరైన సోషల్ మీడియా విధానంతో కొరడా ఝుళిపిస్తుందని రావత్ హెచ్చరించారు.

కేంద్రప్రభుత్వ మార్గదర్శకాల మేరకే

సింగరేణి అవుట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాల సవరణ

మన తెలంగాణ/హైదరాబాద్: సింగరేణిలో వివిధ విభాగాలకు అనుబంధంగా పనిచేస్తున్న అవుట్‌సోర్సు కార్మికులకు ఇకపై కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కనీస వేతనాలు అమలు చేయనున్నారు. జనవరి 19, 2017 నుంచి సవరించిన కనీస వేతనాలు అమలు జరపాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు సిఎండి ఎన్.శ్రీధర్ శుక్రవారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నిర్ణయం వల్ల సంస్థలో ప్రస్తుతం వివిధ విభాగాల కింద పనిచేస్తున్న 14,921 మంది కార్మికులు లబ్ధి పొందుతారని శ్రీధర్ అన్నారు. సింగరేణిలో సివిల్, హౌజ్ కీపింగ్, గెస్ట్‌హౌజ్‌లు, ఫారెస్ట్రీ, సెక్యూరిటీ, మైనింగ్ సంబంధిత విభాగాలలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో కాంట్రాక్టర్ల ద్వారా పనిచేస్తున్న ఉద్యోగులకు ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను అమలు చేస్తుంది. కాగా ఉద్యోగుల డిమాండ్లు, కార్మిక సంఘాల ఒత్తిడి మేరకు కేంద్ర ప్రభుత్వం తాజాగా సవరించిన కనీస వేతనాలనే సింగరేణిలో అమలు చేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు ఆగస్టు 18వ తేదీన సంబంధిత శాఖల వారికి సర్క్యులర్ జారీచేసింది. సవరించిన కేంద్ర ప్రభుత్వ కనీస వేతనాలు అమలు చేయడం వల్ల కంపెనీపై నెలకు రూ.2.07 కోట్ల అదనపు భారం పడుతుంది. ఇప్పటి వరకు అన్‌స్కిల్డ్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం కింద రోజుకు రూ.313.25 చెల్లిస్తుండగా, కొత్త వేతనాల ప్రకారం ఇది రూ. 350గా పెరగనుంది. అలాగే ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు పాత వేతనాల ప్రకారం రూ.330.64 చెల్లిస్తుండగా, కొత్త వేతనాల ప్రకారం రూ.494 చెల్లిస్తారు. దీనిపై ఇంకా పూర్తి విధివిధానాలతో కూడిన మార్గదర్శకాలను త్వరలోనే విడుదల చేయనున్నారు.

పాలమూరుకు జూపల్లి శత్రువు

మన తెలంగాణ / హైదరాబాద్ : ''పాలమూరు జిల్లాకు మంత్రి జూపల్లి కృష్ణారావే మొదటి శతృవు. ''డిండికి నీటి కేటాయింపు విషయంలో జిఒను మార్చలేదని చెప్పిన మంత్రి జూపల్లి ధైర్యముంటే బహిరంగ చర్చకు రావాలి. తనది తప్పయితే ముక్కు నేలకు రాస్తానని అన్నారు. లేకపోతే మీరు పాలమూరు ప్రజలకు క్షమాపక్ష చెప్పాలి'' అని ఆయన అన్నారు. ప్రజల్లో జూపల్లిని దోషిగా నిలబెడతానని కల్వకుర్తి శాసనసభ్యులు సి.హెచ్.వంశీచంద్‌రెడ్డి విమర్శించారు. శాసనసభ మీడియా హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిండికి నీటిని తీసుకుపోవడానికి తాము వ్యతిరేకం కాదని, పాలమూరు రంగారెడ్డి పథకానికి అనుసంధానంగా కాకుండా డిండికి వేరుగా నీళ్ళు ఇవ్వాలని తాము కోరుతన్నామని స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లాకు నీళ్ళు ఇవ్వాల్సిందేనని చెప్పారు. గతంలో సిఎంకు ఎలా ఉత్తరం రాశారో అలాగే ఇవ్వాలన్నారు. ఈ నెల 21న హైదరాబాద్‌లోనే ఉంటానని, ధైర్యముంటే చర్చకు రావాలని సవాలు విసిరారు.

బిసి యువతకు ఉచిత శిక్షణ

మన తెలంగాణ/హైదరాబాద్: అటవీశాఖలో ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న బిసి యువతకు బిసి స్టడీ సర్కిల్ ఉచిత శిక్షణ ఇవ్వనుంది. అటవీ బీట్ అధికారుల, సెక్షన్ అధికారులు, రేంజ్ అధికారుల పరీక్ష కోసం ఉచిత శిక్షణకై అర్హులైన బిసి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. టిఎస్ బిసి స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఉంటాయని, ఆగస్టు 21 నుంచి 31 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్టడీ సర్కిల్ కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు సంబంధిత జిల్లా బిసి స్టడీ సర్కిళ్లలో శిక్షణ ఇస్తారు.

కన్నారెడ్డికి చిత్రహింసలపై నోటీసు

మనతెలంగాణ/హైదరాబాద్ : ఇంజనీరింగ్ పట్టభద్రుడు కన్నారెడ్డి పిటిషన్‌పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు జారీ చేసింది. పోలీసులు అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలు పెట్టారని, ఈ క్రమంలో కిడ్నీలు దెబ్బతిన్నాయని వికారాబాద్‌కు జిల్లా ఎర్రవల్లి గ్రామానికి చెందిన కన్నారెడ్డి తెలిపారు. తనపై దౌర్జన్యం జరిపిన పోలీసులపై చర్యలు తీసుకోకుండా వ్యవహరిస్తున్న పోలీసు అధికారుల చర్యను పిటిషనర్ సవాలు చేశారు. మోమిన్‌పేట సిఐ, ఇతర పోలీసు అధికారులపై చర్యలు తీసుకోకుండా ఉన్న ఎస్‌పి చర్యను చట్టవ్యతిరేకంగా పేర్కొనాలని పిటిషనర్ అభ్యర్థించారు.

ఆదర్శ భూసర్వే

(మొదటిపేజీ తరువాయి)

సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన తర్వాత ప్రభుత్వానికి ఏది ఎలా ఉంది అనే విషయంలో అవగాహన వచ్చిందని, ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయడానికి నిర్దిష్ట ప్రాతిపదిక ఏర్పడిందన్నారు. ఇప్పుడు భూ సర్వే ద్వారా రైతులకు పెట్టుబడి పథకం, ఇటు రిజిస్ట్రేషన్ల వ్యవహారం సక్రమంగా జరుగుతుందని సిఎం వారికి వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర భూ సర్వే అత్యంత విప్లవాత్మకమైన కార్యక్రమని, మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి (భూ వనరులు) హుకుమ్ సింగ్ అన్నారు. దీనికి కేంద్రం నుంచి అన్ని రకాల సహాయ, సహకారాలు అందుతాయని హామీనిచ్చారు. దేశవ్యాప్తంగా కూడా ఇలాంటి భూసర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి కెసిఆర్ దార్శనికత వల్ల ఇప్పుడు తెలంగాణలో సర్వే జరగడంపై సంతోషం వ్యక్తం చేశారు. సమగ్ర భూ సర్వే ఓ విప్లవమన్నారు. మిగతా రాష్ట్రాలకు ఆదర్శమని అన్నారు. ఈ పథకానికి కావాల్సిన ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తామని హామీనిచ్చారు. ప్రభుత్వం నుంచి ప్రాజెక్టు రిపోర్టు రాగానే కేంద్రం తరపున అందించగలిగే ప్రతి సహాయం అందజేస్తామన్నారు. రాజకీయ సంకల్పంతో ప్రజలు, రైతుల భాగస్వామ్యం కూడా ఉన్నందున 100 శాతం విజయవంతమవుతుందని ఆశాభావం వ్యక్తపరిచారు. రాష్ట్ర భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే నిర్వహించాలని, ఈ విషయంలో పూర్తి సహకారం అందిస్తామని భరోసానిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 25 ఏజెన్సీలు కూడా సర్వే నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాయని, వాటి సహకారం కూడా తీసుకోవచ్చని చెప్పారు.

20న భూ సర్వేపై ప్రగతి భవన్‌లో సమావేశం : ఈ నెల 20న ప్రగతి భవన్‌లో సమగ్ర భూసర్వేపై విస్తృతస్థాయి సమావేశం నిర్వహించాలని సిఎం కెసిఆర్ నిర్ణయించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో సమగ్ర భూసర్వే నిర్వహణకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై చర్చ జరుగుతుంది. ఇప్పటికే కొందరు కలెక్టర్లు, సీనియర్ రెవెన్యూ అధికారులతో కూడిన బృందం సర్వే సందర్భంగా చేయాల్సిన పనులకు సంబంధించిన అధ్యయనం చేస్తున్నారు. వారిచ్చే నివేదికపై కూడా చర్చ జరుగుతుంది. ఈ సమావేశంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూవనరుల విభాగం టెక్నికల్ డైరెక్టర్లు గౌతమ్ పాత్రు, దినేష్ కుమార్, డిఎస్ వెంకటేశ్, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇక రెండాకుల కలయిక

(మొదటిపేజీ తరువాయి)

మృతిపై న్యాయ విచారణకు ముఖ్యమంత్రి అంగీకరించారు. జయ స్మారక స్థలి వద్దనే ఇరు వర్గాల విలీన ప్రక్రియ జరుగుతుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. చెన్నై మెరీనా బీచ్‌లోని స్మారక స్థలి వద్ద విలీనం జరుగనుండటంతో అక్కడ భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేశారు. శశికళకు వ్యతిరేకంగా జయ స్మారక స్థలి వద్ద నుంచే పన్నీరుసెల్వం తిరుగుబాటు చేశారు. తిరిగి అక్కడి నుంచే విలీన ప్రక్రియ మొదలు అవుతుంది. ఫిబ్రవరి 7న పన్నీరుసెల్వం వర్గం విడిపోయింది. విలీనం, అధికార, బాధ్యతల పంపిణీ గురించి పళని, పన్నీరుసెల్వంలు సమావేశం కానున్నారు. మాజీ ముఖ్యమంత్రి పన్నీరును మంత్రులు వేలుమణి, తంగమణిలు శుక్రవారం కలిశారు. మరో వైపు పన్నీరు వర్గీయులు శుక్రవారం సాయంత్రమే మంతనాలు జరిపారు. విలీనం గురించి ఏకాభిప్రాయం కుదిరింది. తమ వారికి ప్రయోజనకరంగా ఉండే విధంగా విలీనం ఉంటుందని పన్నీరు తెలిపారు. ఇక స్వయంగా పన్నీరు సెల్వం ఐక్య అన్నాడిఎంకె అధ్యక్షులు అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆయన మద్దతుదార్లలో కొందరికి మంత్రిపదవులు దక్కనున్నాయి.

ఎక్కువ కాలం పొసగని విలీనం : దినకరన్

అధికార పార్టీలో తనను కాదని విలీన ప్రక్రియ జరిగిపోతూ ఉన్న దశలో శశికళ మేనల్లుడు టిటివి దినకరన్ స్పందించారు. బెంగళూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విలీనం ఎంత కాలం ఉంటుంది? ఎక్కువ కాలం మనజాలదు అని స్పష్టం చేశారు. అయినా ఇదేమంత పెద్ద విషయం కాదని కొట్టిపారేశారు. పార్టీ అధినేత్రి, జైలులో ఉన్న శశికళను ఆమె జన్మదినం సందర్భంగా కలుసుకోవడానికి దినకరన్ బెంగళూరుకు వచ్చారు. పన్నీరు, పళనిస్వామిలు వారి స్వార్థం కోసం , పదవులు కాపాడుకునేందుకు కలిసిపోతున్నారు అని, అయినా ఇదే నిలిచే కలయికనా అని ప్రశ్నించారు. ఇదో వ్యాపార ఒప్పందం లెక్కల్లో తేడా వస్తే తెగతెంపులే అయినా వారికి పార్టీ, కేడర్ గురించి పట్టించుకునే ఆలోచన ఏదీ లేదని దినకరన్ మండిపడ్డారు. 1989లో పార్టీ ప్రయోజనాలు, కార్యకర్తల సంక్షేమానికి జయలలిత నాయకత్వంలో విలీన ప్రక్రియ జరిగిందని, అది సహజ సిద్ధ విలీనం అని, ఇప్పటి విలీనం వికృతం, అశాశ్వతం విమర్శించారు.

ఇన్ఫోసిస్ కుదేలు

(మొదటిపేజీ తరువాయి)

ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. సిక్కా రాజీనామాకు దారితీసిన విషయాలను తన బ్లాగ్‌లో వెల్లడించారు. సిక్కా నిర్ణయంతో కంపెనీకి వేలాది కోట్ల నష్టమేర్పడింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌పై ఇన్ఫోసిస్ షేరు 9.6 శాతానికి పైగా పడిపోయింది. 2013 ఏప్రిల్ 12 నాటి కనిష్ఠ స్థాయికి షేరు విలువ పడిపోయింది. దీంతో ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటల్ దాదాపు రూ.22,500 కోట్లు తుడిచిపెట్టుకుపోయింది. తాత్కాలిక ఎండి, సిఇఒగా యుబి ప్రవీణ్ రావు బాధ్యతలు నిర్వహించనుండగా, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గా సిక్కా ఉండనున్నారు.

విద్యార్థులూ..వైఫల్యాలకు వెరవొద్దు : కెప్టెన్ ప్రభాత్



మన తెలంగాణ / హైదరాబాద్ : వైఫల్యాలకు వెరవకుండా పట్టుదలతో కృషి చేస్తూ ముందుకు సాగిపోయేవారు విజయ తీరాలను చేరుకోగలరని ఇండిగో ఎయిర్‌లైన్స్ పైలట్, భారత వాయుసేన పూర్వ వింగ్ కమాండర్ కెప్టెన్ ప్రభాత్ అన్నారు. గీతం విశ్వవిద్యాలయంలోని ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఏరో మోడలింగ్ కార్యశాలలో ఆయన ప్రధాన శిక్షకుడిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ పనిని విజయవంతంగా పూర్తి చేయాలని మొదలుపెట్టినా, ఇతరత్రా కారణాల వల్ల కొన్నిసార్లు వైఫల్యం చెందవచ్చని, దానికి కృంగిపోకుండా మరింత పట్టుదలతో కొనసాగించాలని విద్యార్థులకు ఉద్బోధించారు. శిక్షణలో భాగంగా తాము రూపొందించిన విమానం కూలిపోయినా, ముక్కలయినా ఎంతమాత్రం చింతించవద్దని కెప్టెన్ చెప్పారు. నిరంతర కృషితోనే విజయాలు సాధ్యపడతాయని చెప్పారు. క్రమశిక్షణ, అంకితభావం, శ్రమ, దీక్షతో చేసే పని ఏదైనా ఫలితం సానుకూలంగా వస్తుందని అన్నారు. విద్యార్థులతో తయారు చేయించిన విమానం రెండు కూలిపోయినా, దానిని సరిచేసి మూడోసారి ఎగుర వేసి క్షేమంగా కిందకు దించి విద్యార్థులను ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు.

లోధా దగా!

- కొనుగోలుదారులను నిండా ముంచిన నిర్మాణ సంస్థ
- నేరుగా హైకోర్టును ఆశ్రయించిన బాధితులు

మన తెలంగాణ /హైదరాబాద్ సిటీబ్యూరో : లోధా కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్వాకంతో కొనుగోలుదారులు దారుణంగా దగా పడ్డారు. కంపెనీ కక్కుర్తి కాస్తా కొనుగోలుదారుల మధ్య వివాదానికి దారితీసింది. లోధా దెబ్బ కొనుగోలుదారుల మధ్య చిచ్చురేపింది. సినీనటులు జగపతిబాబు సైతం బాధితుల జాబితాలో ఉన్నారు. మాటిమాటికీ ప్లాన్లు మార్చి లోధా కొనుగోలుదారులను మోసం చేసిందనిఆయన ఆరోపించారు. ఒప్పందం ప్రకారం ప్లాట్లు నిర్మించక పోవడమే కాకుండా సరైన సౌకర్యాలు కల్పించలేదని కొనుగోలుదారులు తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు. కూకట్‌పల్లిలో లోధా కన్‌స్ట్రక్షన్ కంపెనీ 9 ఎకరాల్లో లోధా జల్లేజా పేరిట అపార్ట్‌మెంట్‌లు నిర్మించింది. 32 అంతస్తుల్లో ఒక్కో ఫ్లాంట్ 5వేల ఎస్‌ఎఫ్‌టిగా నిర్మించారు. రూ.4.5 కోట్లకు ఈ ఫ్లాట్లను విక్రయించారు. గ్రీనరీ, క్లబ్‌హౌజ్, పార్కింగ్, స్విమ్మింగ్‌పూల్ లాంటి సౌకర్యాలు కల్పించారు. ఈ అపార్ట్‌మెంట్‌ల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. దీని పక్కనే మరో 4 ఎకరాల్లో లోధా మెరిడియన్ పేరిట అపార్ట్‌మెంట్‌లు నిర్మించారు. ఈ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్లను రూ.8 లక్షల నుంచి, రూ.1.5 కోట్ల వరకు విక్రయించారు. అయితే లోధా మెరిడియన్ అపార్ట్‌మెంట్‌లలో గ్రీనరీ, పార్కింగ్, క్లబ్‌హౌజ్, స్విమ్మింగ్ పూల్ లాంటి సౌకర్యాలు కల్పించలేదు. లోధా జల్లేజాలో లీజు ప్రతిపాదికన పార్కింగ్ తీసుకోవచ్చని సేల్‌డీడ్‌లో పేర్కొన్నారు. కొనుగోలు సమయంలో 30 కాగితాలపై హడావుడిగా సంతకాలు చేయించారని, కనీసం చదువుకునేందుకు సమయం ఇవ్వలేదని కొనుగోలుదారులు వాపోయారు. లోధా బిల్డర్స్‌ను తమకు సౌకర్యాలు కల్పించాలని మెరిడియన్‌లో ప్లాట్‌లు కొనుగోలు చేసిన వారు అనేక పర్యాయాలు చెప్పినా ఫలితం లేకుండా పోయింది. దీంతో జల్లేజా, మెరిడియన్‌ల మధ్య ఉన్న ప్రహరీ గోడను తొలగించాలని జిహెచ్‌ఎంసికి ఫిర్యాదు చేశారు. ప్రహరీగోడను తొలగించాలని జిహెచ్‌ఎంసి లోధా కన్‌స్ట్రక్షన్ కంపెనీకి నోటీసులు జారీ చేసింది. దీంతో జల్లేజా ఫ్లాంట్‌లు కొనుగోలు చేసిన వారు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు స్టే విధించడంతో పాటు సమస్యను పరిష్కరించాలని జిహెచ్‌ఎంసిని ఆదేశించింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు శుక్రవారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ డాక్టర్ బి.జనార్ధన్‌రెడ్డి లోధా కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రతినిధులు, జల్లేజా, మెరిడియన్ కొనుగోలుదారులతో విచారణ జరిపారు.



10 రోజుల్లోగా నివేదిక : లోధాను ఆదేశించిన కమిషనర్

కూకట్‌పల్లిలో లోధా నిర్మాణం చేపట్టిన బెలేజా, మెరిడియన్ అపార్ట్‌మెంట్ కొనుగోలుదారుల ఆరోపణలపై 10 రోజుల్లోగా పూర్తిస్థాయి వివరణ ఇవ్వాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ డాక్టర్ బి.జనార్ధన్‌రెడ్డి నిర్మాణ సంస్థను ఆదేశించారు. జిహెచ్‌ఎంసి మంజూరు చేసిన భవన నిర్మాణ అనుమతులలో పేర్కొన్న నిబంధనలను అనుసరించి పార్కింగ్, ఇతర సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. ఈవిషయంలో అపార్ట్‌మెంట్ వాసుల ఫిర్యాదులపై సమాధానాలను ఈ నెల 29న తమ కార్యాలయంలో తెలపాలని లోధా నిర్మాణ సంస్థ ప్రతినిధులకు సూచించారు. అపార్ట్‌మెంట్ నివాసితులు చేసిన ఫిర్యాదులపై న్యాయపరంగా, నిబంధనలను అనుసరించి తగిన న్యాయం చేస్తామని వారికి తెలిపారు. సమావేశంలో వెస్ట్‌జోన్ కమిషనర్ హరిచందన, చీఫ్ సిటీప్లానర్ ఎస్.దేవేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మనతెలంగాణ/జన్నారం : ఆదిలాబాద్ జిల్లా జన్నారం మండలం కామన్‌పల్లిలో వ్యవసాయ బావి వద్ద శుక్రవారం విద్యుత్ వైరు తగిలి మొర్రిగూడ గ్రామానికి చెందిన మురిముడుగుల వెంకన్న(40) అనే రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకన్న పొలంలో నీరు పెట్టేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్తుండగా విద్యుత్ సరఫరా అవుతున్న ఎర్త్ వైరు తాకి షాక్‌తో మృతి చెందాడని ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

కీలు మార్పిడికి పాక్షిక శస్త్రచికిత్స

- ఒక్క రోజులోనే డిశ్చార్జి

మన తెలంగాణ/హైదరాబాద్/ సిటీబ్యూరో : అంతర్జాతీయ స్థాయి అధునాతన వైద్యంతో మోకాలు కీలు మార్పిడి సర్జరీ చేసుకొని ఒకే రోజులో డిశ్చార్జి అయ్యే శస్త్రచికిత్సలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు నగరంలోని స్టార్ హాస్పిటల్స్ వైద్యులు తెలిపారు. మధ్య వయస్కుల్లో మోకాలి నొప్పి ఉన్నవారు పాక్షిక శస్త్రచికిత్స ద్వారా త్వరగా కోలుకోవచ్చని బంజారాహిల్స్‌లోని స్టార్ ఆసుపత్రిలో నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ నీలం రమణారెడ్డి, యూకెకు చెందిన రాయల్ ఇన్‌ఫార్మరీ ఆసుపత్రికి చెందిన ఆర్థోపెడిక్ అండ్ ట్రామా సర్జన్, పాక్షిక శస్త్రచికిత్స రూపకర్తల్లో ఒకరైన డాక్టర్ ఫిల్ హర్స్ట్ తెలిపారు. ఈ విధానంలో మొత్తం కీలును తొలగించకుండా దెబ్బతిన్న ఎముక భాగాన్ని మాత్రమే మినహాయించి మిగతా ఎముకను అంతా అలాగే ఉంచి శస్త్రచికిత్సను విజవంతంగా పూర్తి చేయవచ్చని వివరించారు.

మైనర్‌బాలికపై అత్యాచారం

మన తెలంగాణ/హైదరాబాద్/ పంజాగుట్ట : తన వద్ద విద్యనభ్యసించేందుకు వచ్చిన మైనర్‌బాలికపై ఓ ఉపాధ్యాయుడు అత్యాచారానికి పాల్పడ్డ సంఘటన ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..... బోరబండలో నివాసం ఉంటున్న భవానీ శంకర్ హోమ్ ట్యూటర్‌గా విద్యార్థులకు బోధించేవాడు. ఈ తరహాలో ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బాలిక తన ఎనిమిదవ తరగతి నుంచి భవానీ శంకర్ వద్దకు ట్యూషన్‌కు వెళ్లేది. చాలాకాలంగా పరిచయం ఉండటంతో బాలికకు మాయమాటలు చెప్పి ఆమెపై అత్యాచారం చేశాడు. అనంతరం బాలిక నిలదీయడంతో ఎవరికీ విషయం చెప్పవద్దని భయపెట్టి వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో విషయం బాలిక తండ్రికి తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడు భవాని శంకర్‌ను అదుపులోనికి తీసుకొని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ మేరకు ఎస్సార్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైక్లింగ్ ఆరోగ్యానికి మేలు : డిజిపి

మన తెలంగాణ/హైదరబాద్/సిటీబ్యూరో:సైకిలింగ్ చేయడం ద్వారా ఆరోగ్యానికి మేలు చేకూరడమే కాకుండా పర్యావరణ కాలుష్యాన్ని కూడా నివారించవచ్చని రాష్ట్ర డిజిపి అనురాగ్‌శర్మ పేర్కొన్నారు. ఇటీవల లండన్‌లో జరిగిన 1400 కిలోమీటర్ల సైక్లింగ్‌లో ఐఎస్‌డబ్ల్యులో డిఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న సదానందరెడ్డి మూడు పతకాలు సాధించారు. ఆయనను తన కార్యాలయంలో డిజిపి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సైక్లింగ్ చేయడాన్ని అందరూ అలవాటు చేసుకోవాలని, ఇందుకు సదానందరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. సదానందరెడ్డి లండన్ నుంచి ఈడెన్‌బర్గ్ వరకు ఉన్న 1400 కిలోమీటర్ల దూరాన్ని సైక్లింగ్ ద్వారా ఐదు రోజులో (జులై 30 నుంచి ఆగస్టు 4వ తేదీ)చేరుకున్నాడు.

టౌన్‌ప్లానింగ్‌లో భారీ బదిలీలు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : టౌన్‌ప్లానింగ్ విభాగంలో సుదీర్ఘకాలంగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న అధికారులకు స్థానచలనం కల్పించారు. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి)తో పాటు రాష్ట్రంలోని ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పని చేస్తున్న మొత్తం 28 మందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిహెచ్‌ఎంసి నుంచి ఒకేసారి 14 మంది ఎసిపిలను ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు.

త్వరలో కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ

- జూ.కళాశాలల మౌలిక సదుపాయాలకు రూ. 352 కోట్లు
- ఉపముఖ్యమంత్రి కడియం



మన తెలంగాణ/వరంగల్‌బ్యూరో : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను త్వరలో రెగ్యూలర్ చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం వరంగల్ అర్బన్ జిల్లాలోని రూ.7.52 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హన్మకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి వరంగల్ ఎంపి పసునూరి దయాకర్, వరంగల్ పశ్చిమ ఎంఎల్‌ఎ దాస్యం వినయ్ భాస్కర్‌తో కలిసి కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గత పాలకులు నూతన జూనియర్ కళాశాలలను మంజూరు చేశారు కాని వాటికి సంబంధించిన స్టాఫ్ ప్యాటర్న్ ఇవ్వకపోవడంతో ఎక్కువగా కాంట్రాక్టు లెక్చరర్లతో కళాశాలలను నడిపించవలసి వచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 404 ప్రభుత్వ జూనియర్ కళా శాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు 352 కోట్ల రూపాయలను ఖర్చుచేయనున్నట్లు తెలిపారు.జూనియర్ కళాశాలల్లో వసతులు కల్పించడం వల్ల ఈఏడాది అదనంగా 30శాతం అడ్మిషన్‌లు పెరిగా యన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ కాట అమ్రపాలి, రాష్ట్ర దివ్యాంగుల అభివృద్ధి సంస్థ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, వరంగల్ మహానగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఖాజా సిరాజుద్దీన్, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంచుతాం

- వైద్యఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి

మన తెలంగాణ/సిద్దిపేట ప్రతినిధి : ప్రభుత్వ ఆసుపత్రులంటే నమ్మకం పెంచేలా టిఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారిగా కిడ్నీ వ్యాధితో బాధపడే వారి సౌకర్యార్థం డయాలసిస్ సెంటర్‌ను మంత్రి హరీశ్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్‌కు ధీటుగా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. త్వరలో సిద్దిపేటలో మెడికల్ కళాశాల పనులను ప్రారంభించ నున్నట్లు తెలిపారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ పేద వారి కోసం ఆలోచన చేసి ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నారని అన్నారు.

కాచంకు శాంతి భారత్ పురస్కారం ప్రదానం

మన తెలంగాణ/హైదరాబాద్/మన్సూరాబాద్ : సామాజిక సేవ, మానవ హక్కుల కోసం కృషి చేసినందుకు శిఖరం ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో కాచం ఫౌండేషన్ చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్తాను సన్మానించారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో శిఖరం ఆర్ట్స్ థియేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర్య వేడుకల్లో శాంతి భారత్ సేవా భారత్, పురస్కారాల ప్రదానంలో భాగంగా ఎల్బీ నగర్ తెరాస మాజీ ఇంఛార్జి కాచం సత్యనారాయణ గుప్తాను జస్టిస్ పి.ఎస్ నారాయణ, మహదాయి కమిషన్ సభ్యులు శాంతి భారత్ పురస్కారంతో సన్మానించారు. శిఖరం ఆర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షులు జి. కృష్ణ, నిట్టల గోపాలకృష్ణ, సినీ దర్శకులు లక్ష్మ న్ రేఖ్ ఫేమ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కాచం సత్యనారాయణ గుప్తాకు పురస్కారం అందిస్తున్న జస్టిస్ పిఎస్ నారాయణ తదితరులు

భూ వివాదంలో తల దూర్చిన పోలీసులపై వేటు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: భూ వివాదంలో తలదూర్చి బాధితులపై అక్రమ కేసులు నమోదు చేసిన రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ డి.దుర్గాప్రసాద్, ఎస్‌ఐ జి.రాజశేఖర్‌లపై సైబరా బాద్ పోలీసు కమిషనర్ వేటు వేశారు. వీరిద్దరిని అక్కడి నుంచి బదిలీ చేసి సైబరాబాద్ ప్రధాన కార్యాలయానికి అటాచ్ చేశారు. రాయదుర్గం నూతన ఇన్‌స్పెక్టర్‌గా మాదాపూర్ ఎస్‌ఒటి ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.గంగాధర్‌ను నియమించారు. అలాగే షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీనివాసచారి, ఎస్‌ఐ ఎం.దాసుపై కూడా ఆరోపణలు రావడంతో వారిపై కూడా కమిషనర్ బదిలీ వేటు వేశారు. దాసు స్థానంలో ఎస్‌ఐ టి.విజయ్‌కుమార్‌ను నియమించారు. షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ స్థానాన్ని ఇంకా భర్తీ చేయలేదు.





ఏజెన్సీలో వరద వెల్లువ

వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పొంగిన వాగులు

మన తెలంగాణ/వరంగల్‌బ్యూరో/ఖమ్మం ప్రతినిధి : బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాల్లో ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాల్లో ఒక మోస్తరు వర్షం నమోదు కాగా ఏజెన్సీ ప్రాంతాలలో భారీ వర్షాలు కురిశాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఏటూరునాగారం, తాడ్వాయి, గోవిందరావుపేట, కన్నాయిగూడెం, వెంకటాపూర్(నూగూరు), వాజేడు మండలాల్లో భారీ వర్షాలతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది. వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గణపురంలోని మోరంచ వాగు ఉధృతంగా ప్రవహించడంతో ధర్మరావుపేట గణపురం గ్రామాలకు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ములుగు మండలంలోని బొగ్గుల వాగు ఉధృతంగాప్రవహిస్తుండడంతో జగ్గన్నగూడెం, అక్కన్న గూడెం గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తగూడ, ఇల్లందు ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు బొగ్గుల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గోవిందరావుపేట మండలంలోని దయ్యాల వాగు, గుండ్లవాగులు, చెప్పుదెబ్బల వాగులు ఉధృతంగా ప్రహిస్తుండడంతో పస్రామేడారం గ్రామాల నడుమ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కన్నాయిగూడెం మండలం కంతనపల్లి వాగు రోడ్డు పై నుంచి ప్రవహిస్తుండడంతో 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. దీంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. మెట్ట పంటలు సాగు చేసిన రైతాంగానికి వర్షం ఊరటనిచ్చింది.

నాది బ్యూటిఫుల్ జర్నీ

పదహారేళ్ల సినీ జీవితంలో భూమిక ప్రేక్షకులను మైమరపించే ఎన్నో సినిమాలు చేసింది. పలువురు స్టార్ హీరోలతో కలిసి బిగ్గెస్ట్ హిట్‌లను అందుకుంది. ఈ నేపథ్యంలో పదహారేళ్ల మీ సినీ జీవితం ఎలా అనిపించింది అని భూమికను అడిగితే... ''చాలా సంతృప్తినిచ్చింది. మూస పాత్రలు కాకుండా విభిన్నమైన పాత్రలు చేశాను. ఎంతో బలమైన పాత్రలు పోషించాను. అభిమానుల ఆదరాభిమానాలను గుండెనిండా నింపుకున్నాను. ఒక్కమాటలో చెప్పాలంటే వృత్తిపరంగా ఇది నాకెంతో బ్యూటిఫుల్ జర్నీ. ఎంతోమంది గొప్పవాళ్లతో కలిసి పనిచేయగలిగాను. ఇండస్ట్రీలో నేను సక్సెస్‌ఫుల్‌గా నిలదొక్కుకోవడానికి క్రమ శిక్షణతో కూడిన నా జీవితం, హార్డ్ వర్కే ప్రధాన కారణాలు. అందివచ్చిన అవకాశాలన్నింటినీ ఉపయోగించుకున్నాను. అశేష ప్రజల ప్రేమను, అభిమానాన్ని గెలుచుకున్నాను. నటిగా నన్నెంతగానో ఆదరించారు, ప్రోత్సహించారు... అభిమానించారు. నా నటనకు అభినందనలు కురిపించారు. అన్నింటికన్నా ఆనందం కలిగించే విషయమేమిటంటే ప్రజలు నన్ను తమ కూతురిలా భావించారు. నా పట్ల అంతులేని ప్రేమ, ఆప్యాయతలను కురిపించారు. ఇంతకన్నా ఎవరికైనా ఏం కావాలి''అని పేర్కొంది.


భూమిక


'పైసా వసూల్' ఆడియో వేడుకలో ప్రసంగిస్తున్న బాలకృష్ణ. చిత్రంలో పూరి జగన్నాథ్, వి.ఆనంద ప్రసాద్, అంబికా కృష్ణ.

'పైసా వసూల్' నా ఒకటో సినిమాతో సమానం: బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో భవ్య క్రియేషన్స్ బ్యానర్‌పై వి.ఆనంద ప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'పైసా వసూల్'. శ్రియా, కైరాదత్, ముస్కాన్‌లు హీరోయిన్లు. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ సంగీతాన్ని అందించారు. ఈ చిత్రం ఆడియో రిలీజ్ ఫంక్షన్ ఖమ్మంలో సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. 'పైసా వసూల్' ఆడియో సీడీలను బోయపాటి శ్రీను విడుదల చేసి తొలి సీడీని దర్శకుడు క్రిష్‌కు అందించారు. అనంతరం థియేట్రికల్ ట్రైలర్‌ను కూడా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ''సినిమా అన్నది పార్టీలకు అతీతం. అభిమానులకు అతీతం. ఒక మంచి ఆలోచనతో మంచి దైవ సంకల్పంతో ఈ సినిమాను ప్రారంభించాం. ఈ సినిమాకు అనూప్ రూబెన్స్ అద్భుతమైన సంగీతాన్ని అందించాడు. ఆణిముత్యాల్లాంటి ఐదు పాటలకు మణిపూసల్లాంటి బాణీలను సమకూర్చారు. నన్ను ఎవరైనా నువ్వు ఎవరు? అని అడిగితే భారతీయుడిని అని అంటాను. ఇంకోసారి నువ్వు ఎవరు? అని అడిగితే తెలుగువాడిని అని చెబుతాను. మరోసారి నువ్వు ఎవరు? అని అడిగితే... నేను నందమూరి తారకరామారావు కొడుకుని అని అంటాను. నేను అన్నగారి అభిమానిని అని చెబుతాను. నా దృష్టిలో ఆ మహానుభావుడికి ఎవరూ సాటిలేరు. ఇక ఈ సినిమాకు భాస్కరభట్ల, చిన్నారాయణ అద్భుతమైన పాటలు రాశారు. ఒక పాట నేను పాడాను. నందమూరి తారకరామారావు చిత్రం 'జీవిత చక్రం'లోని 'కంటిచూపు చెబుతోంది... కొంటె నవ్వు చెబుతోంది ఓ పిల్లా..' పాటను ఈ సినిమాలో రీమేక్స్ చేయడం జరిగింది. నందమూరి తారకరామారావు కొడుకుగా 100 సినిమాలు చేశాను. పూరి జగన్నాథ్ డైరెక్షన్‌లో నేను ఎప్పుడో సినిమా చేయాలి. చివరికి ఇప్పుడు పూరీతో మొదటి సినిమా చేశాను. ఇది నాకు 101వ సినిమా అయినా మళ్లీ ఇది నా ఒకటో సినిమాతో సమానం. మళ్లీ రీ లాంచింగ్ ఆఫ్ బాలకృష్ణ అవుతుంది ఈ సినిమా. 'పైసా వసూల్' అనేలా ఈ చిత్రం ఉంటుంది. మా నిర్మాత ఆనందప్రసాద్ స్వస్థలం అయిన ఖమ్మంలో ప్రజల మధ్యలో ఈ ఫంక్షన్ చేయడం చాలా ఆనందంగా ఉంది''అని అన్నారు. దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ ''పూరి జగన్నాథ్ తన హీరోల్లో ఉన్న హీరోయిజాన్ని అద్భుతంగా బయటకి తీస్తారు. దానికి ఉదాహరణ పోకిరి, బుజ్జిగాడు చిత్రాలు. ఆతర్వాత ఇప్పుడు 'పైసా వసూల్'. నాక్కొంచెం తిక్కుంది... దానికో లెక్కుంది అన్నా... ఒక్కసారి కమిట్ అయితే నా మాట నేనే విన్నను అన్నా... ఇప్పుడు 'పైసా వసూల్'లో 'అన్నా నేను జంగిల్ బుక్ చూడలా... అందులో పులి అచ్చం నాలాగే ఉంటుంది...' వంటి పవర్‌ఫుల్ డైలాగులు రాయాలన్నా పూరి జగన్నాథే. 'పైసా వసూల్' ఒక మంచి సినిమాగా ప్రేక్షకులు, అభిమానులతో క్లాప్స్ కొట్టిస్తుంది. అనూప్ అద్భుతమైన పాటలనిచ్చాడు. ఈ సినిమా సూపర్ హిట్ అయి నిర్మాత ఆనందప్రసాద్‌కు మంచి లాభాలు రావాలి''అని తెలిపారు. దర్శకుడు పూరి జగన్నాథ్ మాట్లాడుతూ ''ఎన్నో ఏళ్ల తర్వాత బాలకృష్ణతో పనిచేసే అవకాశం వచ్చింది నాకు. ఆయనతో ఈ సినిమాకు పనిచేశాక... ఇంతకుముందు బాలయ్యతో ఎందుకు వర్క్ చేయలేదనిపించి బాధపడ్డాను. అంత మంచి మనిషి బాలకృష్ణ. నాతో 101వ సినిమా చేశారు. ఆయన స్పీడు, దూకుడు చూస్తుంటే ఇది ఆయన ఒకటో సినిమాలా అనిపించింది నాకు. ఫైట్స్ ఇరగదీశారు. 360 డిగ్రీస్‌లో కారు ఛేజింగ్ చేశారు. హీరోయిన్స్‌ని ఎత్తుకొని అమాంతం పరిగెడతారు. ఆయన వయసు మోక్షజ్ఞ కంటే కొంచెం ఎక్కువ అనిపిస్తుంది. అనూప్ మంచి పాటలు ఇచ్చాడు''అని చెప్పారు. నిర్మాత వి.ఆనందప్రసాద్ మాట్లాడుతూ ''నందమూరి తారకరామారావు వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని సినీ, రాజకీయ సేవా రంగంలో తనదైన శైలిలో రాణిస్తూ బాలకృష్ణ తండ్రి ఆశయాలను నెరవేరుస్తున్నారు. మా భవ్య క్రియేషన్స్ బ్యానర్‌లో ఆయనతో మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. చాలా మంది 'బాలయ్యకు కోపం ఎక్కువ కదా... ఆయనతో మీరు సినిమా ఎలా చేస్తారు' అని అడిగారు. కానీ ఆయన మాట ఇస్తే సత్యహరిశ్చంద్రుడు. ఎదుటివారు మాట తప్పితే విశ్వామిత్రుడు. ఈ ఒక్క నిజం తెల్సిన వారెవరైనా కూడా బాలయ్యతో సినిమా చేయవచ్చు''అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి నామా నాగేశ్వరరావు, అంబికా కృష్ణ, అనూప్ రూబెన్స్, అలీ, శ్రియా, కైరాదత్, ముస్కాన్‌తో పాటు చిత్ర బృందం పాల్గొంది.


ప్రభాస్

'సాహో'ను మొదలుపెట్టేశాడు

'బాహుబలి'తో భారతదేశ బాక్సాఫీస్‌ను బద్దలు కొట్టిన ప్రభాస్ ఈ సినిమా కోసం ఐదేళ్లు కష్టపడిన సంగతి తెలిసిందే. ఈ చిత్రం కోసం పడిన కష్టానికి ఫలితంగా ఎవరూ ఊహించని విధంగా రికార్డు స్థాయిలో కలెక్షన్లు వచ్చాయి. ఆతర్వాత ప్రభాస్ తన నెక్స్ట్ సినిమాను ఎప్పుడు మొదలు పెడతాడా అని ఎదురుచూసిన అభిమానులకు శుభవార్త. ఎట్టకేలకు ప్రభాస్ 'సాహో' షూటింగ్‌ను ప్రారంభించేశాడు. హైదరాబాద్‌లో ఐదు కోట్లతో నిర్మించిన ఓ భారీ సెట్‌లో సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నాడు దర్శకుడు సుజిత్. ప్రభాస్ కొన్ని రోజుల పాటు షూటింగ్‌లో బిజీగా పాల్గొంటాడు. ఐదేళ్లపాటు ఫుల్‌గా బాహుబలి మూడ్‌లో ఉన్న ప్రభాస్ ఈసారి ఫుల్ యాక్షన్ తరహా చిత్రంతో రాబోతున్నాడు. దాదాపు 150 కోట్లతో యువి క్రియేషన్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఇప్పటికే బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధాకపూర్‌ను ప్రభాస్‌కు జోడీగా ఎంపికచేశారు. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. వీలైనంత త్వరగా ఈ సినిమాను పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు రావాలనుకుంటున్నాడు ప్రభాస్.


ఎన్టీఆర్

వినాయక చవితికి టీజర్

తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న సినిమాల్లో ఎన్టీఆర్ చేస్తున్న 'జై లవ కుశ' కూడా ఒకటి. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ తర్వాత తారక్ చేస్తున్న సినిమా కావడం, ఇందులో ఆయన త్రిపాత్రాభినయం చేస్తుండడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే బయటకొచ్చిన జై, లవ కుమార్ పాత్రల లుక్స్, జై పాత్ర టీజర్‌కు అనూహ్య స్పందన వచ్చింది. దీంతో చిత్ర యూనిట్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా ముందుగా చెప్పిన తేదీ సెప్టెంబర్ 21కే సినిమాను విడుదల చేయాలని నిర్ణయించుకొని శరవేగంగా పనులు పూర్తి చేస్తున్నారు. అయితే 20 రోజుల్లో పాటలు, ప్యాచ్‌వర్క్ పనులను పూర్తిచేయబోతున్నాడు ఎన్టీఆర్. ఇక సెప్టెంబర్ మొదటి వారంలో ఆడియోను రిలీజ్ చేయాలని ఫిల్మ్‌మేకర్స్ భావిస్తున్నట్టు తెలిసింది. అలాగే లవ కుమార్ పాత్ర టీజర్‌ను కూడా ఈనెల 25న వినాయక చవితి సందర్భంగా రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌లో నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నాడు.

దూసుకుపోతున్న 'జయ జానకి నాయక'


'జయ జానకి నాయక' విజయోత్సవ వేడుకలో మండలి బుద్ధప్రసాద్, బోయపాటి శ్రీను, బెల్లంకొండ శ్రీనివాస్, జగపతిబాబు, మిర్యాల రవీందర్ రెడ్డి, ప్రగ్యాజైస్వాల్, వాణీ విశ్వనాథ్ తదితరులు

బోయపాటి శ్రీను దర్శకత్వంలో బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా తెరకెక్కిన 'జయ జానకి నాయక' చిత్రం ఘన విజయం సొంతం చేసుకొని సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ద్వారకా క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో రకుల్‌ప్రీత్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలు. ఈ చిత్రం విజయోత్సవ వేడుక పుణ్యక్షేత్రం హంసల దీవిలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో చిత్ర బృందంతో పాటు ఎపి డిప్యూటి స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, కృష్ణా జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీ కాంతం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ ''అత్యంత పవిత్రమైన ఈ పుణ్యక్షేత్రంలో షూటింగ్ చేయడం కూడా మా సినిమా విజయానికి ముఖ్య కారణం. మా షూటింగ్ సమయంలో ఇక్కడి యువత సపోర్ట్ చేసిన తీరును ఎప్పటికీ మరువలేను''అని అన్నారు. కథానాయకుడు బెల్లంకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ''నేను జీవితంలో గర్వంగా చెప్పుకునే సినిమా 'జయ జానకి నాయక'. సినిమా మంచి విజయాన్ని సాధించి మరో 120 థియేటర్లు పెరగడం ఆనందంగా ఉంది''అని చెప్పారు. నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ''బోయపాటి దర్శకత్వ ప్రతిభతో 'జయ జానకి నాయక' సూపర్‌హిట్‌గా నిలిచింది.

ఈ సినిమాకు రోజు రోజుకు కలెక్షన్లు పెరుగుతుండడం ఆనందంగా ఉంది''అని తెలిపారు. జగపతిబాబు మాట్లాడుతూ ''ప్రేక్షకులు ఈ సినిమాకు ఘన విజయాన్ని అందించారు. రెండో వారంలో సినిమా థియేటర్లు పెరగడం అంటే చిన్న విషయం కాదు. బోయపాటి సత్తా ఇది. అన్నీ తానై సినిమాను నడిపించాడు''అని తెలిపారు. కార్యక్రమంలో ప్రగ్యాజైస్వాల్ మాట్లాడారు.


మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో అమ్మిరాజు కానుమిల్లి, ఆర్.వెంకటేశ్వరరావు. చిత్రంలో శ్రీకాంత్, నరేష్, శివాజీ రాజా

సినీ ప్రొడక్షన్ యూనియన్‌కు నూతన కార్యవర్గం

తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్‌కు భారీ మెజారిటీతో గెలుపొందిన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు 'మా' అధ్యక్షుడు శివాజీ రాజా, శ్రీకాంత్, నరేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గెలుపొందిన కార్యవర్గ సభ్యులను వారు అభినందించారు. యూనియన్ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్ అధ్యక్షుడిగా అమ్మిరాజు కానుమిల్లి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా డి.యోగానంద్, కుంపట్ల రాంబాబు, సంయుక్త కార్యదర్శులుగా సూరపనేని కిషోర్, జి.నాగేశ్వరరావు, కోశాధికారిగా కె.సతీష్ ప్రమాణ స్వీకారం చేశారు.

హర్రర్ థ్రిల్లర్‌లో..


సాయి పల్లవి

సౌత్ సినిమా ఇండస్ట్రీలో యంగ్ బ్యూటీ సాయిపల్లవికి మంచి క్రేజ్ ఏర్పడింది. మలయాళం చిత్ర పరిశ్రమలోనైతే ఆమె ఇప్పటికే టాప్ యంగ్ హీరోలతో సినిమాలు చేసి మంచి హిట్లను తన ఖాతాలో వేసుకుంది. ఇక తెలుగులో తన మొదటి సినిమా 'ఫిదా'తో బిగ్గెస్ట్ హిట్‌ను అందుకుంది ఈ అమ్మడు. ఈ చిత్రం తర్వాత తెలుగులో బిజీ హీరోయిన్‌గా మారుతోంది. ప్రస్తుతం రెండు సినిమాల్లో సాయి పల్లవి నటిస్తోంది. ఇప్పుడు మరో హర్రర్ థ్రిల్లర్ సినిమాలో నటించే అవకాశాన్ని పట్టేసింది. ఈ హర్రర్ మూవీలో సీరియస్ రోల్ చేయబోతోంది. థ్రిల్లర్ సినిమాలో ఉండే మలుపులు, సాయి పల్లవి నటన ఈ సినిమాకు ప్లస్ అవుతాయట. ఈ కథలో ఉండే ట్విస్ట్‌లు సాయి పల్లవికి తెగ నచ్చేశాయని అందుకనే కథ వినగానే ఈ సినిమాకు వెంటనే ఓకే చెప్పిందని అంటున్నారు. యంగ్ హీరో నాగశౌర్యకు జోడీగా చేస్తున్న సినిమాను పూర్తిచేసింది సాయి పల్లవి. ఈ చిత్రం రెండు నెలలలోపు విడుదలకావచ్చు. ఇదేకాకుండా నాని హీరోగా చేస్తున్న 'ఎంసిఎ' (మిడిల్‌క్లాస్ అబ్బాయి) సినిమా కూడా ముగింపు దశకు వచ్చిందని తెలిసింది. బహుశా ఈ రెండు సినిమాలు దగ్గర దగ్గరలోనే విడుదల కావచ్చు. ఇప్పుడు ఓకే చేసిన హర్రర్ థ్రిల్లర్ సినిమా షూటింగ్ కూడా తొందరలోనే మొదలుకావచ్చని తెలిసింది. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

అత్యున్నత స్థాయిలో విజువల్ ఎఫెక్ట్స్


అనుష్క

'బాహుబలి' తర్వాత తెలుగు ప్రేక్షకుల అభిరుచి పూర్తిగా మారిపోయింది. సినిమా నిర్మాణ విలువలు గొప్పగా ఉండాలని ప్రతి ఒక్కరూ ఆశిస్తున్నారు. ముఖ్యంగా గ్రాఫిక్స్ వర్క్ మీద నడిచే సినిమాలైతే హై స్టాండర్డ్స్‌లో ఉండాలని కోరుకుంటున్నారు. అందుకే నిర్మాతలు, దర్శకులు విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో మాత్రం చాలా జాగ్రత్తలు పాటిస్తున్నారు. వాటి విషయంలో ఖర్చుకు ఏమాత్రం వెనుకాడటం లేదు. ప్రస్తుతం అనుష్క ప్రధాన పాత్రలో జి.అశోక్ నిర్మిస్తున్న 'భాగమతి' విషయంలో కూడా ఇదే జరుగుతోంది. చిత్రీకరణ పూర్తయిపోయినా కూడా నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ విజువల్ ఎఫెక్ట్స్‌లో పూర్తి ఖచ్చితత్వం కోసం పోస్ట్ ప్రొడక్షన్‌కు కొన్ని నెలల సమయాన్ని కేటాయిస్తోంది. ప్రస్తుతం ముంబయ్‌లో జరుగుతున్న విఎఫ్ఎక్స్ పనులు నవంబర్ వరకు జరుగుతాయని... ఆతర్వాత డిసెంబర్‌లో సినిమా విడుదలవుతుందని తెలిసింది. మరి గ్రాఫిక్స్ ఆధారంగా రూపొందిన 'అరుంధతి'తో లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన అనుష్క 'భాగమతి'తో ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.



ఆది పినిశెట్టి హల్‌చల్

యంగ్ హీరో ఆది పినిశెట్టి ఫిల్మ్‌నగర్‌లో జరిగిన టోనీ అండ్ గై 123వ సెలూన్ ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొని హల్‌చల్‌చేశారు. ఆయనతోపాటు పలువురు సినీతారలు, మోడల్స్, పాల్సన్స్ గ్రూప్ సిఇఓ ఎ.మణికందన్ పాల్గొన్నారు.

మర్యాద అనేది ఇచ్చిపుచ్చుకోవాలి

నయనతార సినిమా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనదు... ఫ్రెండ్లీ టైప్ కాదనీ...ఆమెకు గర్వం, పొగరనీ చాలా మంది అనుకుంటారు. గత కొంతకాలంగా తనపై వస్తున్న ఇటువంటి ఆరోపణల గురించి నయనతార మాట్లాడుతూ ''అవును... నేను పొగరుబోతునే, అహంకారిని కూడా. అయి తే నాతో వేళాకోళంగా ప్రవర్తించే వాళ్ల దగ్గరే అలా ఉంటాను. మిగతావాళ్ల దగ్గర అలా ఉండాల్సిన అవసరం నాకేంటి?''అని అంది. ''నాతో సినిమాలు చేసినవాళ్లకూ, చేస్తున్న వాళ్లకూ నేనెంత ఫ్రెండ్లీగా ఉంటానో తెలుసు. నా గురించి నేను ఎక్కువ చెప్పుకుంటున్నానని అనుకోకపోతే ఒక్కమాట. నాది చాలా స్వీట్ నేచర్. షూటింగ్ లొకేషన్‌లో చాలా సరదాగా ఉం టాను. అందరితోనూ మాట్లాడుతుంటాను''అని నయనతార పేర్కొంది. ఇవన్నీ చెబుతూనే ఒక్క విషయం కుండబద్దలు కొట్టింది. ''ఏదేమైనా... మర్యాద అనేది ఇచ్చి పుచ్చుకోవాలి. నాకు మర్యాద ఇస్తే... నేనూ వాళ్లకు మర్యాద ఇస్తా. ఒకవేళ నా దగ్గర మర్యాదగా నడుచుకోకూడదని ఎవరైనా నిశ్చయించుకుంటే... నా నుంచి కూడా ఇక మర్యాద ఆశించవద్దు''అని చెప్పింది.


నయనతార

Infosys®

10 శాతం పడిపోయిన ఇన్ఫీ షేరు

న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్ సిఇఒ పదవికి విశాల్ సిక్కా రాజీనామా చేసిన నేపథ్యంలో కంపెనీ భారీగా పతన మైంది. దాదాపు 10 శాతంమేరకు పడిపోయి షేరు విలువ రూ.923.15కు చేరుకుంది. సిక్కా రాజీనామాతో ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటల్ నుంచి దాదాపు రూ.22,500 కోట్లు తుడిచిపెట్టుకుపోయింది. ఏడాది కనిష్ఠానికి షేరు విలువ చేరుకుంది. మరోవైపు ఇన్ఫీ ప్రభావంతో శుక్రవారం స్టాక్‌మార్కెట్ కుదేలైంది. అంతర్జాతీయ సంకేతాలు బలహీనంగా ఉండడం, ఇటీవల పెరిగిన షేర్లలో లాభాల స్వీకరణతో సూచీలు క్షీణించాయి. దీంతో మూడు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. నిఫ్టీ కీలకమైన 9,850 పాయింట్ల దిగువకు పడిపోయింది. సెన్సెక్స్ 270 పాయింట్ల నష్టంతో 31,525 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 67 పాయింట్ల నష్టంతో 9,837 పాయింట్ల వద్ద ముగిశాయి. రేపు(శనివారం) బోర్డ్ మీటింగ్ జరగనున్న నేపథ్యంలో ఇన్ఫోసిస్ సిఇఒ విశాల్ సిక్కా రాజీనామా చేయడం ఈ షేర్ మీదనే కాకుండా మొత్తం స్టాక్ మార్కెట్‌పైనే తీవ్రమైన ప్రభావాన్ని చూపింది. ఇంట్రాడేలో ఓ దశలో ఇన్ఫీ షేరు 13 శాతం వరకూ క్షీణించింది. ఆఖరికి 10 శాతం నష్టంతో రూ.923 వద్ద ముగిసింది. ఐటీ, ఫార్మా షేర్లు నష్టపోగా, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ షేర్లు, ఎఫ్ఎంసిజి షేర్లు లాభాలను నమోదు చేశాయి.

నేను అధికారం కోరుకోలేదు

- నిరాధార ఆరోపణలకు స్పందించి గౌరవం దిగజార్చుకోలేను
- బోర్డు విమర్శలపై ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు మూర్తి ఆవేదన



న్యూఢిల్లీ: అనూహ్య పరిణామాల మధ్య ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ సిఇఒ విశాల్ సిక్కా రాజీనామా చేశారు. తొలి వ్యవస్థాపక యేతర సిఇఒ అయిన సిక్కా తాను పదవి నుంచి వైదొలగడంతో కంపెనీ సహ వ్యవస్థాపకుడు, మాజీ చైర్మన్ ఎన్ఆర్ నారాయణ మూర్తిపై విమర్శలు వెల్లువెత్తాయి. జర్మనీ ఐటీ దిగ్గజం శాప్ మాజీ ఎగ్జిక్యూటివ్ అయిన సిక్కా(50) మూడేళ్ల కాలంలో ఇన్ఫోసిస్ రెవెన్యూను 25 శాతం పెంచారు. అయితే తన రాజీనామాకు కారణం మూర్తియే కారణమని ప్రత్యక్షంగా పేర్కొనకపోయినప్పటికీ తనపై నిరాధార, అవాస్తవ ఆరోపణలు ఆరోపణలు వచ్చాయని వాపోయారు. తనపై తప్పుడు ప్రచారం ఇటీవల మరింతగా పెరగడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాను అని అన్నారు. ఈమేరకు ఆయన బ్లాగ్‌లో పలు విషయాలను వెల్లడించారు. ఇన్ఫోసిస్ బోర్డు కూడా మూర్తిపై తీవ్ర ఆరోపణలు చేసింది. అయితే ఈ ఆరోపణలు, ప్రకటనలు తననెంతో క్షోభకు గురిచేశాయని మూర్తి వాపోయారు. 'ఇంటువంటి నిరాధారమైన దురారోపణలకు స్పందించి నా గౌరవం దిగజార్చుకోలేను' అని ఆయన అన్నారు. 2014లో తానే స్వయంగా బోర్డు నుంచి తప్పుకున్నానని, కనీసం నగదు కూడా కోరలేదని తెలిపారు. తన పిల్లల కోసం ఇన్ఫీలో కనీసం ఎలాంటి హోదాను, స్థానాలను అడుగలేదని కూడా మూర్తి చెప్పారు. సరైన సమయం, సరైన వేదికలో బోర్డు చేసిన ఆరోపణలపై బదులిస్తానని మూర్తి వెల్లడించారు. ఇటీవల ఇన్ఫోసిస్‌లో అంతర్గతంగా విభేధాలు వెలుగులోకి వచ్చాయి. ప్రమాణాల విషయంలో బోర్డు నిర్ణయాలు వ్యవస్థాపకులకు మింగుడుపడలేదు. కేంద్రమంత్రి జయంత్ సిన్హా భార్య పునితా సిన్హాను గతేడాది బోర్డులోకి తీసుకొచ్చారు. అది నారాయణమూర్తికి నచ్చలేదు. రాజకీయ నాయకుడి భార్యను బోర్డులోకి ఆహ్వానించడం కంపెనీ చరిత్రలో లేదనేది మూర్తి ప్రస్తావించారు. దీంతో ఆమె నియామక ఓటింగ్‌కు ఆయన దూరంగా ఉన్నారు. దీంతో మేనేజ్‌మెంట్, వ్యవస్థాపకులకు మధ్య విభేదాలు ఏర్పడ్డాయి.

సరైన సమయంలో స్పందిస్తా

విశాల్ సిక్కా రాజీనామా నేపథ్యంలో కంపెనీ బోర్డు మూర్తిపై పలు ఆరోపణలు చేసింది. రాజీనామా చేస్తూ విశాల్ సిక్కా చేసిన ఆరోపణలపై కంపెనీ వ్యవస్థాపకులు మూర్తి స్పందించారు. విశాల్ సిక్కా చేసిన నిరాధారణమైన ఆరోపణలపై స్పందిస్తే తన గౌరవానికే భంగకరమని అన్నారు. ఇన్ఫోసిస్ బోర్డు రాసిన ప్రకటనంతటినీ చదివానని, ఆ ఆరోపణలు చాలా బాధ కల్గించాయని ఆవేదన వ్యక్తంచేశారు. వీటికి సరియైన సమయంలో తగిన సమాధానమిస్తానని మూర్తి స్పష్టం చేశారు.

సిఇఒగా కొనసాగలేను : విశాల్ సిక్కా



కంపెనీ సిఇఒగా విధుల్లో తాను కొనసాగలేనని సిక్కా తన బ్లాగ్‌లో పేర్కొన్నారు. నిరాధారమైన ఆరోపణలు, వ్యక్తిగత దూషణలతో తాను పనిచేయలేనని అన్నారు. అయితే ఈ బ్లాగ్‌లో ఎవరి పేరును ఆయన ప్రస్తావించలేదు. అయితే నారాయణమూర్తి లాంటి వ్యవస్థాపకుల నుంచి ఒత్తిడిని ఆయన వివరించారు. గత కొన్ని వారాలుగా రాజీనామాపై తాను తర్జనభర్జనలు పడ్డానని అన్నారు. చాలా కాలం ఆలోచించిన తర్వాతే ఎండి, సిఇఒ బాధ్యతల నుంచి తప్పుకోవాలనే నిర్ణయం తీసుకున్నానని అన్నారు. గత మూడేళ్లుగా కంపెనీ ఎన్నో విజయాలను సాధించి, సరికొత్త ఆవిష్కరణలకు బాటలు వేసిందన్నారు. అయినప్పటికీ నిరాధార, వ్యక్తిగత దాడులు, ఆరోపణలను తట్టుకుని ఇక తాను పనిచేయలేనని స్పష్టం చేశారు. కంపెనీ సాధించిన విజయాల్లో ఉద్యోగులందరి భాగస్వామ్యం ఉందన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకూ ఇన్ఫోసిస్ బోర్డు, యాజమాన్యంతో కలిసి పనిచేస్తానని చెప్పారు. నాయకత్వ మార్పిడి జరిగే వరకూ బోర్డులో ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గా వ్యవహరించేందుకు అంగీకరించినట్టు సిక్కా తెలిపారు. గత కొంతకాలంగా కంపెనీ మేనేజ్‌మెంట్‌పై, సిఇఒగా ఉన్న విశాల్ సిక్కాపై వ్యవస్థాపకులు అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు. కంపెనీలో కార్పొరేట్ ప్రమాణాలు దెబ్బతింటున్నాయంటూ పలుమార్లు కంపెనీ వ్యవస్థాపకులు, బోర్డుకి చురకలు పెట్టారు. చాలా సందర్భాల్లో వ్యవస్థాపకులు, బోర్డు మధ్య వ్యవహారం మీడియాలో వచ్చింది. విశాల్ సిక్కాకు ఎక్కువగా పరిహారాలు చెల్లించడం, కంపెనీ నుంచి వైదొలిగిన కొందరు మాజీ ఎగ్జిక్యూటివ్‌లకు అందించిన సెవరెన్స్ ప్యాకేజీ విషయంలోనూ వ్యవస్థాపకులు బోర్డును ప్రశ్నించారు.

తాత్కాలిక సిఇఒగా యుబి ప్రవీణ్ రావ్



సిక్కా రాజీనామాను ఆమోదించిన కంపెనీ బోర్డ్ ఆమోదించింది. ఆయన స్థానంలో తాత్కాలిక సిఇఒగా యుబి ప్రవీణ్ రావ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. తక్షణం ఈ నిర్ణయం అమల్లోకి వస్తాయని ఇన్ఫోసిస్ యాజమాన్యం స్టాక్ ఎక్స్చేంజీలకు తెలియజేసింది. సిక్కా స్థానంలో పూర్తిస్థాయి సిఇఒగా ఎవరో ఒకరు బాధ్యతలు చేపట్టేవరకు తాత్కాలిక సిఇఒగా ప్రవీణ్ రావ్ బాధ్యతలు చేపట్టనున్నారు. 2 లక్షల ఉద్యోగులు, రూ.2,24,516 కోట్ల నికర విలువ ఉన్న ఇన్ఫోసిస్ కు ప్రవీణ్ రావు తాత్కాలిక సిఇఒ అయ్యారు. రావుకు ఇన్ఫీతో 30 ఏళ్ల అనుబంధం ఉంది. బెంగుళూరు యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేశారు. ఆ తరువాత 1986లో ఇన్ఫోసిస్‌లో నియమితులై అక్కడ నుంచి సంస్థకు సేవలందిస్తూనే ఉన్నారు. తాత్కాలిక సిఇఒ బాధ్యతల కంటే ముందు ప్రవీణ్ రావ్ ఇన్ఫోసిస్ బిపిఒ సర్వీస్‌కు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. గ్లోబల్ సేల్స్, గ్లోబల్ డెలివరీ, బిజినెస్ ఎనేబుల్ లాంటి ముఖ్యమైన విభాగాలకు అధినేతగా కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సభ్యులుగాను, నాస్కామ్‌కు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కు సభ్యులుగాను ఉన్నారు.



జిఎస్‌టితో రూ.20 లక్షల కోట్ల రాబడి : కొత్త శ్రీనివాస్

మన తెలంగాణ/హైదరాబాద్ : జిఎస్‌టితో సంవత్సరానికి రూ.20 లక్షల కోట్ల చొప్పున రాబడి రావచ్చని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తున్నదని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెడ్ అకౌంటెంట్స్ (ఐసిఎఐ) దక్షిణ భారత ప్రాంతీయ కౌన్సిల్ (ఎస్ఐఆర్‌సి) ఛైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. ఐసిఎఐ ఎస్ఐఆర్‌సి ఆధ్వర్యంలో నగరంలో శుక్రవారం జిఎస్‌టిపై ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ అంచనాల నేపథ్యంలో ఛార్టెడ్ అకౌంటెంట్ (సి.ఎ)ల పాత్ర కీలకంగా మారిందని అన్నారు. నూతన చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఇప్పటికే 86 లక్షల మంది జిఎస్‌టిలో తమ పేర్లను నమోదు చేసుకున్నారని, సెప్టెంబర్ మాసంలో ప్రతి ఐదు రోజులకు ఒకసారి రిటర్న్‌లు సమర్పించాల్సి ఉందన్నారు. అలాగే వ్యాపారులు ప్రతి నెల రెండు, మూడుసార్లు రిటర్న్స్ అందచేయాల్సి ఉందన్నారు. ప్రపంచంలో ఇప్పటికే 160 దేశాల్లో జిఎస్‌టి అమలౌతుందని, తాజాగా మన దేశంలో ప్రారంభించారన్నారు. దేశంలో 2,70,000 మంది సి.ఎలు ఉండగా, 8,00,000 మంది సి.ఎ విద్యార్థులు, 1,10,000 మంది వరకు ప్రాక్టీషనర్లున్నారన్నారు. వీరితో పాటు పరిశ్రమల్లో సి.ఎలుగా విధులు నిర్వహిస్తున్న వారు జి.ఎస్.టిపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. జిఎస్‌టిపై వ్యాపారులు, సి.ఎలు అవగాహన పెంచుకునేందుకు, సందేహాలను నివృత్తి చేసుకునేందుకు దేశ వ్యాప్తంగా 140 జిఎస్‌టి సహాయ కేంద్రాలను నెలకొల్పామన్నారు. రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో ఐసిఎఐ కేంద్రాల్లో సహాయ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వ్యక్తిగతంగా కలిసి తమ సందేహాలను తీర్చుకోవచ్చన్నారు. సి.ఎ. పాఠ్య ప్రణాళికను మార్చే సమయంలో విద్యార్థులు గ్లోబల్ సి.ఎలుగా తయారయ్యే అంశాలను అందులో ఉండేలా చూడాలన్నారు. నల్లధనం, అవినీతిలో సి.ఎ ల పాత్ర ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని లేదని కొత్త శ్రీనివాస్ అన్నారు. అయితే సి.ఎల పాత్రపై సమాజంలో నెలకొన్న అపోహలను, అనుమానాలను తొలగించేందుకు కృషి చేయాలని ఆయన సి.ఎలను ఉద్దేశించి అన్నారు.



స్టాక్ మార్కెట్


ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	31524.68	75.65	(0.24%)
నిఫ్టీ	9837.40	43.25	(0.44%)

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27790	29721.93	0.11%
ముంబై	28180	30139.04	1.05%
ఢిల్లీ	27900	29839.57	0.53%
కోల్‌కతా	28220	30181.82	0.67%
కేరళ	27100	28983.96	0.37%
బెంగళూరు	27400	29304.81	0.74%
హైదరాబాద్	27760	29689.84	0.07%
గల్ఫ్	1365.33	1460.25	0.02%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	శుక్రవారం	గురువారం	మార్పు (%)
చెన్నై	42200.00	42400.00	-0.47
ముంబై	42200.00	42400.00	-0.47
ఢిల్లీ	42200.00	42400.00	-0.47
కోల్‌కత్తా	42200.00	42400.00	-0.47
హైదరాబాద్	42200.00	42400.00	-0.47



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	355	విశాఖపట్నం	362
వరంగల్	357	చిత్తూరు	390
విజయవాడ	359	చెన్నై	397
గోదావరి	359	బెంగళూరు	382

త్వరలో కొత్త రూ.50 నోటు



న్యూఢిల్లీ: త్వరలో కొత్త రూ.50 నోటును జారీ చేయనున్నట్టు ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) ప్రకటించింది. హంపి రథం చిత్రం, దేశ సంస్కృతి వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఈ కొత్త నోటు ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న రూ.50 నోట్లు కూడా యథావిధిగా చలామణిలో ఉంటాయని స్పష్టం చేసింది. కొత్త రూ.50 నోటు ఫ్లూరోసెంట్ బ్లూ రంగును కలిగి విభిన్నంగా కనిపిస్తుంది. నోట్ల రద్దు అనంతరం కొత్త రూ.500, రూ.2000 నోట్లను రిజర్వు బ్యాంక్ ప్రవేశపెట్టింది. ఆ తర్వాత కొత్తగా రూ.50, రూ.20 నోట్లను కూడా తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. అయితే, ఈ కొత్త రూ.50 నోటుకు సంబంధించిన చిత్రాలు తాజాగా సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ప్రస్తుతం చలామణీలో ఉన్న నోట్లతో పోలిస్తే వీటి రంగులో పూర్తి వ్యత్యాసం కనిపిస్తోంది. మహాత్మగాంధీ సిరీస్ 2005లో వస్తున్న ఈ నోటు వెనుక భాగంలో ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ సంతకం ఉండనుందని ఇది వరకే రిజర్వు బ్యాంక్ వెల్లడించింది. కొత్త రూ.500, రూ.2000 నోట్లను ప్రవేశపెట్టిన ఆర్‌బీఐ.. రూ.1000 నోటును కూడా తీసుకొస్తుందన్న ఊహాగానాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అలాంటి ప్రతిపాదనేదీ లేదని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి శక్తికాంత దాస్ ఇది వరకే తెలిపారు. అయితే కొత్త రూ.200 నోటును మాత్రం తీసుకొస్తున్నామని అధికారుల నుంచి ప్రకటన వచ్చిన విషయం తెలిసిందే.

కాల్‌డ్రాప్స్‌కు రూ.10 లక్షల జరిమానా!



న్యూఢిల్లీ: వినియోగదారులకు ఊరట కల్గించేలా కాల్ డ్రాప్స్‌పై కఠిన చర్యలు చేపట్టనున్నట్టు టెలికామ్ నియంత్రణ సంస్థ ట్రాయ్ ప్రకటించింది. కాల్ డ్రాప్స్‌తో కస్టమర్లకు తీవ్ర అసౌకర్యం కల్గించే టెలికామ్ ఆపరేటర్లపై రూ.10 లక్షల వరకు జరిమానా విధించాలని నిర్ణయించినట్టు సమాచారం. ప్రమాణాలను పాటించడంలో విఫలమయ్యే మొబైల్ ఆపరేటర్లకు భారీ జరిమానాను విధిస్తున్నట్టు ట్రాయ్ పేర్కొంది. కాల్ డ్రాప్స్‌ను నివారించడంలో విఫలమైతే తొలుత రూ.5 లక్షల వరకూ జరిమానా విధిస్తామని, ఇదే పద్ధతి కొనసాగితే జరిమానాను రూ.10 లక్షలకు పెంచుతామని ట్రాయ్ కార్యదర్శి ఎస్‌కె గుప్తా తెలిపారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం కాల్ డ్రాప్‌పై రూ 50,000 జరిమానా విధిస్తున్నారు. ఆయా నెట్‌వర్క్‌ల సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని జరిమానాలను నిర్ధేశిస్తామని ట్రాయ్ వర్గాలు వెల్లడించాయి.

బ్యాగేజీ చార్జీలను పెంచనున్న స్పైస్‌జెట్

న్యూఢిల్లీ: దేశీయ విమానాల్లో అదనపు బ్యాగేజీ ప్రీ–బుకింగ్ చార్జీలను పెంచనున్నట్టు స్పైస్‌జెట్ ప్రకటించింది. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. అదే సమయంలో 15 కిలోలు లోపు చెక్ ఇన్ బ్యాగేజీపై ఎలాంటి అదనపు చార్జీలు ఉండవని, 20 కిలోల లోపు బ్యాగేజీపై చార్జీని రూ.500 నుంచి రూ.1,425 కి పెంచనుంది. ఇదే విధంగా 20–30 కిలోల మధ్య ఇంతకు ముందు రూ.2 వేలు ఉండగా ఇప్పుడు రూ. 2,850కి పెంచనుంది. ప్రైవేటు విమానయాన సంస్థల చెకిన్ బ్యాగేజీ చార్జీలను నియంత్రిస్తూ డిజిసిఎ(డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) గత ఏడాది స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ఒక్కో విమాన ప్రయాణికుడు 15 కిలోల బ్యాగేజీని ఉచితంగా తీసుకెళ్లవచ్చు. ఆపై ఒక్కో కిలోపై రూ.100 మాత్రమే అదనంగా తీసుకోవాలని పేర్కొంది. తమకు నష్టం కలిగించే ఈ నిర్ణయాన్ని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్(ఎఫ్ఐఎ) తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రైవేటు ఎయిర్‌లైన్స్ విధించే చార్జీలను నియంత్రించే అధికారం డిజిసిఎకు లేదని ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేసింది. సమగ్ర విచారణ అనంతరం డిజిసిఎ ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు హైకోర్టు తీర్పు చెప్పింది. దీంతో ప్రైవేట్ సంస్థలు బ్యాగేజీలపై చార్జీలు పెంచేందుకు ఆటంకాలు తొలిగిపోయినట్లయింది. అందరికంటే ముందు స్పైస్‌జెట్ అదనపు చార్జీలను ప్రకటించే వీలుంది.

టిజిఎస్‌టికి సవరణలు

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ రూల్స్, 2017కు పలు సవరణలు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సరుకులు, సేవల ఎగుమతుల సమయంలో ముందస్తు చెల్లింపు లేకుండా ఫాం జిఎస్‌టి ఆర్ఎఫ్‌డి 11 ద్వారా లేఖ లేదా బాండ్ స్వీకరించేందుకు అనుమతించింది. అయితే ఇందుకు పలు షరతులు వర్తింపజేసింది. ఎగుమతుల కోసం ఇన్‌వాయిస్ జారీ చేసిన మూడు నెలల తర్వాత 15 రోజుల్లోపు సరుకులను దేశం అవతలికి ఎగుమతి చేయకపోయినా లేదా కమిషనర్ ఆమోదించిన సమయం గడిచిన 15 రోజుల్లోపు ఎగుమతిదారుకు సేవలకుగాను చెల్లింపు జరగని పక్షంలో లాంటి తదితర పరిస్థితుల్లో వర్తించేలా నూతన నియమాన్ని చేర్చారు. అదే విధంగా తనిఖీ, సీజ్ , సీజ్ చేసిన వస్తువులను తిరిగి ఇచ్చే సమయంలో పాటించాల్సిన నియమాలకు సవరణలను చేస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి సోమేశ్ కుమార్ నోటిఫికేషన్ జారీ చేశారు.

15 శాతం ఫైన్


- నిబంధనలు ఉల్లంఘించిన పారిశ్రామికవేత్తలపై చర్యలు
- పరిశ్రమలకు కేటాయించిన భూముల వినియోగానికి ప్రణాళిక

మన తెలంగాణ/హైదరాబాద్ : పరిశ్రమలకు కేటాయించిన భూములను నిర్ణీత కాలపరిమితి లోగా వినియోగంలోకి తీసుకురావడానికి టిఎస్ ఐఐసి ప్రణాళికను రూపొందించింది. ఈ విషయంలో నిబంధనలను ఉల్లంఘించిన పారిశ్రామికవేత్తలపై కఠిన వైఖరి అవలంభిస్తూ గరిష్ఠంగా 15 శాతం వరకు అపరాధ రుసుం విధించాలని ప్రతిపాదించింది. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ(టిఎస్ఐఐసి) 13వ పాలకవర్గ సమావేశం శుక్రవారం బషీర్‌బాగ్ లోని పరిశ్రమ భవన్‌లో చైర్మన్ గ్యాదరి బాలమల్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, టిఎస్ఐఐసి ఆదాయం పెంపొందించుకునే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కొందరు పారిశ్రామిక వేత్తలు ఫ్లాట్లను సేల్ డీడ్ చేసుకున్నాక, మరికొందరు సేల్‌డీడ్ చేసుకోకుండానే తమ ఫ్లాట్లను మొత్తం లేదా విభజించి అమ్మకాలు చేపట్టడాన్ని నిలువరించాలని నిర్ణయించారు. నిర్ణీత గడువు లోగా పరిశ్రమలను స్థాపించకుండా గడువు పొడిగింపుకు, ఫ్లాట్ల సబ్ డివిజన్ కోసం దాఖలైన దరఖాస్తులపై మూడు రకాలుగా 5 శాతం నుండి గరిష్ఠంగా 15 శాతం ఫెనాల్టీ విధించాలని ప్రతిపాదించారు. జిహెచ్ఎంసి పరిధిలో విలీనమైన గ్రామ పంచాయతీల పరిధిలోని 24 ఐలాలకు ఆర్టికల్ 243క్యూ ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ అధికారాలను, విధులను బదిలీ చేయడానికి ఆమోదం తెలిపారు. దీంతో జిహెచ్ఎంసి పరిధిలోని ఐలాల పరిధిలో వసూలైన ఆదాయ పన్నులో ఇప్పటివరకు 35 శాతం నుండి 50 శాతం వాటా మున్సిపల్ కార్పొరేషన్‌కు వెళుతుండగా, ఇక నుంచీ 35 శాతం వాటా మాత్రమే పన్ను ఆదాయం మున్సిపల్ కార్పోరేషన్‌కు వెళ్లనుంది. ఈమేరకు జిహెచ్ఎంసి పరిధిలోని 24 ఐలాలకు పారిశ్రామిక పట్టణ ప్రాంతాలుగా టిఎస్ ఐఐసి ప్రత్యేక ప్రాంతీయ పారిశ్రామిక పురపాలక సంస్థ(ఐలా)గా ప్రత్యేక అధికారాలను ప్రభుత్వం కల్పించడాన్ని పాలకవర్గం నోటిఫై చేసింది. సంగారెడ్డి జిల్లా సుల్తాన్ పూర్ లో వైద్య పరికరాల ఉత్పత్తి కొరకు ప్రత్యేక పారిశ్రామికవాడను ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలుపడంతో 546 ఎకరాల్లో క్లినికల్, ప్రీ క్లినికల్, పరిశోధన రంగాల్లో అభివృద్ధి పనులకు టీఎస్ ఐఐసీ బోర్డు ఆమోదం తెలిపింది. ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు భూముల కేటాయింపు, దీర్ఘకాలీక లీజు ఇతర రాయితీల అమలుకు ఆమోదం తెలిపారు. ఇండస్ట్రియల్ పార్కులు, సెజ్‌ల పరిధిలో ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ పెట్రోల్ అండ్ గ్యాస్ ఔట్‌లెట్స్ ఏర్పాటు చేయాలని పాలకవర్గం నిర్ణయించింది.

ఆన్‌లైన్లో ఆస్తి పన్నుచెల్లింపులు ప్రారంభం

ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ(ఐఎఎల్ఏ) పరిధిలో ఆస్త పన్నును ఆన్‌లైన్‌లో చెల్లింపు కోసం టిఎస్ఐఐసి ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. ఆన్‌లైన్ చెల్లింపు ప్రక్రియను శుక్రవారం చైర్మన్ గ్యాదరి బాలమల్లు లాంఛనంగా ప్రారంభించారు.

22న అపెక్స్ పబ్లిక్ ఇష్యూ



మన తెలంగాణ/హైదరాబాద్ : నూతన ష్రింప్ ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పేందుకు అక్వాకల్చర్ ఉత్పత్తుల ఎగుమతులు చేసే అపెక్స్ ప్రాజెస్ ఫుడ్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు రానుంది. నగరంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో అపెక్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.సుబ్రహ్మణ్య చౌదరి, సిఎండి కె.సత్యనారాయణమూర్తి, కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్ లిమిటెడ్‌కు చెందిన టి.ఆర్.ప్రశాంత్ కుమార్‌లు పాల్గొన్నారు. ఐపిఓను పబ్లిక్ సబ్‌స్క్రిప్షన్ కోసం ఆగస్టు 22న తెరవనున్నట్లు వారు తెలిపారు. రూ.10 ముఖ విలువ కలిగిన 87,00,000 ఈక్విటీ షేర్లతో ఐపిఓను బుక్ బిల్డింగ్ మార్గంద్వారా ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.171 నుండి రూ.175 ప్రైస్ బ్యాండ్‌తో రూ.148.77 కోట్ల నుంచి రూ.152.55 కోట్లు సేకరించే లక్ష్యంతో పబ్లిక్ ఇష్యూకు వస్తున్నారు. పబ్లిక్ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 24వ తేదీతో ముగుస్తుంది. ఆంధ్రప్రదేశ్ లోని తూర్పు గోదావరి జిల్లాలో 20 వేల ఎంటిపిఎ సామర్థ్యంతో ప్రతిపాదించిన నూతన ష్రింప్ ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పేందుకు ఇష్యూకు వస్తున్నామన్నారు.

మహిళా నేతతో కాంగ్రెస్ నాయకుడి అసభ్య ప్రవర్తన



బెంగళూరు : కర్నాటకకు చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు బహిరంగ సభలోనే తోటి మహిళా నాయకురాలి చేయి పట్టుకున్న దృశ్యం సామాజిక మాధ్యమాల్లో ఇప్పుడు వైరల్ అవుతోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కర్నాటకలోని మదికేరిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రాష్ట్ర సిల్క్ బోర్డ్ చైర్మన్ టివి రమేష్ వేదికపై తన పక్కన కూర్చున్న ఎంఎల్‌సి వీణా అచ్చయ్య చేయిని పట్టుకున్నారు. వెంటనే ఆమె అతని చేతిని తోసేసింది. అయినా అంతటితో అగకుండా ఆ నేత నవ్వుతూ మరోసారి చేతిని పట్టుకోవడానికి ప్రయ్నతించారు. ఈ సంఘటనపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై రమేష్ వివరణ ఇచ్చారు. 'వీణా నేను ఒకే ప్రాంతానికి చెందిన వాళ్లం. అంతేకాక ఆమె నాకు సోదరితో సమానం. మేమిద్దరం ఆరోగ్య సంబంధమైన విషయాల గురించి మాత్రమే చర్చించుకున్నాం. అంతేకాని నేను ఆమెను వేరే దృష్టితో చేయి పట్టుకోలేదు. నా ప్రతిష్టను దెబ్బతియడానికి ఈ వీడియోను షేర్ చేశారు.' అని వ్యాఖ్యానించారు. వీణ కూడా దీనిపై స్పందించారు. కార్యక్రమంలో వివాదం సృష్టించడం ఇష్టం లేక ఫిర్యాదు చేయలేకపోయానని, అతని ప్రవర్తనతో కంగుతిన్నానని చెప్పుకొచ్చింది. దీనిపై ఇంటికి వెళ్లగానే తన భర్తకు చెప్పానని వీణ వివరించింది.



బిజెపి నేత గోశాలలో ఘోరం

ఆకలితో అలమటించి 200 ఆవులు మృతి

దుర్గ్: ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాలో ఓ బిజెపి నేత నిర్వహిస్తున్న గోశాలలో గత మూడు రోజులలో 200 పైగా ఆవులు మృతి చెందాయి. పశుగ్రాసం, మందుల కొరతతో ఆవులు మృతి చెందినట్లు శుక్రవారం రాజ్‌పూర్ గ్రామస్థులు తెలిపారు. పశుగ్రాసం కొరతతో 27 ఆవులు మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. అయితే 200 ఆవులు మృతి చెందాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గోశాల చుట్టు పక్కల ప్రదేశాలలో మృతి చెందిన ఆవులను పూడ్చి పెట్టిన ఆనవాళ్లు మనకు కనిపిస్తాయని పేర్కొన్నారు. బిజెపి నేత, జాముల్ నగర్ నిగమ్ ఉపాధ్యక్షుడు హరీశ్ వర్మ గత ఏడేళ్లుగా గోశాలను నిర్వహిస్తున్నారు. చనిపోయిన గోవులను పూడ్చిపెట్టేందుకు గోశాల సమీపంలో జెసిబిలు తవ్వకాలు జరిపినట్లు రాజ్‌పూర్ సర్పంచ్ భర్త సేవా రామ్ సాహు విలేకరులకు తెలిపారు. గోవులు ఆకలితో మృతి చెందినట్లు పశువుల డాక్టర్లు తెలిపారు. అయితే గోడ కూలి ఆవులు మృతి చెందాయని హరీశ్ వర్మ పేర్కొన్నారు. గత రెండు రోజులుగా 27 ఆవులకు పంచనామా నిర్వహించినట్లు జిల్లా వెటర్నరీ డ్రగ్స్ డైరెక్టర్ ఎంకె చావ్లా తెలిపారు.

డోక్లామ్‌పై భారత్‌కే మద్దతు : జపాన్

న్యూఢిల్లీ: డోక్లామ్ ప్రతిష్టంభనపై జపాన్ స్పందించింది. భారత్‌కు ఈ విషయంలో మద్దతు ప్రకటించింది. భారత్, చైనా సరిహద్దులలో పరిస్థితిని జాగ్రత్తగా గమనిస్తున్నట్లు జపాన్ వర్గాలు తెలిపాయి. ఇండియా, భూటాన్‌లకు డోక్లామ్ ప్రతిష్టంభనపై తమ నుంచి దౌత్యపరంగా సహకారం ఉంటుందని జపాన్ అధికార వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే నెల 13–15 వరకూ జపాన్ పరధాని షింజో అబే భారతదేశంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో భారత్‌కు జపాన్ నుంచి తగు సంఘీభావం వ్యక్తం అయింది. గత కొద్దివారాలుగా భారత్‌లోని జపాన్ రాయబారి కేంజీ హిరమత్సు తమ దౌత్యవేత్తల బృందంతో తరచూ భారత అధికార వర్గాలతో మాట్లాడుతున్నారు. తమ దేశ ప్రధాని పర్యటన వివరాలను ఖరారు చేసుకోవడంతో పాటు డోక్లామ్‌పై వైఖరిని కూడా తెలియజేశారు.

80 ఇండిగో విమాన సర్వీసులు రద్దు

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగో 80కి పైగా విమాన సర్వీసులను రద్దు చేసింది. ఎయిర్‌బస్ ఎ 320 నియో (కొత్త ఇంజిన్లతో కూడిన) ఇంజిన్లకు సంబంధించిన సమస్యల కారణంగా ఈ సర్వీసులు నిలిపి వేసినట్టు సంస్థ ప్రకటించింది. ప్రాట్, విట్నీ సంస్థ నుంచి తమకు వస్తున్న ఇంజిన్లలో లోపాలు తలెత్తడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. అయితే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వారి ఎంపికల మేరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించింది. ఇటీవల కొంతకాలంగా ఎ320 విమానాలు ఇంజిన్లలో సాంకేతిక లోపాలు, ఇతర సమస్యల కారణంగా సర్వీసులు నిలిచిపోతున్నాయి.

పిల్లల సంరక్షణ భృతి రెట్టింపు

న్యూఢిల్లీ: అంగవైకల్యం కలిగిన మహిళా ఉద్యోగులకు వారి పిల్లల సంరక్షణ భృతిని కేంద్ర ప్రభుత్వం రెట్టింపు చేసింది. ప్రస్తుతం ఇలాంటి మహిళా ఉద్యోగులకు పుట్టే పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం నెలకు రూ.1500 అందుతున్నాయి. ఇక నుంచి వారికి నెలకు రూ.3వేలు అందుతాయి. పిల్లలు పుట్టిన నాటి నుంచి వారికి రెండేళ్ల వయస్సు వచ్చే వరకు ఈ ప్రత్యేక భృతిని వారికి అందించనున్నట్టు వ్యక్తిగత, శిక్షణ శాఖ పేర్కొంది. అలాగే ఈ భృతి ఒక మహిళకు ఇద్దరు చిన్నారుల వరకు మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. దీంతో పాటు చిన్నారుల విద్య కోసం ఇచ్చే రీయింబర్స్‌మెంట్‌ను నెలకు రూ.2250గా నిర్ణయిస్తూ ఈ శాఖ ఆదేశాలు జారీ చేసింది. హాస్టల్ సబ్సిడీ రీయింబర్స్‌మెంట్ రూ.6750గా ఉంటుందని కూడా ఉత్తర్వులు వెలువరించింది. ఏడవ వేతన సవరణ సంఘం చేసిన సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం ఈ ప్రత్యేక భృతిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

సేవలపై మంత్రికి సిపిఎం ఫిర్యాదు

న్యూఢిల్లీ : సిపిఐ(ఎం) ప్రధాన కార్యాలయంలో ఎంటిఎన్‌ఎల్ ఇంటర్నెట్ సేవలు వారం రోజులుగా నిలిచి పోయాయని, ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిందా అనే కోణంలో విచారణ జరిపించాలని కేంద్ర మంత్రి మనోజ్ సిన్హాను ఆ పార్టీ కోరింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కేంద్ర మంత్రికి ఓ లేఖ రాశారు. ఆగస్టు 11 నుంచి ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో పార్టీ ప్రధాన కార్యాలయం లో కార్యకలాపాలపై ప్రభావం పడిందని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఎంటిఎన్‌ఎల్‌కు అనేక మార్లు ఈ విషయంలో ఫిర్యాదులు చేసినా అక్కడి నుంచి సరైన స్పందన లభించలేదని, వెంటనే ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించేలా అధికారులను ఆదేశిస్తారన్న ఉద్దేశంతో ఈ లేఖ రాస్తున్నానని పేర్కొన్నారు. ఈ ఘటనపై విచారణ జరపాలని కూడా ఆయన కోరారు.

నేడు నితీశ్, శరద్ పోటాపోటీ భేటీలు

పాట్నా : జనతాదళ్(యునైటెడ్)లో చీలిక మరింత స్పష్టమైంది. సిఎం నితీశ్ కుమార్, సీనియర్ నేత శరద యాదవ్ నేతృత్వంలోని వైరివర్గాలు శనివారంనాడు ఇక్కడ పోటాపోటీ భేటీలు నిర్వహించతలపెట్టాయి. నితీశ్ తన నివాసంలో జెడి(యు) జాతీయ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఎన్‌డిఎలో జెడియు చేరికకు సంబంధించి లాంఛనప్రాయంగా ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోబోతున్నారు. మరోవైపు శరద్ యాదవ్ తన మద్దతుదారులతో కలిసి ఇక్కడి ఎస్‌కె మెమోరియల్ హాల్‌లో సమావేశం నిర్వహిస్తున్నారు. 'జన్ అదాలత్' పేరిట ఈ భేటీ నిర్వహిస్తున్నట్టు ఆయన అనుకూలురు ప్రకటించారు. జెడి(యు) సీనియర్ నేత ఎస్‌కె త్యాగి మాట్లాడుతూ పార్టీలో చీలిక అనేది లేదని, శరద్ యాదవ్ తనకుతానుగా పార్టీని వదిలి వెళ్లిపోయారని అన్నారు.

23న సిబిఐ ఎదుట హాజరుకావాలి

కార్తీ చిదంబరానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: అవినీతి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం తనయుడు కార్తీ చిదంబరం విచారణ నిమిత్తం ఈ నెల 23న సిబిఐ ఎదుట హాజరుకావాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్, డివై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఇక్కడ సిబిఐ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరయ్యేటపుడు తన వెంట న్యాయవాదిని తీసుకొచ్చేందుకు కూడా ఆయనకు వెసులుబాటు కల్పించింది. కానీ, కార్తీని విచారించే గదిలోనే ఆయన తరపు న్యాయవాది ఉండరాదని, పక్క గదిలో ఉండాలని షరతు విధించింది. ఈ కేసు తదుపరి విచారణను ఈనెల 28న చేపట్టనున్న నేపథ్యంలో ఆ లోగా ఎన్ని రోజులు కావాలంటే రోజుల పాటు కార్తీ చిదంబరాన్ని విచారించుకునే స్వేచ్ఛను దర్యాప్తు సంస్థకు కల్పించింది.

వియత్నాంకు భారత్ బ్రహ్మోస్త్రం

- చైనా విరోధికి బ్రహ్మోస్ క్షిపణులు!
- విద్యుత్, టెలికాం కంపెనీలకూ చెక్ పెట్టే నిర్ణయాలు

న్యూఢిల్లీ: చైనాకు వ్యతిరేకంగా భారత్ మరో ఎత్తుగడ వేసింది. డోక్లామ్ విషయంలో ఇప్పటికే మాటల యుద్ధానికి దిగుతున్న ఇరుదేశాల నడుమ తాజా నిర్ణయం మరింత దూరం పెంచేలా కనిపిస్తోంది. చైనాకు బద్ధ విరోధి అయిన వియత్నాంకు భారత్ అత్యాధునిక బ్రహ్మోస్ క్షిపణులు విక్రయించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ క్షిపణుల సాయంతో 300 కిలోమీటర్ల దూరంలో సముద్రంలో ఉన్న శత్రు నౌకలను ధ్వంసం చేయవచ్చు. క్షిపణి కొనుగోలు అంశంపై మీడియా సమావేశంలో అడిగిన ప్రశ్నకు వియత్నాం విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లి తు హ్యాంగ్ సమాధానమిచ్చారు. 'రక్షణ పరికరాలు కొనుగోలుకు సంబంధించి స్వీయ రక్షణ, శాంతి విధానానికి వియత్నాం కచ్చితంగా కట్టుబడి ఉంది. దేశ రక్షణ కోసం ఇది ఎప్పుడూ జరిగేదే. ఈ ప్రాంత శాంతి, స్థిరత్వం, సహకారం, అభివృద్ధి తోడ్పాటుకు రక్షణరంగంలో సహకారం వియత్నాం–భారత సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో భాగం' అని హ్యాంగ్ తెలిపారు. అయితే బ్రహ్మోస్ క్షిపణులను వియాత్నాంకు విక్రయించనున్నామన్న వార్తలను భారత విదేశాంగ శాఖ ఖండించింది.

చైనా కంపెనీలకు చెక్

కీలక రంగాల్లో చైనా కంపెనీల ప్రవేశానికి చెక్ పెట్టేందుకు విద్యుత్, టెలికం నిబంధనలను భారత్ కఠినతరం చేయనుంది. వైరస్‌లను వ్యాప్తి చేసే మాల్‌వేర్‌కు అడ్డుకట్ట వేసేందుకూ ప్రభుత్వం ఈ దిశగా యోచిస్తోంది. దేశీయ మార్కెట్‌లో చైనా స్మార్ట్ ఫోన్లు వెల్లువెత్తిన క్రమంలో స్మార్ట్ ఫోన్ తయారీదారులను భద్రతా ప్రమాణాలు, ఆర్కిటెక్చర్ ఫ్రేమ్ వర్క్‌లపైనా ప్రభుత్వం పూర్తి వివరాలు అందించాలని ప్రభుత్వం కోరింది.కీలక రంగాల్లో చైనా ఉత్పత్తుల దూకుడుకు కళ్లెం వేయాలని పరిశ్రమ వర్గాలూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. విద్యుత్ పంపిణీ నిర్వహణ, పరికరాల సరఫరాలో పలు చైనా కంపెనీలు సేవలందింస్తుండగా, భారత కంపెనీలను చైనాలో ఈ తరహా వ్యాపారానికి అనుమతించడం లేదని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.దీంతో స్థానిక కంపెనీలకు ప్రాదాన్యత ఇచ్చేలా విద్యుత్ సరఫరా, పంపిణీ కాంట్రాక్టుల బిడ్డింగ్‌కు నూతన నిబంధనలను సూచిస్తూ సెంట్రల్ విద్యుత్ అథారిటీ నివేదికను ప్రభుత్వం పరిశీలిస్తోంది.



విశాల వేదిక అవసరం

సిపిఐలో లాల్ నిషాన్ పార్టీ విలీన సభలో సురవరం

ముంబయి: దేశంలో పెచ్చుమీరుతున్న మతోన్మాదం, మితవాద, సామ్రాజ్యవాద ధోరణులకు వ్యతిరేకంగా విశాల ఐక్య వేదిక అవసరమని, ఇందుకు ముఖ్యంగా వామపక్షాల ఐక్యత అవసరమని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. వామపక్ష పార్టీల ఐక్యత విషయంలో సిపిఐ అందరికంటే ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. మహారాష్ట్రలో లాల్ నిషాన్ పార్టీ (ఎల్‌ఎన్‌పి) శుక్రవారం సిపిఐలో విలీనమైంది. ముంబైలోని వర్లీలో కరుడే హాల్‌లో జరిగిన విలీన సభకు సురవరం సుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్‌ఎన్‌పి వ్యస్థాపక సభ్యులు యశ్వంత్ చౌహాన్ (97), అధ్యక్షులు ఎన్.హెచ్.పాటిల్ ప్రెసిడెంట్, కార్యదర్శి మిలింగ్ రణదేవ్‌లకు కమ్యూనిస్టు పార్టీ జెండాను, సభ్యత్వం కార్డులను అందజేసి సిపిఐలోకి ఆహ్వానించారు. సిపిఐ నుండి విడిపోయిన నాయకులు 1965లో లాల్ నిషాన్ పార్టీని ఏర్పాటు చేశారు. ఐదు దశాబ్దాల చరిత కలిగిన ఈ పార్టీకి మహారాష్ట్రలోని కార్మికోద్యమంలో మంచి పేరుంది. ముంబై మున్సిపల్ కార్మికుల్లో పట్టు కలిగి ఉంది. ఎల్‌ఎన్‌పి విలీన సభలో సురవరం మాట్లాడుతూ దేశంలో అంతర్గత పరిస్థితులు దేశాన్ని మితవాదం, సామ్రాజ్యవాదంవైపు నెట్టివేసే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. కాషాయీకరణకు సకలరం గాల్లో ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. వీటన్నిటికీ దేశవ్యాప్తంగా ఒక విశాల లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష వేదిక ఏర్పడాల్సిన అవసరం ఉన్నదన్నారు.ఈ విశాల ఐక్య వేదికకు ముఖ్యంగా వామపక్షాల ఐక్యత అవసరమన్నారు.సిపిఐలో ఎల్‌ఎన్‌పి విలీనం కావడం ద్వారా కమ్యూనిస్టుల ఐక్యత నినాదానికి, పిలుపునకు ఊపు వచ్చిందని చెప్పారు. మరిన్ని వామపక్ష శక్తులను సన్నిహితం చేసేందుకు అందరం కలిసి కృషి చేస్తామన్నారు. సభలో సిపిఐ రాజ్యసభ సభ్యులు డి.రాజా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులు కమ్యూనిస్టులు, వామపక్షాలు మరింత సన్నిహితంగా పని చేయాల్సిన ఆవశ్యకత ఉన్నదని, లాల్ నిషాన్ పార్టీ విలీనం సానుకూల పరిణామమన్నారు. విలీన బహిరంగ సభలో సిపిఐ మహారాష్ట్ర కార్యదర్శి బాలచంద్ర కాంగో ప్రసంగించారు.



కూలిన కాళ్ల కింది నేల

న్యూఢిల్లీ: బీహార్‌ను వరదలు ముంచెత్తుతున్నాయి. అరారియా జిల్లాలో వరద ఉధృతికి ఓ బ్రిడ్జి కూలిపోయి ముగ్గురు గల్లంతయ్యారు. ఇందులో ఓ చిన్నారి, మహిళ ఉన్నారు. ప్రజలు ఈ బ్రిడ్జిని దాటుతున్నప్పుడు స్థానికుడొకరు తీసిన వీడియోలో ఈ ఘటన కనిపించింది. దీంతో రాష్ట్రంలో వరద కారణంగా సంభవించిన మరణాల సంఖ్య 98కి చేరింది. 'అరారియాలో నా సోదరి, కుమారుడు రెహ్మాన్, మేనల్లుడు సుశీల్‌లు బ్రిడ్జిని దాటుతున్నారు, వారు దాదాపుగా ఆవలి వైపు చివరికి వెళ్లిపోతుండగా అకస్మాత్తుగా బ్రిడ్జి కూలిపోయింది, నీటి ఉధృతిలో వారు కొట్టుకుపోయారు' అని బాధిత కుటుంబానికి చెందిన ఒకరు ఆవేదన వ్యక్తం చేసినట్టు ఇండియా టుడే పేర్కొంది. మరోవైపు రాష్ట్రంలో వరద ఉధృతి క్రమేణా పెరుగుతోంది. రోజురోజుకూ మృతుల సంఖ్య కూడా పెరుగుతోంది. 16 జిల్లాల్లో 98 లక్షల మంది నిరాశ్రయులైనట్టు తెలుస్తోంది.

త్రిపుర సిఎంపై ఫేస్‌బుక్‌లో ఫత్వా



అగర్తల: త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్‌ని చంపిన వారికి ఐదు లక్షల నజరానా ఇస్తానంటూ గుర్తు తెలియని వ్యక్తి ఫేస్‌బుక్‌లో ఒక పోస్ట్ చేశాడని పోలీసులు తెలిపారు. 'వరల్డ్ యాంటీకమ్యూనిస్ట్ కౌన్సిల్' తరపున రియా రాయ్ పేరుతో ఫేస్‌బుక్‌లో గురువారం ఈ హెచ్చరిక పోస్ట్ అయిందని వారు చెప్పారు. నకిలీ పేరుతో ఈ హెచ్చరిక పోస్ట్ అయినట్లు వారు అనుమానం వ్యక్తం చేశారు. ఏదేమైనప్పటికీ, దీనిని సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేసుకుని, విచారణ చేపట్టామని వారు తెలిపారు.

స్టార్ హోటల్‌లో కీచక పర్వం

మహిళా సెక్యూరిటీకి మేనేజర్ లైంగిక వేధింపులు

న్యూఢిల్లీ: మహిళలపై ఆకృత్యాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. తాజాగా స్థానిక ఐదు నక్షత్రాల హోటల్ 'ఢిల్లీ ఏరోసిటీ'లో సెక్యూరిటీ మేనేజర్ తనను లైంగికంగా వేధింపులకు గురిచేశాడంటూ అక్కడే సెక్యూరిటీ గార్డుగా పనిచేసే 33 ఏళ్ల బాధిత మహిళ ఆరోపించింది. గతనెల తన పుట్టినరోజు సందర్భంగా అతను తనను వేధించడమే కాకుండా వివస్త్రను చేయడానికి ప్రయత్నించాడంటూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటన హోటల్‌లోని సిసిటివి గది లోపల చోటుచేసుకోవడంతో ఈ దశ్యం మొత్తం సిసిటివి కెమేరాలో రికార్డయింది.



తనపై జరిగిన దారుణం గురించి హోటల్ హెచ్‌ఆర్ సిబ్బందికి ఫిర్యాదు చేశానని ఆమె చెప్పింది. అయితే తనపై ఈ దుశ్చర్యకు పాల్పడిన సెక్యూరిటీ మేనేజర్‌పై చర్యలు తీసుకోవడానికి బదులుగా తననే ఉద్యోగం నుండి తొలగించారని ఆమె వాపోయింది. ఈ ఘటన జరిగిన మూడు రోజులకు ఆమె తన భర్త సాయంతో పోలీసులను ఆశ్రయించి మేనేజర్‌పై ఫిర్యాదు చేసింది. కానీ, పోలీ సులు ఇప్పటివరకు నిందితుడ్ని అరెస్టు చేయకపోవడం పలు విమర్శలకు, అనుమానాలకు తావిస్తోంది. నింది తుడిపై వేధింపుల కేసు నమోదు చేశామని, అతనిపై చట్ట పరంగా చర్య తీసుకుంటామని, అతన్ని త్వరలోనే అరెస్టు చేస్తామని ఒక పోలీసు అధికారి తెలిపారు. శారీరక సం బంధం కోసం అతను చాలాకాలంగా తనను వేధిస్తున్నా డని, అయితే తాను ఒప్పుకోలేదని బాధితురాలు తన ఫిర్యాదులో ఆరోపించినట్లు పోలీసులు చెప్పారు. పుట్టిన రోజు సందర్భంగా తనకు సెక్యూరిటీ మేనేజర్ బహుమతి ఇస్తానని చెప్పాడని, అయితే అందుకు తాను తిరస్కరించినందుకు మరో పురుష ఉద్యోగి కళ్లెదుటే అతను తన చీర పట్టుకుని లాగాడని బాధితురాలు ఆరోపించింది. అతని చెర నుండి తప్పించుకునేందుకు ఆమె ప్రయత్నిస్తున్న దృశ్యం సిసిటివి కెమేరాలోనూ రికార్డయింది.

రోహింగ్యాలపై కేంద్రానికి నోటీసులు

న్యూఢిల్లీ: మయన్మార్ నుంచి అక్రమంగా వలస వచ్చిన రోహింగ్యాలను దేశం విడిచి వెళ్లిపోవాలన్న కేంద్రం ఆదేశాలపై జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సి) స్పందించింది. శతాబ్దాలుగా భారతదేశం శరణార్థులకు ఆవాసంగా ఉంటూ వస్తోందని, మానవతా కోణంలో రోహింగ్యాలను అర్థం చేసుకోవాలని సూచించింది. దీనిపై నాలుగు వారాల్లో ఒక నివేదిక అందజేయాలని హోం శాఖకు నోటీసులు జారీ చేసింది. భారత్‌లో అక్రమంగా 40వేల మంది రోహింగ్యాలు అక్రమంగా నివసిస్తున్నారని, వారందరిని తిరిగి స్వదేశానికి పంపించేందుకు చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకే కేంద్రం ఆదేశించిందన్న మీడియా కథనాలను సుమోటాగా తీసుకున్న ఎన్‌హెచ్‌ఆర్‌సి ఈ మేరకు స్పందించింది.

'లవ్ జీహాద్'పై దర్యాప్తు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేరళ 'లవ్ జీహాద్' కేసుపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) శుక్రవారంనాడు దర్యాప్తు ప్రారంభించింది. ఈ మేరకు శుక్రవారంనాడు కేసు నమోదు చేసిన ఎన్‌ఐఏ దర్యాప్తును చేపట్టింది. ఒక హిందూ మహిళను ఇస్లాం మతంలోకి మార్చి ఆ తర్వాత ముస్లిం యువకుడు వివాహం చేసుకున్న ఈ కేసును 'లవ్ జీహాద్'గా పిలుస్తున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో అఖిల అశోకన్‌ను షఫిన్ వివాహం చేసుకున్నాడు. ఈ వివాహం చెల్లదని కేరళ హైకోర్టు తేల్చిచెప్పడంతో షఫిన్ సుప్రీంను ఆశ్రయించాడు. అయితే దీనిపై ఎన్‌ఐఏ చేత దర్యాప్తు జరిపించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

బీహార్‌లో గో గ్యాంగ్‌రాజ్

బీఫ్ తిన్నారని ముస్లింలపై దాడి బాధితుడిపైనే పోలీస్ కేసు

పాట్నా: బీహార్‌లో గోరక్షక దళాలు మరోమారు గూండాగిరికి దిగాయి. గొడ్డు మాంసం తిన్నారనే అక్కసుతో ముస్లిం ఇంటిపై దాడికి దిగి మహమ్మద్ షాబుద్దీన్ అనే వ్యక్తిని తీవ్రంగా కొట్టారు. ఆ తరువాత పోలీసులు రంగంలోకి దిగి షాబుద్దీన్‌తో పాటు మరికొందరు ముస్లింలపై కేసులు నమోదు చేశారు. మెజార్టీ వర్గం మనోభావాలను కించపరిచే విధంగా వ్యవహరించారని పేర్కొంటూ కేసు విచారణ ప్రారంభించారు.పశ్చిమ చంపారన్ జిల్లాలోని దుమ్రా గ్రామంలో గురువారం ముస్లింలపై దౌర్జన్యం జరిగింది. ఉన్నట్లుండి కొందరు వ్యక్తులు భారత్ మాతాకీ జై అంటూ షాబుద్దీన్ ఇంటి బయట గుమికూడారు. షాబుద్దీన్‌ను బయటకు లాగి చితకబాదారు. బీఫ్ ఎక్కడి నుంచి తెచ్చుకున్నవ్ ? అంటూ కర్రలు తీసుకుని బాదారు. స్థానిక విహెచ్‌పికి చెందిన వారు ఈ దౌర్జన్యానికి పాల్పడినట్లు వెల్లడైంది. వారు తామంతా గోరక్షక దళం వారిమని, షాబుద్దీన్ రాత్రి పూట ఆవును చంపి మాంసం వండుకుని తిన్నట్లు తెలిసిందని అందుకే చితకబాదామని దర్జాగా తెలిపారు. ఈ ఘటన గురించి తెలియగానే సమీప గ్రామాలకు చెందిన ముస్లింలు కొందరు అక్కడికి రావడంతో వారిని కూడా ఈ దళం వారు షాబుద్దీన్ ఇంటిలోపడేసి కొట్టినట్లు వెల్లడైంది. స్థానికుడు ఒకరు ఈ తతంగం గురించి తెలియచేయడంతో పోలీసులు తరలివచ్చారు. పోలీసులు వచ్చే వరకూ గోరక్షక దళాల దౌర్జన్యకాండ సాగింది. అక్కడికి చేరుకున్న పోలీసులు నచ్చచెప్పడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపొయ్యారు. దాడిలో షాబుద్దీన్‌తో పాటు మరికొందరు గాయపడ్డారు. నలుగురిని చికిత్సకు ఆసుపత్రికి తరలించారు. ఈ దౌర్జన్యకాండ తరువాత స్థానిక పోలీసులు ముస్లింలపైనే కేసు నమోదు చేశారు. స్థానిక మతవిశ్వాసాలను కించపరిచే విధంగా వ్యవహరించారని ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోని అత్యధికులకు ఇబ్బంది కల్గించే విధంగా చేయడం శాంతిభద్రతల ఉల్లంఘనకు వస్తుందని పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి ఏడుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. షాబుద్దీన్‌ను ఆదుకుందామని వచ్చి దెబ్బలు తిన్న నలుగురు ముస్లింలపై కేసులు పెట్టి నిందితులుగా చేశారు. స్థానికంగా ఉండే నస్రుద్దీన్ మియాన్, ముస్తాఫా మియాన్, జహంగీర్, రిజ్వాన్‌పై నిందితులుగా కేసులు పెట్టినట్లు, విచారణ జరుగుతున్నట్లు స్థానిక పోలీసు అధికారి రాజేష్ జా తెలిపారు. అయితే ముస్లింలను కొట్టిన వారిపై కేసులు పెట్టారా? అని విలేకరులు ప్రశ్నించగా దాడి జరిగినట్లు ఇంతవరకూ తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదని, ఇక కేసులు ఎవరిపై పెడతామని వ్యాఖ్యానించారు. ఈ నెల 3వ తేదీనే గో రక్షక దళాల పేరిట కొందరు వ్యక్తులు ఓ ట్రక్కును నిలిపివేసి, ముగ్గురు ముస్లింను అందులో నుంచి దింపివేసి తీవ్రంగా కొట్టారు. గొడ్డు మాంసం తీసుకువెళ్లుతున్నట్లు తెలియడంతోనే అడ్డగించినట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఈ ఘటన భోజ్‌పూర్ జిల్లాలో జరిగింది.

నక్షత్ర వీధిలో మరో భూమి

వాషింగ్టన్: నక్షత్ర మండలంలో భూమిని పోలిన ఓ గ్రహం ఉందని వెల్లడైంది. భారతీయ సంతతికి చెందిన ఓ ఖగోళభౌతికవేత్తతో కూడిన సైంటిస్టుల బృందం పరిశోధనలో ఈ మరో భూమి జాడలు తెలిశాయి. భూమికి కేవలం 16 కాంతి సంవత్సరాల దూరంలోనే నక్షత్ర వీధిలో ఈ గ్రహం దాగి ఉందని నిర్ధారించారు. అమెరికాలోని టెక్సాస్ వర్సిటీ శాస్త్రజ్ఞులు ఈ గ్రహ రహస్యాన్ని ఛేధించారు. ఖగోళంలో పలు నక్షత్ర మండలాలు ఉన్నాయి. వీటిలో గ్లియెస్ 832 స్టార్ వ్యవస్థలోని గ్రహాల ఉనికి గురించి పరిశోధనలు సాగుతున్నాయి. ఈ అన్వేషణలో భాగంగానే ఇప్పుడు ఈ భూమి వంటి గ్రహం ఆనవాళ్లు కన్పించినట్లు వెల్లడైంది. నక్షత్ర మండలానికి 0.25 –2.0 ఆస్ట్రోనామికల్ యూనిట్ల దూరంలో ఈ గ్రహం ఉన్నట్లు విశ్లేషణలో వెల్లడైంది. అయితే ఈ భూమి వంటి గ్రహం పరిణామం అతి భారీగా ఉందని, భూమి కన్నా పది నుంచి పదిహేను రెట్లు ఉంటుందని అంచనా వేసినట్లు టెక్సాస్ వర్సిటీ భౌతిక పరిశోధకులు సుమన్ సత్యల్ తమ పరిశోధనా పత్రంలో తెలిపారు. భూమికి సమీపంలోనే నక్షత్ర మండలం చుట్టూ పరిభ్రమించే ఓ సరికొత్త గ్రహం ఉన్నట్లు తెలియడం ఖగోళ శాస్త్రీయ పరిశోధనలలో కీలకమైన అంశం అని భావిస్తున్నారు. ఈ కొత్త గ్రహం అత్యధికంగా రాళ్లతో నిండి ఉంటుందని అంచనావేశారు.



కొత్త వానపాములు



తిరువనంతపురం: పశ్చిమ కనుమలలో రెండు అత్యంత పురాతన తెగకు చెందిన వానపాములను కనుగొన్నారు. కేరళలో విస్తరించుకుని ఉన్న కనుమలలో ఈ ప్రాచీన జీవుల ఆవిష్కరణ జరిగిందని శాస్త్రజ్ఞులు తెలిపారు. ఈ రెండు రకాల వానపాములకు ద్రవిడ పాలీవెర్టిక్యులట, ద్రవిడ థామాసి అని శాస్త్రీయ నామాలు పెట్టారు. కేరళలోని మహాత్మా గాంధీ యూనివర్శిటీ, హిమాచల్ ప్రదేశ్‌లోని షూలినీ వర్శిటీకి చెందిన పరిశోధకులు సంయుక్తంగా జరిపిన అన్వేషణలలో ఈ ప్రాచీన జీవరాశి ఉనికి కొత్తగా వెల్లడైంది. మున్నార్ ప్రాంతంలో విశాల పచ్చికబయళ్లలో ఈ కొత్త రకం జీవులను కనుగొన్నట్లు , వీటిని ఎరవీకులం జాతీయ పార్క్ ఇతర చోట్ల కూడా కనుగొన్నట్లు పరిశోధకులు తెలిపారు. ఒకే జన్యువుకు చెందిన ఐదు రకాల వానపాములు ఉన్నట్లు వెల్లడైందని వారు వివరించారు. మొత్తం మీద ద్రవిడ రకం వానపాముల తెగలు 73 వరకూ ఉన్నాయి.

మన తెలంగాణ
11
హైదరాబాద్
శనివారం
19, ఆగస్టు 2017
www.manatelangana.news



బార్సిలోనా ఉగ్రదాడి హేయమైన చర్య: ఉప రాష్ట్రపతి

మనతెలంగాణ/న్యూఢిల్లీ: స్పెయిన్‌లోని బార్సిలోనా నగరంలో జరిగిన ఉగ్రవాద దాడి ఒక హేయమైన చర్య అని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయు డు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో చనిపోయిన మరియు గాయపడిన వారి కుటుంబ సంభ్యులకు తన సంతాపాన్ని తెలియజేశారు. సభ్య సమాజంలో ఇటువంటి హేయమైన మరియు పాశవిక చర్యలకు స్థానం లేదని, ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న సమ స్యలలో ఉగ్రవాదం కూడా ఒకటని, ఇది కొత్త పోకడలు పోతూ మానవాళి మనుగడకే ఒక సవాలు విసురుతోందని అన్నారు. అంతర్జాతీయ ఉగ్రవా దాన్ని సరైన అవగాహన మరియు పరస్పర సహకారాలతో మాత్రమే ఎదు ర్కోగలమని, దాడిచేసిన వారిని ఎదుర్కోవడంలో స్పెయిన్ ప్రభుత్వానికి మరియు ప్రజలకు బారత్ అండగా నిలుస్తుందని ఉద్ఘాటించారు. చనిపోయి న వారి కుటుంబ సభ్యులకు ప్రఘాఢ సానుభూతిని తెలియజే స్తూ.... గాయ పడినవారు త్వరగా కోల్కోవాలని ఆకాంక్షించారు. త్రిపుర గవర్నర్త థాగత రాయ్, అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిపెమా ఖండూ, కేంద్ర రెల్వే మంత్రిసురేష్ ప్రభాకర్ ప్రభు, కేంద్ర హోం శాఖ సహాయ మం త్రికిరణ్ రిజిజు, రాష్ట్రపతి కార్యదర్శి సంజయ్ కొఠారి తదితరులు శుక్ర వారం ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడును కలిసి అభినందనలు తెలియజేశారు.

సూర్యగ్రహణం వీక్షణకు ఏర్పాట్లు

వాషింగ్టన్ : సంపూర్ణ సూర్యగ్రహణం.. అదీ 99 ఏళ్ల తర్వాత అమెరికాలో స్పష్టంగా కనిపించనుంది. దీంతో ఆ అద్భుతాన్ని వీక్షించేందుకు అమెరికాలో కొన్ని సంస్థలు ఉద్యోగులకు సెలవులు ప్రకటించగా.. మరికొన్ని ఆ దృశ్యాలను చూసేందుకు ఆఫీసుల్లోనే ఉద్యోగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రత్యేక కళ్లద్దాలను ఉద్యోగులకు పంచిపెడుతున్నాయి. అమెరికాలో ఆగస్టు 21న ఉదయం 10: 15 నిమిషాలకు సూర్యగ్రహణం కనిపించనుంది. దక్షిణ కరోలినాలో మధ్యాహ్నం 2:50 గంటలకు ప్రారంభమై ఒరెగాన్ సముద్ర తీరం వద్ద సూర్యగ్రణం ముగుస్తుందని ఖగోళ పరిశోధకులు వెల్లడించారు.

ఉ. కొరియాకు అమెరికా హెచ్చరిక

వాషింగ్టన్: కఠిన పదజాలంతో ఉత్తర కొరియాకు అమెరికా హెచ్చరిక జారీ చేసింది. తనపైగాని, తన మిత్ర దేశాలపైగాని ఎటువంటి క్షిపణి దాడి జరిపినా తక్షణమే నిర్దిష్ట చర్య తీసుకుంటామని జపాన్ విదేశాంగ మంత్రి తారో కోనోతో కలిసి విలేకరుల గోష్టిలో మాట్లాడుతూ అమెరికా రక్షణ మంత్రి టిల్లర్సన్ ఈ హెచ్చరిక చేశారు. ఉత్తర కొరియా దుందుడుకు పనులకు దిగితే నిప్పులు కక్కే ప్రతి చర్యను తప్పక తీసుకుంటామని అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన మరునాడు టిల్లర్సన్ ప్రకటన చేయడం గమనార్హం. ఉత్తర కొరియా నుంచి ఎటువంటి అవాంతరం ఎదురయినా తిప్పికొట్టడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన హెచ్చరించారు. బలప్రయోగానికి తాము ప్రాధాన్యత ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. గతంలోవలే కాకుండా ఉత్తర కొరియా దౌత్యపరమైన చర్చల ద్వారా ఉద్రిక్తతల సడలింపునకు ముందుకు రావాలని కూడా ఆయన సూచించారు.

లంక నౌకాదళాధిపతిగా తమిళ వ్యక్తి

కొలంబో: శ్రీలంక నౌకాదళ అధిపతిగా రియర్ అడ్మిరల్ ట్రావిస్ సిన్నియాను శుక్రవారం నాడు నియమించారు. మైనారిటీ తమిళ వర్గం నుంచి తొలి నియామకం ఇది. 45 ఏళ్ల క్రితం అంతర్యుద్ధం ప్రజ్వరిల్లిన తర్వాత ఆ వర్గానికి ఇటువంటి గౌరవం దక్కడం ఇదే మొదటిది. ఎల్‌టిటిఇ యుద్ధ నౌకలను సముద్ర గర్భంలో ధ్వంసం చేయడంలో సిన్నియా గతంలో కీలక పాత్ర పోషించారు. అనేక దశాబ్దాలపాటు ఆయన లంక నౌకాదళంలో సేవలు అందించారు.

పనామా విచారణకు షరీఫ్ డుమ్మా

లాహోర్: అత్యున్నత స్థాయి అవినీతి నిరోధక సంస్థ విచారణకు పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్, అతని ఇద్దరు కుమారులు శుక్రవారం నాడు హాజరు కాలేదు. నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో (ఎన్‌ఎబి) వారికి గురువారం నాడు సమన్లు జారీ చేసింది. పనామా పేపర్ల కేసులో నవాజ్‌కు అనర్హత ప్రకటించిన సుప్రీంకోర్టు బెంచ్ తదుపరి దర్యాప్తును ఎన్‌ఎబికి అప్పగిస్తూ అప్పట్లో ఉత్తర్వు జారీ చేసింది. యుఎఇలో తన కుమారుడికి వర్క్ పర్మిట్‌ను నవాజ్ సంపాదించిన కేసు అది. ఈ కేసులో నవాజ్ అల్లుడు సఫ్దర్, ఫెడరల్ ఆర్థిక మంత్రి ఇషాక్ దార్ ఉమ్మడి దర్యాప్తు బృందం నివేదికలో పేర్కొన్న దోషులు. దార్ కూడా నవాజ్ బంధువు.


20 నుంచి రైల్వేలో 'టూల్ డౌన్'

మన తెలంగాణ / హైదరాబాద్ : రైల్వే కాంట్రాక్ట్ పనుల్లో జూన్ 30 తేదీకి ముందు కేటాయించిన టెండర్లకు పాత పన్ను విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20 తేదీ నుంచి టూల్ డౌన్ (నిరవధిక సమ్మె) చేపట్టనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జోనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రోవైడర్స్ అసోసియేషన్ ప్రకటించింది. జులై 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన జిఎస్‌టి పన్ను విధానాన్ని గతంలో కేటాయించిన పనులకు కూడా అమలు చేయడం వల్ల తమపై దాదాపు రూ.400 కోట్ల అదనపు భారం పడుతుందని అసోసియేషన్ ఉపాధ్యక్షులు రియాజ్, సంయుక్త కార్యదర్శి ఆశీర్వాదం చెప్పారు. నగరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కొత్త జిఎస్‌టి అమలు వల్ల దక్షిణ మధ్య రైల్వేలో జరుగుతున్న రూ.3 వేల కోట్ల విలువైన వివిధ పనులపై ప్రభావం పడుతుందని వారు చెప్పారు. ఈ సమస్యపై ఇప్పటికే జిఎస్‌టి కౌన్సిల్‌కు, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, రైల్వే మంత్రి సురేష్ ప్రభు, రైల్వే బోర్డు చైర్మెన్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన తేకపోవడంతో, ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా దేశ వ్యాప్తంగా టూల్‌డౌన్ నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు.

ఆహార పదార్థాల విక్రయదారులపై రైల్వే జరిమానా విధింపు

మన తెలంగాణ / హైదరాబాద్ : రైల్వే స్టేషన్లు, రైళ్లలో ఆహార పదార్థాల విక్రయదారులపై దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) అధికారులు ప్రత్యేక తనిఖీలను నిర్వహించి అక్రమంగా ఆహార పదార్థాలను విక్రయిస్తున్న దుకాణాలు, వ్యక్తులపై రూ.16.34 లక్షల జరిమానా విధించారు. గత పది రోజులు రైల్వే అధికారులు ఈ తనిఖీలను నిర్వహించారు. రైల్వే అధికారులు 397 ఆహార పదార్థాల దుకాణాలను తనిఖీ చేసి రూ.5.21 లక్షల జరిమానాను, 199 ప్యాంట్రీ కార్లను తనిఖీ చేసి రూ.3.83 లక్షలను, స్టేషన్లలో అక్రమంగా ఆహార పదార్థాలు అమ్ముతున్న వారిపై రూ.7.30 లక్షల జరిమానాను విధించడంతో పాటు 934 కేసులను నమోదు చేసినట్లు ఎస్‌సిఆర్ సిపిఆర్‌ఓ ఎం.ఉమాశంకర్ కుమార్ ఒక ప్రకటనలో వివరించారు.

కర్ణాటకలో రైల్ నెట్‌వర్క్‌ను విస్తరిస్తాం



మన తెలంగాణ/హైదరాబాద్ : కర్ణాటక రాష్ట్రంలో రైలు నెట్‌వర్క్‌ను విస్తరణకు ప్రాధాన్యత ఇస్తామని రైల్వే శాఖ మంత్రి సురేష్ ప్రభు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం యాద్గిర్‌లో ఏర్పాటు చేసిన రైల్ బోగి కార్ఖానాతో పాటు కల్‌బుర్గి జిల్లాలోని వాడి వద్ద బైపాస్ రైల్వే లైన్‌ను మంత్రి శుక్రవారం న్యూఢిల్లీ నుండి వీడియో రిమోట్ లింక్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సౌర ఇంధనం తదితర స్వచ్ఛ ఇంధనాల వినియోగం ద్వారా మెరుగైన ఇంధన సాంకేతికతను సమకూర్చుకుంటున్నామన్నారు. సరుకు రవాణా, నెట్‌వర్క్ ఆధునీకరణ, విద్యుదీకరణ పనులను అంకిత భావంతో చేస్తున్నామన్నారు. నూతన యూనిట్‌లో నూతన ఎల్‌హెచ్‌బి కోచ్‌లను తయారు చేస్తుందని, తద్వారా భారతీయ రైల్వే మరింత బలోపేతమౌతుందన్నారు. అంతకు ముందు దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్ మాట్లాడుతూ, రోబోటిక్ వెల్డింగ్ మిషన్ లాంటి ఆధునాతన తయారీ సౌకర్యాలు యూనిట్‌లో ఉన్నాయన్నారు. సంవత్సరానికి 600 ఫియట్ బోగీ ఫ్రేమ్‌ల తయారు చేసేలా రూ.80 కోట్లతో నెలకొల్పామన్నారు. బైపాస్ లైన్ ఏర్పాటుతో రైళ్ల రాకపోకలు మరింత సులభంగా జరుగుతాయన్నారు. కార్యక్రమంలో రాయచూర్ ఎంపి బి.వి.నాయక్, ఆ రాష్ట్ర ఎంఎల్‌సి బి.జి.పాటిల్‌లు మాట్లాడారు.

దాడులకు వాహనాలే ఆయుధాలు

బార్సిలోనా ఘటనతో మరోసారి ఉగ్రవాదుల పన్నాగాలు నిరూపితం

బార్సిలోనా : ఏడాది కాలంగా ఉగ్రవాదులు తమ దాడులకు వాహనాలనే ఆయుధాలుగా వినియోగి స్తు న్నారనడానికి గతంలో చోటుచేసుకున్న పలు ఉదంతాలే నిదర్శనం. బార్సిలోనా నగరంలోని పాదచారులపై జరిగిన తాజా దాడి కూడా అదే కోవలోకి వస్తుంది. ఈ దాడిని ఐఎస్ సైనికులు చేపట్టారని ఆ సంస్థకు ప్రచారం కల్పిస్తున్న 'ఆమాక్' పేర్కొన్నట్లు ఇస్లామిస్ట్ వెబ్‌సైటులను పర్యవేక్షించే సైట్ ఇంటెలిజెన్స్ గ్రూప్ (ఎస్‌ఐజి) వెల్లడించింది. ఇరాక్, సిరియా దేశాల్లోని జీహాదీలతో పోరాడుతున్న అమెరికా నాయకత్వంలోని కూటమి దేశాల్లో దాడులకు ఐఎస్ గ్రూపుకు చెందిన ఉగ్రవాదులు తరచూ వాహనాలనే ఉపయోగిస్తున్నారు.

జులై 14, 2016న నైస్‌లోని బాస్టిల్లే దినోత్సవం సందర్భంగా నైస్‌లోని ఆహ్లాదకరమైన ఆంగ్లాయిస్ ప్రదేశంపై 31 ఏళ్ల ట్యునీషియా వాసి మహ్మద్ లాహౌయిజ్ బౌచెల్ ఒక 19 టన్నుల ట్రక్కును దురుసుగా నడపడంతో 86 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి చేసింది తమ అనుచరుడు బౌచెల్ అని ఐఎస్ తర్వాత ప్రకటించింది.

జూన్ 19, 2007న పారిస్‌లోని చాంప్స్‌ఎలిసీస్‌లోని ఒక పోలీసు వ్యానుపైకి ఆయుధాలు నింపిన ఒక కారును ఐఎస్ ఉగ్రవాది 31 ఏళ్ల ఆడమ్ డిజాజిరి దురుసుగా నడిపాడు. ఈ ఘటనలో అతనే ప్రాణాలు కోల్పోయాడు.

డిసెంబరు 19, 2016న ట్యునీషియాకి చెందిన అనీస్ అమ్రి (24) ఒక ట్రక్కును హైజాక్ చేసి బెర్లిన్‌లోని క్రిస్ట్‌మస్ మార్కెట్‌లో జనాలపైకి పోనిచ్చాడు. ఈ ఘటనలో 12 మంది దుర్మరణం చెందగా మరో 48 మంది గాయపడ్డారు.

మార్చి 22, 2017న బ్రిటన్ పార్లమెంట్‌కి సమీ పంలోని వెస్ట్‌మినిస్టర్ బ్రిడ్జ్‌పై నడుస్తున్న పాదచారులపైకి ఖలీద్ మసూద్ (52) వాహనాన్ని నడిపి ఐదుగురు ప్రాణాలను తీశాడు. సుమారు మరో 50 మంది గాయప డ్డారు. నిందితుడు పోలీసుల చేతిలో హతమయ్యాడు. ఈ దాడికి ఐఎస్ బాధ్యత వహించినట్లు ప్రకటించింది.



ఏప్రిల్ 7, 2017న ఉజ్బెకిస్తాన్‌కి చెందిన రఖ్మత్ అకిలోవ్ (39) స్వీడన్ రాజధాని నగరం స్టాక్‌హామ్‌లోని డ్రాటింగాటన్‌లో దొంగిలించిన ట్రక్కుతో దాడి చేసి ఐదుగురి ప్రాణాలు తీశాడు. మరో 15 మంది గాయపడ్డారు. 2015లో అతను ఐఎస్‌లో చేరడానికి ప్రయత్నించాడు.


జూన్ 3, 2017న లండన్ బ్రిడ్జ్ వద్ద పాదచారులపై వ్యానుతో ముగ్గురు దురాక్రమణదారులు అమానుషంగా దాడి చేశారు. ఐఎస్ బాధ్యత ప్రకటించుకున్న ఈ ఘటనలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. దాడికి పాల్పడిన నేరస్తులను కూడా పోలీసులు మట్టుబెట్టారు.

ఆగస్టు 19, 2017న అల్జీరియాకి చెందిన 36 ఏళ్ల హమౌబి పశ్చిమ పారిస్ శివారులోని లెవల్లోయిస్‌పెరెట్‌లో ఒక బరాక్‌ల బయట ఉన్న సైనికల సమూహంపైకి బిఎండబ్ల్యు వాహనాన్ని పోనిచ్చాడు. ఈ ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. ఇలా సుమారు ఏడాది కాలంగా ఐఎస్ ఉగ్రవాదులు అమానవీయ దాడులకు వాహనాలనే ఆయుధాలుగా వినియోగిస్తుండటం భద్రతా దళాలకు సవాలుగా మారింది.

ఐదుగురు అనుమానితుల కాల్చివేత

బార్సిలోనాలో ఉగ్రవాదుల వ్యాను దాడి ఘటనతో సంబంధమున్నట్లు భావించిన ఐదుగురు అనుమానితుల్ని స్పెయిన్ పోలీసులు శుక్రవారం కాల్చిచంపారు. ఈ దాడికి తామే బాధ్యత వహిస్తున్నట్లు ఉగ్రవాద సంస్థ 'ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్)'ప్రకటించడంతో నిందితుల వేటను పోలీసులు తీవ్రతరం చేశారు. సముద్రతీరం లోని కాంబ్రిల్స్ పట్టణ పోలీసులు తెల్లవారుజామున ఒక ఉగ్రదాడిని తిప్పికొట్టే సమయంలో బెల్టు బాంబులు కలిగి ఉన్న ఈ అను మానితుల్ని హతమార్చినట్లు కేటలోనియా ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్ల డించింది. కాంబ్రిల్స్‌లోని విశాలమైన కాలినడక రహదారిపై దాడికి అను మానితులు పథకం పన్నారని మేయర్ కేమి మెండోజా చెప్పారు. బార్సిలో నా వ్యాను దాడితో వీరికి సంబంధముందని కేటలోనియా హోం మంత్రి జొయాక్విన్ ఫోర్న్ స్థానిక రేడియోకి తెలిపారు. మరోవైపు దాడిలో గాయపడిన సుమారు వంద మందిలో ఫ్రాన్స్, పాకిస్తాన్, స్పెయిన్, నెదర్లాండ్స్, చైనా, వెనిజులా, మారిటానియా, ఆస్ట్రేలియా, బ్రిటన్ సహా కనీసం 34 దేశాలకు చెందిన పౌరులు న్నారని స్పెయిన్ పౌర సంరక్షణ సంస్థ శుక్రవారం వెల్లడించింది.


ఫ్రిజ్‌లో దూరి బతికిన నటి



స్పెయిన్‌లో ఉగ్రవాదుల దాడి నుంచి భారతీయ సంతతికి చెందిన నటి లైలా రూసాస్ నాటకీయంగా తప్పించుకున్నారు. బార్సిలోనాలో దాడి సమయంలో ఆమె వెంటనే సమీపంలోని రెస్టారెంట్‌లో ఫ్రిజర్‌లో దాక్కున్నారు. దీని తో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. పది సంవత్సరాల కూతురు ఇనే జ్ ఖాన్‌తో కలిసి ఆ నటి సెలవుల విరామంపై బార్సిలోనా వెళ్లారు. ఐసిస్ ఉగ్రవాదులు బార్సిలోనాలోని రద్దీగా ఉండే లాస్ రాంబ్లాస్‌లో దాడి జరిపారు.

నరెడ్కో సదస్సుకు తెలుగు రాష్ట్రాల ప్రతినిధులు

మన తెలంగాణ/హైదరాబాద్ : నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) జాతీయ సదస్సుకు తెలంగాణ నుండి 20 నుండి 25 మంది, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుండి 40 మంది రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారు. నగరంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో నరెడ్కో ఉపాధ్యక్షులు (సౌత్) ఆర్.చలపతిరావు, నరెడ్కో ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు జి.హరిబాబు, తెలంగాణ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ (ట్రెడా) అధ్యక్షులు పి.రవీందర్ రావు పాల్గొన్నారు. తెలంగాణలో డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల ప్రతినిధులు జాతీయ, అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ దిగ్గజాలనుదృష్టిని తెలుగు రాష్ట్రాల వైపుకు మళ్లించేందుకు కృషి చేస్తారని తెలిపారు. రెండు రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టేందుకు, నూతన సాంకేతిక పరిజ్ఞాన మార్పిడికి ఉన్న అవకాశాలను వివరిస్తామన్నారు. న్యూఢిల్లీలో ఆగస్టు 28, 29 తేదీల్లో రెండు రోజుల పాటు సదస్సు జరుగుతుందన్నారు. గత సంవత్సర కాలంలో బి నామీ చట్టం, రెరా, నో ట్ల రద్దు, రియల్ ఎస్టేట్ యాక్ట్ తదితరమైనవి చోటు చేసుకోవడంతో ఈ సారి




జరిగే నరెడ్కో సదస్సులో వీటిపై చర్చ జరుగుతుందన్నారు. దేశవ్యా ప్తంగా 2022 సంవత్సరం నాటికి అందరికి ఇళ్లను అందించేందుకు పట్ట ణాల్లో 2 కోట్ల ఇళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో 4 కోట్ల ఇళ్లు నిర్మించాలన్న లక్ష్యం నెరవేరేందుకు నరెడ్కో అందులో కీలక పాత్ర పోషించనుందని తెలిపారు.

సాక్షిగానా, నిందితుడిగానా!

సినీ ప్రముఖులకు ఇంకా వదలని డ్రగ్స్ భయం • అందరి చూపు చార్జిషీట్‌పైనే

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: కెల్విన్ డ్రగ్స్ రాకెట్‌లో సినీ ప్రముఖుల విచారణ పూర్తయినా వారిని మాత్రం ఇంకా భయం వెంటాడుతునే ఉంది. ఇంతకీ తమను ఈ కేసులో సాక్షులుగా చేర్చుతారా లేక నిందితులుగా చేర్చుతారా అనే విషయం ఇంకా తేటతెల్లం కాకపోవడంతో వారిలో గుబులు రేగుతుంది. ఆబ్కారీ రాష్ట్ర కార్యాలయంలో పక్షం రోజుల పాటు సినీ ప్రముఖులను విచారిస్తున్న సమయంలో తెలుగు రాష్ట్రాల ప్రజలు ఈ కేసుపై ఆసక్తి కనబర్చారు. విచారణ అనంతరం తప్పులను సరిదిద్దుకుంటామంటూ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు సినీ పరిశ్రమ లేఖ రాయడం, వెనువెంటనే కెసిఆర్ సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి డ్రగ్స్ వాడినవారు బాధితులని, డ్రగ్స్ సరఫరా చేసిన వారు మాత్రమే నిందితులుగా ఉంటారని స్పష్టం చేశారు. దీంతో సినీ పరిశ్రమ వర్గాలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఆబ్కారీ విచారణను ఎదుర్కొన్న సినీ ప్రముఖుల్లో ఎంత మంది బాధితుల జాబితా కిందకు వస్తారు, ఎంత మంది నిందితుల జాబితా కిందకు వస్తారో ప్రశ్నార్థకంగా మారింది. డ్రగ్స్ కేసులో సినీ ప్రముఖులు రవితేజ, పూరీ జగన్నాథ్, సుబ్బరాజు, ముమైత్‌ఖాన్, నందు, తరుణ్, నవదీప్, చార్మీ, అఖిల్‌చౌదరితో పాటు పలువురు ఉన్నారు. డ్రగ్స్ వాడారా లేక సరఫరా చేశారా అనే విషయం కేవలం దర్యాప్తు అధికారులకు మాత్రమే తెలుసు. విచారణను ఎదుర్కొన్న వారు బాధితులా, నిందితులా అనే విషయాన్ని వారు ఇంకా స్పష్టం చేయలేదు. సిఎం సమావేశం అనంతరం కేసు నీరుగారిపోయిందనే ఆరోపణలు కూడా వచ్చాయి. అయితే ఈ కేసులో ఇంకా ఛార్జిషీట్ పూర్తి చేయకపోవడంతో విచారణ ఎదుర్కొన్న సినీ ప్రముఖులు మాత్రం భయాందోళనలో ఉన్నారు. ఈ కేసును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పర్యవేక్షిస్తున్న అబ్కారీ డైరెక్టర్ అకున్ సబర్వాల్ తమను కేసులో సాక్షులుగా పెడతారా..? నిందితులుగా పెడతారా..? అనే చర్చ ఇప్పుడు సినీ వర్గాల్లో సాగుతోంది. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు నివురుగప్పిన నిప్పులా ఉంది. ఈ కేసులో సాక్షాధ్యారాలు ఇంకా పూర్తికాలేదు. విచారణను ఎదుర్కొన్న వారిలో కొందరి వెంట్రుకలు, రక్తం నమూనా, గోర్లను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించిన విషయం తెలిసిందే. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నుంచి పరీక్షల నివేధిక వస్తేగాని ఛార్జిషీట్ వేసేందుకు వీలు కలుగుతుంది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు ఛార్జిషీట్ కోర్టులో దాఖలు చేస్తేనే అందరి జాతకాలు తేలిపోనున్నాయి. సినీ ప్రముఖులు బాధితులా నిందితులా అనేది ఛార్జిషీట్‌లోనే తెలుస్తుంది. దీంతో అందరి చూపు ఛార్జిషీట్‌పైనే ఉంది.

ఇప్పుడే చెప్పలేం: అకున్‌సబర్వాల్



టాలీవుడ్‌లో కలకలం రేపిన డ్రగ్స్ వ్యవహారంలో సినీ ప్రముఖులు సాక్షులా, నిందితులా అనే విషయం చెప్పలేమని తెలంగాణ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ అన్నారు. ఈ విషయంలో తాము చట్టప్రకారం వ్యవహరిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో డ్రగ్స్ వ్యవహారంలో ఇప్పటి వరకు సిట్ 11 కేసుల్లో 22 మందిని అరెస్టు చేసిందని ఆయన వెల్లడించారు. ఈ కేసులో సాక్షుల విచారణ ఇంకా కొనసాగుతోందని చెప్పారు. ఈ కేసులో ఈ కేడాది డిసెంబర్ చివరి నాటికి కోర్టులో ఛార్జిషీట్లు దాఖలు చేస్తామని చెప్పారు. నిందితుల నుంచి ఫోరెన్సిక్ నిపుణులు నమూనాలు తీసుకున్నారని, ఆ నివేదికల కోసం ఎదురు చూస్తున్నామని అకున్ సబర్వాల్ చెప్పారు. సిట్ చేస్తున్నదర్యాప్తునకు సర్కార్ నుంచి పూర్తిగా మద్దతు ఉందని అన్నారు. డ్రగ్స్ వ్యవహారంలో తాము విద్యార్థులు ఎవరికీ నోటీసులు ఇవ్వలేదని తెలిపారు. డ్రగ్స్ తీసుకుంటే తలెత్తే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

మరో డ్రగ్ రాకెట్ గుట్టురట్టు

నైజీరియన్ జాతీయుడి అరెస్టు • 20 గ్రాముల కొకైన్ స్వాధీనం

మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో: నగరంలో మరో డ్రగ్ రాకెట్ గుట్టురట్టయింది. నెల రోజుల క్రితం డ్రగ్స్ దందా కింగ్‌పిన్ కెల్విన్ అరెస్టుతో నగరంలో డ్రగ్స్ సరఫరాకు చెక్ పడుతుందని అందరు భావించారు. అయితే అందుకు విరుద్ధంగా రెండు రోజులకు ఒకసారి చొప్పున నగరంలో వరుసగా డ్రగ్స్ కేసులు బయటపడుతునే ఉన్నాయి. తాజాగా శుక్రవారం కొకైన్‌ను తరలిస్తున్న ఓ నైజీరియన్ జాతీయుని కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతని నుంచి 20 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి లింబారెడ్డి వెల్లడించారు. నైజీరియా దేశస్థుడు గాడ్ పవర్ (25) బిజినెస్ వీసాపై ఇండియాకు వచ్చాడు. ఢిల్లీ, హైదరాబాద్‌లో నివాసముంటున్న ఇతగాడు గార్మెంట్స్ ఎక్స్‌పోర్ట్ వ్యాపారం నిర్వహిస్తున్నానని నమ్మించాడు. అయితే ఇతడు చేసేది మాత్రం నైజీరియాలో ఉన్న అతని స్నేహితుడి నుంచి డ్రగ్స్ హైదరా బాద్‌కు తెప్పించుకోవడం దాన్ని గోవా, ముంబాయిలో ఉన్న కస్టమర్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. ఒక గ్రాము కొకైన్‌ను రూ.2000 నుంచి రూ.2500 ఖరీదు చేసుకుంటున్న ఇతగాడు ఇక్కడ దాన్ని రూ.5000 నుంచి రూ.6000 వరకు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి.బలవంతయ్య, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ ఫయాజ్, ఎస్‌ఐలు కె.శ్రీకాంత్, బి.శ్రావణ్, కె.ఎస్.రవి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు అతనిపై నిఘా పెట్టారు. గాడ్ పవర్ శుక్రవారం గోల్కొండ ప్రాంతంలోని సెవన్ ట్యాబ్స్ వద్ద 20 గ్రాముల కొకైన్‌ను కస్టమర్‌కు విక్రయిస్తుండగా టాస్క్‌ఫోర్స్



పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు.

పట్టుబడడం ఇదీ మూడో సారి....ఇతగాడు నగర పోలీసులకు పట్టుబడడం ఇదీ మూడో సారి. గత ఏడాది ఇతడు ఓ కస్టమర్‌కు కొకైన్ అమ్ముతూ పట్టుబడి జైలు కెళ్లాడు. జైలు నుంచి విడుదలైన తరువాత తిరిగి డ్రగ్స్ విక్రయించడం మళ్లీ మొదలు పెట్టాడు. ఇతనిపై నిఘా పెట్టిన బంజారాహిల్స్ పోలీసులు మూడు నెలల క్రితం పట్టుకున్నారు. చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన ఇత గాడు తిరిగి డ్రగ్స్ విక్రయిస్తునే ఉన్నాడు. తాజాగా గోల్కొండ వద్ద కొకైన్ విక్రయిస్తు ముచ్చగా మూడో సారి పట్టుబడ్డాడు. ఇతనిపై నగర పోలీసులు పిడియాక్ట్ ప్రయోగించే అవకాశం ఉంది.

నాకు ఓ అరుదైన కల ఉంది: రైనా



న్యూఢిల్లీ: ప్రపంచకప్ ఫైనల్లో విన్నింగ్ షాట్ కొట్టాలన్నదే తన చిరకాల వాంఛ అని భారత స్టార్ క్రికెటర్ సురేశ్ రైనా అన్నాడు. తన అరుదైన కల గురించి మీడియా సమావేశంలో రైనా వెల్లడించాడు. 2019 ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్‌కు చేరాలి. ఆ ఫైనల్లో ఆస్ట్రేలియా లేదా పాకిస్థాన్ జట్లతో భారత్ తలపడాలి. తాను ఫోర్‌తో భారత్‌ను గెలిపించాలి. అప్పుడూ గ్యాలరీలో ఉన్న నా కుమార్తె గ్రేసియా నన్ను చూసి చప్పట్లు కొట్టాలి. త్రివర్ణ పతకం రెపరెపలాడాలి. ఇది తన అరుదైన కల అని రైనా వివరించాడు. ఇది చూసేందుకు చాలా అత్యాశగా కనిపిస్తున్నా దీన్ని ఆచరణలో నిజం చేయాలని తాను భావిస్తున్నట్టు చెప్పాడు. కాగా, శ్రీలంక సిరీస్‌లో జట్టులో చోటు సంపాదించడంలో రైనా విఫలమయ్యాడు. బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో నిర్వహించిన యొ-యొ పరీక్షలో ఫెయిలై జట్టులో స్థానం దక్కించుకోలేక పోయాడు. ఫిట్‌నెస్ లేమి వల్ల అతన్ని జట్టుకు ఎంపిక చేయలేదని చీఫ్ సెలెక్టర్ ప్రసాద్ తెలిపిన విషయం తెలిసిందే. కాగా, త్వరలోనే తాను టీమిండియాలో చోటు సంపాదించడం ఖాయమని రైనా జోస్యం చెప్పాడు. ఫిట్‌నెస్‌ను నిరూపించుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తానని రైనా తెలిపాడు.

స్టెయిన్ సిద్ధం

కేప్‌టౌన్: గాయం వల్ల చాలా కాలంగా అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్న దక్షిణాఫ్రికా స్టార్ ఫాస్ట్ బౌలర్ డేల్ స్టెయిన్ ప్రస్తుతం పూర్తి ఫిట్‌నెస్‌ను సంతరించుకున్నాడు. భుజం గాయంతో బాధపడిన స్పీడ్ స్టర్ స్టెయిన్ ఏడాది కాలంగా జాతీయ జట్టుకు దూరంగా ఉన్నాడు. 2016లో చివరి సారిగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో స్టెయిన్ సౌతాఫ్రికాకు ప్రాతినిథ్యం వహించాడు. తర్వాత అతనికి శస్త్ర చికిత్స జరిగింది. దీంతో దాదాపు ఏడాది కాలంగా జట్టుకు దూరంగా ఉండాల్సి వచ్చింది. కాగా, ప్రస్తుతం తాను పూర్తిగా కోలుకున్నానని, త్వరలోనే మళ్లీ జట్టు తరపున బరిలోకి దిగుతానని తెలిపాడు. ఈ మేరకు తన ఫిట్‌నెస్‌ను వివరిస్తూ సోషల్ మీడియాలో ట్వీట్ చేశాడు. గాయాల వల్ల చాలా కాలంగా జాతీయ జట్టుకు దూరంగా ఉండాల్సి రావడం ఎంతో ఆవేదనకు గురి చేసిందన్నాడు. ప్రస్తుతం తాను పూర్తిగా కోలుకున్నానని, త్వరలోనే మళ్లీ దేశానికి ప్రాతినిథ్యం వహిస్తానని వివరించాడు. త్వరలో బంగ్లాదేశ్‌తో జరిగే సిరీస్‌లో స్టెయిన్ బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ సిరీస్‌లో స్టెయిన్‌కు చోటు కల్పిస్తారనే ప్రచారం జరుగుతుంది. ప్రపంచంలోని అత్యుత్తమ ఫాస్ట్ బౌలర్లలో ఒకడిగా స్టెయిన్ పేరు తెచ్చుకున్నాడు. ఇప్పటి వరకు స్టెయిన్ టెస్టుల్లో 22.30 సగటుతో 417 వికెట్లను పడగొట్టాడు. వన్డేల్లో, టీ–20ల్లో కూడా పొదుపుగా బౌలింగ్ చేయడంలో స్టెయిన్‌కు దిట్టగా పేరుంది. త్వరలోనే అతని విన్యాసాలను చూసే అవకాశం అభిమానులకు దక్కనుంది.





ధోనీకి పరీక్షా సమయం!

విఫలమైతే చోటు కష్టమే

దంబుల్లా: భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీకి శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్ సవాలుగా మారింది. ఇప్పటికే టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన ధోనీ కేవలం వన్డేలు, ట్వంటీ–20 ఫార్మాట్‌లో మాత్రమే ఆడుతున్నాడు. కొంత కాలంగా ధోనీ బ్యాటింగ్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అతని బ్యాటింగ్‌లో మునుపటి పదును లేదని, అతను జట్టుకు భారంగా మారాడని అతని ప్రత్యర్థులు అభిప్రాయపడుతున్నారు. జట్టు యాజమాన్యం మాత్రం గత రికార్డులను దృష్టిలో పెట్టుకుని ధోనీని జట్టులో కొనసాగిస్తోంది. అయితే ఇటీవల భారత మాజీ కెప్టెన్, జూనియర్ జట్టు ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ చేసిన వ్యాఖ్యలు ధోనీ భవిష్యత్తుపై అనుమానాలకు తావిస్తోంది. ధోనీ, యువరాజ్‌లను తప్పించి యువ ఆటగాళ్లకు చోటు ఇవ్వాలని ద్రవిడ్ చేసిన సూచన ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే చాలా మంది మాజీ క్రికెటర్లు ద్రవిడ్ వాదనను సమర్థించారు. వయసు పెరిగిన నేపథ్యంలో ధోనీ మునుపటిలో చెలరేగి ఆడలేక పోతున్నాడు. ఒకప్పుడూ ఒంటి చేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయడంలో సిద్ధహస్తుడిగా పేరు తెచ్చుకున్న ధోనీ ఇటీవల కాలంలో పేలవమైన ఫాంతో సతమతమవుతున్నాడు. సులువుగా గెలవాల్సిన మ్యాచ్‌లను కూడా ధోనీ బ్యాటింగ్ వల్ల కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. అతని బ్యాటింగ్ లయ తప్పిందనే విమర్శలు రోజు రోజుకు బలపడుతున్నాడయి. అతని కోసం యువ ఆటగాళ్ల అవకాశాలను తొక్కి పడేస్తున్నారనే విమర్శలు కొకొల్లొలుగా వెల్తు వెత్తుతున్నాయి. ఒకప్పుడూ విధ్వంసక బ్యాటింగ్‌కు పెట్టింది పేరుగా ఉన్న ధోనీ ఇటీవల కాలంలో వరుస వైఫల్యాలు చవిచూస్తున్నాడు. అతని ఆట తీరుపై పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. శ్రీలంక పర్యటనకు అతన్ని ఎంపిక చేయడాన్ని చాలా మంది తప్పుపట్టారు. రిశబ్ పంత్, దినేష్ కార్తీక్, పార్థివ్ పటేల్, సంజూ శాంసన్ వంటి ప్రతిభావంతులైన యువ క్రికెటర్లు అందుబాటులో ఉన్నా ధోనీని ఎందుకు ఆడిస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. గతాన్ని దృష్టిలో పెట్టుకొని అతన్ని జట్టులో కొనసాగించడం సమంజసం కాదని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. యువరాజ్ సింగ్, సురేశ్ రైనాలను పక్కన బెట్టే సాహసం చేసిన సెలెక్టర్లు ధోనీ విషయంలో మాత్రం వెనక్కి తగ్గారనే విమర్శలు వస్తున్నాయి. కాగా, శ్రీలంక పర్యటన తర్వాత ధోనీ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకుంటామని బిసిసిఐ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కె ప్రసాద్ చేసిన ప్రకటన పెను సంచలనం సృష్టించింది. ఈ ప్రకటన చేసిన ప్రసాద్‌పై ధోనీ అభిమానులు పెద్ద ఎత్తున విమర్శలకు దిగుతున్నారు. అయితే రానున్న ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని యువ ఆటగాళ్లకు చోటు కల్పించాలనే ద్రవిడ్ సూచన కూడా ఈ సందర్భంగా ప్రాధాన్యత సంతరించుకుంది. చాలా ఏళ్లుగా జట్టుకు చిరస్మరణీయ సేవలు అందించిన ఘనత ధోనీకి ఉంది. కెప్టెన్‌గా, ఆటగాడిగా, వికెట్ కీపర్‌గా అతని సేవలు వేల కట్టలేనివే. అయితే జట్టు ప్రయోజనాల దృష్ట్యా అతను తానంతటా తనే తప్పుకునే వరకు వేచి చూడడం మంచిది కాదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొన్ని సిరీస్‌లకు అతన్ని దూరంగా ఉంచి యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించాలనే డిమాండ్ ఊపందుకుంది. ఈ నేపథ్యంలో శ్రీలంక సిరీస్ ధోనీకి చావోరేవోగా మారింది. జట్టులో స్థానం నిలబెట్టుకోవాలంటే ధోనీ ఈ సిరీస్‌లో మెరుపులు మెరిపించాల్సిన అవసరం ఉంది. రెండేళ్ల కాలంలో ధోనీ మరి అధ్వాన్నంగా తయారైంది. ఈ క్రమంలో 26 వన్డేలు ఆడిన ధోనీ కేవలం ఒక సెంచరీ మాత్రమే సాధించాడు. అంతేగాక, నాలుగు అర్ధ సెంచరీలతో సరి పెట్టుకున్నాడు. కీలకమైన ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా ఆశించిన విధంగా రాణించలేక పోయాడు. వెస్టిండీస్ సిరీస్‌లో మాత్రం కాస్త మెరుగైన బ్యాటింగ్ కనబరచడం ఒక్కటే కాస్త ఊరటనిచ్చే అంశం.

మెరుగైన ప్రదర్శన ఇస్తా..

మరోవైపు శ్రీలంక సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన ఇచ్చేందుకు మహేంద్ర సింగ్ ధోనీ తహతహలాడుతున్నాడు. ఈసారి ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా ఆడతానని తెలిపాడు. తనపై జట్టు యాజమాన్యం పెట్టుకున్న ఆశలను నీరు గార్చనని స్పష్టం చేశాడు. ఈ సిరీస్ తనకు నిజంగా పరీక్ష వంటిదేనన్నాడు. జట్టులో స్థానం నిలబెట్టుకోవాలంటే మెరుగ్గా ఆడక తప్పదన్నాడు. చాలా మంది యువ ఆటగాళ్లు జట్టులో చోటు కోసం వేచి చూస్తున్న తరుణంలో ఏమాత్రం విఫలమైన భారీ మూల్యం చెల్లించుకోవడం ఖాయమన్నాడు. తాను మాత్రం శ్రీలంక సిరీస్ కోసం ముమ్మర సాధన చేసినట్టు చెప్పాడు. బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో తన ప్రాక్టీస్ కొనసాగిందన్నాడు. లంక సిరీస్‌కు కావాల్సినంత సాధన తనకు లభించిందన్నాడు.

విరాట్ కోహ్లికి అగ్ర స్థానం

ఐసిసి వన్డే ర్యాంకింగ్స్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) శుక్రవారం ప్రకటించిన తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి అగ్ర స్థానాన్ని దక్కించుకున్నాడు. 873 పాయింట్లతో విరాట్ నంబర్ వన్ కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియా స్టార్ డేవిడ్ వార్నర్‌ను వెనక్కి నెట్టి కోహ్లి టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. వార్నర్ 861 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. కాగా, భారత్ తరపున వన్డే ర్యాంకింగ్స్‌లో మరే భారత బ్యాట్స్‌మన్ టాప్ టెన్‌లో చోటు సంపాదించలేదు. అయితే టాప్–15లో మాత్రం ముగ్గురు భారత ఆటగాళ్లు చోటు సంపాదించారు. మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ మహేంద్ర సింగ్ ధోనీ 12వ, స్టార్ ఓపెనర్ శిఖర్ ధావన్ 13వ ర్యాంక్‌ను దక్కించుకున్నారు. డాషింగ్ ఆటగాడు రోహ్లి శర్మ 14వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఇక, బౌలర్ల విభాగంలో భారత స్పీడ్ స్టర్, వన్డే స్పెషలిస్ట్ భువనేశ్వర్ కుమార్ 13వ ర్యాంక్‌లో నిలిచాడు. టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత్ 114 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతోంది. ఈ ర్యాంక్‌ను కాపాడు కోవాలంటే శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్‌ను భారత్ కనీసం 4–1 తేడాతో గెలవాల్సి ఉంటుంది. లేకుంటే ఇంగ్లాండ్‌కు మూడో ర్యాంక్ ఖాయమవుతోంది. ప్రస్తుతం ఇంగ్లాండ్ 113 పాయింట్లతో భారత్ వెనకాలే నిలిచింది.

లంకకు తప్పని కష్టాలు...



మరోవైపు వరుస ఓటములతో సతమతమవుతున్న శ్రీలంకకు భారత్‌తో జరిగే సిరీస్ చాలా కీలకంగా మారింది. 2019 వన్డే ప్రపంచ కప్‌కు నేరుగా అర్హత సాధించాలంటే శ్రీలంక ఈ సిరీస్‌లో కనీసం రెండు మ్యాచుల్లోనైనా భారత్‌ను ఓడించాల్సిందే. లేకుంటే వరల్డ్ కప్ బెర్త్ కోసం అర్హత మ్యాచుల్లో ఆడక తప్పదు. ఐసిసి కొత్తగా ప్రకటించిన నిబంధనల ప్రకారం వన్డే ర్యాంకింగ్స్‌లో చివరి నాలుగు స్థానాల్లో నిలిచే జట్లు మెయిన్ డ్రాకు చేరాలంటే అర్హత మ్యాచ్‌లు ఆడాల్సిందే. ఇటువంటి ప్రమాదమే పస్తుతం శ్రీలంకను వెంటాడుతోంది. ఒకప్పుడూ ప్రపంచ క్రికెట్‌ను శాసించిన శ్రీలంక ప్రస్తుతం దయనీయ స్థితికి చేరింది. వన్డే ర్యాంకింగ్స్‌లో శ్రీలంక 88 పాయింట్లతో 8వ స్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుతం 78 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో ఉన్న వెస్టిండీస్‌తో శ్రీలంకకు ప్రమాదం పొంచి వుంది. భారత్‌తో జరిగే సిరీస్‌లో లంక చిత్తుగా ఓడిపోతే మాత్రం శ్రీలంక ప్రపంచ కప్ బెర్త్ కోసం అర్హత పోటీలు ఆడక తప్పదు. కాగా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ జట్లు ఇప్పటికే ప్రపంచకప్ బెర్త్‌లను దాదాపు ఖాయం చేసుకున్నాయి. శ్రీలంక, వెస్టిండీస్‌లతో పోల్చితే రేటింగ్స్‌లో ఇరు జట్లు చాలా మెరుగైన స్థితిలో ఉన్నాయి.

భారత సిరీస్‌కు ఆస్ట్రేలియా జట్టు ఎంపిక

ఫాల్కనర్, కౌల్టర్ నైల్‌లకు చోటు

మెల్‌బోర్న్: భారత్‌తో జరిగే వన్డే, ట్వంటీ–20 సిరీస్ కోసం ఆస్ట్రేలియా జట్టును ప్రకటించారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలలో భారత్‌లో ఈ సిరీస్ జరుగనుంది. ఇందులో ఆస్ట్రేలియా ఐదు వన్డేలు, మరో మూడు ట్వంటీ–20 మ్యాచులు ఆడనుంది. దీని కోసం క్రికెట్ ఆస్ట్రేలియా రెండు వేర్వేరు జట్లను ఎంపిక చేసింది. స్టార్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్‌ను ఈ సిరీస్‌కు ఎంపిక చేయలేదు. రానున్న యాషెస్ సిరీస్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ సిరీస్‌లో స్టార్క్‌కు విశ్రాంతి ఇచ్చారు. అయితే చాలా కాలంగా అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్న స్టార్ ఆల్‌రౌండర్ జేమ్స్ ఫాల్కనర్‌కు జట్టులో చోటు కల్పించారు. అంతేగాక, నాథన్ కౌల్టర్‌నైల్‌కు కూడా జట్టులో స్థానం దక్కింది. కాగా, ఆల్‌రౌండర్లు ఆస్టన్ అగర్, హిల్టన్ కార్ట్‌రైట్‌లకు వన్డే బెర్త్ దక్కింది. ఇదిలావుండగా, వన్డే, ట్వంటీ–20 జట్లకు స్టీవ్ స్మిత్ కెపటెన్‌గా వ్యవహరిస్తాడు. మరోవైపు స్టార్ ఆటగాడు డేవిడ్ వార్నర్‌కు వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. మరో స్టార్ అరోన్ ఫించ్ రెండు ఫార్మాట్‌లలోనూ జట్టులో చోటు సంపాదించాడు. ఇక, ట్వంటీ–20 స్పెషలిస్ట్‌గా పేరొందిన ఆల్‌రౌండర్ డానియల్ క్రిస్టియన్ టీ–20 జట్టులో స్థానం దక్కింది. మాక్స్‌వెల్ రెండు జట్లలోనూ స్థానం నిలబెట్టుకున్నాడు. ఏస్ స్పిన్నర్ ఆడమ్ జంపా కూడా రెండింటిలో స్థానం పొందాడు. వికెట్ కీపర్ మాథ్యూ వేడ్, ఫాస్ట్ బౌలర్ హాజిల్‌వుడ్, ఆల్‌రౌండర్లు ఫాల్కనర్, అగర్‌లకు వన్డేల్లో మాత్రం చోటు లభించింది. కమిన్స్, ట్రావిస్ హెడ్, నాథన్ కౌల్టర్ నైల్‌లు రెండు ఫార్మాట్‌లకు ఎంపికయ్యారు.



జట్ల వివరాలు

వన్డే జట్టు: స్టీవ్ స్మిత్ (కెప్టెన్), డేవిడ్ వార్నర్ (వైస్ కెప్టెన్), ఆస్టన్ అగర్, మాక్స్‌వెల్, మాథ్యూ వేడ్, నాథన్ కౌల్టర్ నైల్, కమిన్స్, జేమ్స్ ఫాల్కనర్, అరోన్ ఫించ్, హాజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, మార్కొస్ స్టోయినిస్, ఆడమ్ జంపా, హిల్టన్ కార్ట్‌రైట్.

ట్వంటీ–20 జట్టు: స్టీవ్ స్మిత్ (కెప్టెన్), డేవిడ్ వార్నర్ (వైస్ కెప్టెన్), మాక్స్‌వెల్, నాథన్ కౌల్టర్ నైల్, కమిన్స్, అరోన్ ఫించ్, ట్రావిస్ హెడ్, ఆడమ్ జంపా, మోజెస్ హెన్రిక్స్, టీమ్ పైని, కేన్ రిచర్డ్‌సన్, డానియల్ క్రిస్టియన్, జాసన్ బెహ్రెన్‌డోర్ఫ్.

దంబుల్లాలో ధావన్, పాండ్యా సందడి



దంబుల్లా: భారత క్రికెటర్లు శిఖర్ ధావన్, హార్దిక్ పాండ్యాలు దంబుల్లా నగర వీధుల్లో సందడి చేశారు. భారత్, శ్రీలంక జట్ల మధ్య ఆదివారం ఇక్కడ తొలి వన్డే మ్యాచ్ జరుగనున్న విషయం తెలిసిందే. దీని కోసం భారత జట్టు గురువారమే దంబుల్లా చేరుకుంది. తొలి మ్యాచ్‌కు సమయం ఉండడంతో భారత ఆటగాళ్లు దంబుల్లా వీధుల్లో షికార్లు చేశారు. స్టార్ క్రికెటర్లు హార్దిక్, ధావన్‌లు దంబుల్లా వీధుల్లో తిరుగుతూ సందడి చేశారు. వీరిద్దరూ సరదాగా ఆటోను నడిపి అభిమానులను అలరించారు. సహచర ఆటగాడు పాండ్యా వెనుక సీటులో కూర్చోగా ధావన్ ఆటో నడిపాడు. ఈ దృశ్యాన్ని పాండ్యా తన సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. కాగా, కెప్టెన్ విరాట్ కోహ్లి, ఇతర ఆటగాళ్లు కూడా దంబుల్లా వీధుల్లో సరదగా కలియ తిరిగారు. వీరిని చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. చాలా మంది భారత క్రికెటర్లు వారికి ఆటోగ్రాఫ్‌లు ఇచ్చారు. మరి కొంత మంది సెల్ఫీలు దిగారు. కాగా తాను దంబుల్లా వీధుల్లో చేసిన సందడి దృశ్యాలను ధావన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. కాగా, భారత కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా దంబుల్లాలో దిగిన ఫొటోను ట్వీట్ చేశాడు. టీమిండియా జెర్సినీ ధరించిన కోహ్లి తన బస చేసిన ప్రాంతంలో ప్రత్యేక ఫొటోను దిగిన దాన్ని సోషల్ మీడియాలో ఉంచాడు. దీనికి అభిమానుల నుంచి విపరీత లైక్‌లు వచ్చాయి.

సైక్లింగ్ విజేతకు డిజిపి అభినందన



మన తెలంగాణ/హైదరాబాద్ : బ్రిటన్‌లో ఇటీవల జరిగిన సైక్లింగ్ పోటీలలో పతకాన్ని సాధించిన అంతర్గత భద్రతా విభాగం (ఐఎస్‌డబ్ల్యు) డిఎస్‌పి వి.సదానందరెడ్డిని డిజిపి అనురాగ్‌శర్మ ప్రత్యేకంగా అభినందించా రు. లండన్ నుంచి ఎడన్‌బర్గ్ వరకు దాదాపు 1400 కిలో మీటర్ల సైక్లింగ్ పోటీలలో సదానందరెడ్డి పాల్గొన్నారు. జూలై 30న ప్రారంభమైన పోటీ ఆగస్టు 4 వ తేదీతో ముగిసింది. ఈ పోటీలలో ప్రతిభను చూపిన సదానంద రెడ్డి పతకాన్ని సాధించారు. పతక విజేతను డిజిపి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి అభినందించారు. పర్యావరణ రిత్యా, ఆరోగ్య రిత్యా సైక్లింగ్ ఎంతో ఆరోగ్య కరమైందని ఈ సందర్భంగా డిజిపి అన్నారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల విభాగం అదనపు డిజి అంజనీకుమార్, ఇంటెలిజెన్స్ చీఫ్ నవీన్ చంద్, అంతర్గత భద్రతా విభాగం(ఐఎస్‌డబ్ల్యు) ఐజి ఎంకె సింగ్ తదితరు లున్నారు.

యు ముంబా ఉత్కంఠ గెలుపు



లక్నో: ప్రొ కబడ్డీ ఐదో సీజన్‌లో భాగంగా శుక్రవారం జరిగిన ఉత్కంఠ భరిత పోరులో యు ముంబా 37–34 పాయింట్ల తేడాతో యూపి యోధాను ఓడించింది. లక్నోలోని బనారసి దాస్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో రెండు జట్లు హోరాహోరీగా పోరాడాయి. ఇరు జట్లు సర్వం ఒడ్డడంతో మ్యాచ్ నువ్వానేనా అన్నట్టు సాగింది. ప్రారంభంలో యోధా పైచేయి సాధించింది. రిశంక్ తనదైన రీతిలో చెలరేగడంతో యూపి హవా సాగింది. కానీ, యు ముంబా కూడా వెనక్కి తగ్గలేదు. యోధాకు గట్టి పోటీ ఇస్తూ ముందుకు సాగింది. షబ్బీర్ అసాధారణ రీతిలో చెలరేగి పోయాడు. ప్రత్యర్థి ఆటగాళ్లను హడలెత్తిస్తూ పాయింట్ల పంట పండించాడు. అతనికి అనూప్ మంచి సహకారం అందించాడు. ఇద్దరు కుదురైన ఆటతో ముంబాకు ఆధిక్యాన్ని అందించారు. యూపి కూడా విజయం కోసం చివరి వరకు తీవ్రంగానే పోరాడింది. రెండు జట్లు కూడా నువ్వానేనా అన్నట్టు తలపడడంతో పోరు యుద్ధాన్ని తలపించింది. కాగా, అద్భుత ఆటను కనబరిచిన షబ్బీర్ 13 పాయింట్లు సాధించి ముంబాను ఆదుకున్నాడు. అనూప్ కూడా 8 పాయింట్లు సాధించి జట్టు విజయంలో తనవంతు పాత్ర పోషించాడు. మరోవైపు యూపి జట్టులో రిశంక్ ఆకాశమే హద్దుగా చెలరేగి పోయాడు. ఏకంగా 14 పాయింట్లు సాధించాడు. స్టార్ ఆటగాడు నితిన్ తోమర్ కూడా ఏడు పాయింట్లు నమోదు చేశాడు. కానీ, చివర్లో ముంబా ఆటగాళ్లు పైచేయి సాధించడంతో యూపి స్వల్ప తేడాతో ఓటమి పాలు కాక తప్పలేదు. ముంబాకు ఇది సీజన్‌లో మూడో విజయం కావడం విశేషం. మరోవైపు యూపి యోధా కూడా మూడు మ్యాచుల్లో గెలిచింది.

అలిస్టర్ కుక్ డబుల్ సెంచరీ

బర్మింగ్‌హామ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఓపెనర్ అలిస్టర్ కుక్ జోరు శుక్రవారం రెండో రోజు కూడా కొనసాగింది. వెస్టిండీస్ బౌలర్లను హడలెత్తించిన కుక్ తన కెరీర్‌లో నాలుగో డబుల్ సెంచరీని నమోదు చేశాడు. దీంతో తాజా సమాచారం లభించే సమయానికి ఇంగ్లాండ్ రెండో రోజు 132 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 506 పరుగులు చేసింది. అలిస్టర్ కుక్ అద్భుత బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నాడు. విండీస్ బౌలర్లు దీటుగా ఎదుర్కొన్న కుక్ 241 పరుగులు చేసి అజేయంగా ఉన్నాడు. అతను 33 ఫోర్లతో ఈ పరుగులను సాధించాడు. ఓవర్‌నైట్ స్కోరు 348/3తో శుక్రవారం బ్యాటింగ్ కొనసాగించిన ఇంగ్లాండ్‌ను కుక్, మలాన్ ఆదుకున్నారు. కుక్ తన మార్క్ షాట్లతో చెలరేగి పోయాడు. అతన్ని కట్టడి చేసేందుకు విండీస్ బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు. అసాధారణ బ్యాటింగ్‌ను కబనరిచిన కుక్ తన కెరీర్‌లో నాలుగో డబుల్ సెంచరీని పూర్తి చేశాడు. మరోవైపు డావిడ్ మలాన్ పది ఫోర్లతో 65 పరుగులు చేసి వెనుదిరిగాడు. ఒక వైపు వికెట్లు పడుతున్నా కుక్ తన జోరును కొనసాగించాడు. బైర్‌స్టో (18) అతనికి కొద్ది సేపు అండగా నిలిచాడు.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.